


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు.
పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు
ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 124

గురువారం 25-7-2024


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విజయోస్తు!
పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ సిద్ధం. 16 క్రీడాంశాల్లో 117 మంది బరిలోకి -14లో



తగ్గినా.. 'బంగారమే'
పసిడి ధరలు మున్ముందు పైపైకే.. రూపాయి క్షీణత ఎఫెక్ట్ -15లో



సింగపూర్ పాస్‌పోర్టు పవర్‌ఫుల్
సింగపూర్ పాస్‌పోర్టుతో వీసా లేకుండా 195 దేశాలకు వెళ్లొచ్చు. 'పాస్‌పోర్టు ఇండెక్స్'లో ఇండియాకు 82వ స్థానం దక్కింది.
వివరాలు 6లో ▸



మోసగాళ్లను ఓడించాలి
ట్రంప్ లాంటి అవినీతిపరులను, ద్రోహులను ఎన్నికల పోరాటంలో మట్టికరిపించడమే తన ధ్యేయమని కమలా హారిస్ ఉద్ఘాటించారు.
వివరాలు 6లో ▸



కేంద్ర బడ్జెట్‌పై సభా సమరం
పార్లమెంటు ఉభయసభల్లో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం చోటుచేసుకుంది.
వివరాలు 6లో ▸



సైబర్ చోరులూ... హ్యాండ్సప్!
తీవ్రరూపు దాలుస్తున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా 2024-25 బడ్జెట్లో చర్యలకు మోదీ ప్రభుత్వం ఉపక్రమించింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

వేర్వేరుగా రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు



రాష్ట్రంలో అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఇస్తామన్నారు.
- వివరాలు 2లో▶

'మూసీ'లో అవినీతికి స్కెచ్



'బీఆర్ఎస్ నేతలకు కాళేశ్వరం ఎలా ఏటీఎం అయిందో మూసీ కూడా కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంలా మారనుంది. రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడేందుకు పెద్ద స్కెచ్చే వేశారు' అని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.
- వివరాలు 5లో▶

నేడు కాళేశ్వరానికి బీఆర్ఎస్



కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవ స్థితిగతులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం గురువారం అక్కడ పర్యటించనుంది. తొలుత కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్‌ను సందర్శిస్తుంది. తిరిగి శుక్రవారం కన్నెపల్లి, మేడిగడ్డ బరాజ్‌లను సందర్శిస్తుంది.
- వివరాలు 5లో▶

'చలో చిలుకూరు' ఉద్రిక్తం



చిలుకూరులో వక్ఫ్‌బోర్డు స్థలంలోని పురాతన నిర్మాణాన్ని కూల్చివేయడంతో చెలరేగిన వివాదం ఆందోళనకు దారితీసింది. ఇరు వర్గాల ఆందోళనల నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు ఈ నెల 30 వరకు 144 సెక్షన్ విధించారు.
- వివరాలు 12లో▶

ఇదండీ సంగతి



తెలంగాణపై వివక్ష

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం.. అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

- 'విభజన' హామీల అమల్లో కేంద్రం విఫలం.. ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు
- సీఎం, మంత్రులు ఢిల్లీ వచ్చి ప్రధాని, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేశారు
- కానీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు
- ఈ తీరు పట్ల అసంతృప్తిని, నిరసనను తెలియజేస్తున్నాం..
- బడ్జెట్‌కు సవరణలు చేసి తెలంగాణకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష చూపారంటూ రాష్ట్ర శాసనసభ తీవ్ర అసంతృప్తిని, నిరసనను తెలియజేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ చర్చల్లోనే కేంద్ర బడ్జెట్‌కు సవరణలు చేసి తెలంగాణకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బుధవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయం ముగిశాక.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల చూపిన వివక్షపై విస్తృతంగా చర్చించారు. మంత్రి శ్రీధర్‌బాబు చర్చను ప్రారంభించగా.. తర్వాత కేటీఆర్, బీజేపీపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజిద్ హుస్సేన్ (ఎంఐఎం), కూనంనేని సాంబశివరావు (సీపీఐ), వివేక్ వెంకటస్వామి (కాంగ్రెస్) తదితరులు మాట్లాడారు. చివరగా ఈ తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం సభను స్పీకర్ ప్రసాద్‌కుమార్ గురువారానికి వాయిదా వేశారు.

అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానం ఇదీ..

''డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం.. భారతదేశం అన్ని రాష్ట్రాల సమాఖ్య. అన్ని రాష్ట్రాల సమీకృత, సమ్మిళిత అభివృద్ధి కేంద్ర
మిగతా 5వ పేజీలో ▶

నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం: రేవంత్

- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షను నిరసిస్తూ నిర్ణయం
- విభజన హామీల అమలులో ప్రధాని మోదీ నిర్లక్ష్యం - 2లో▶

అసెంబ్లీలో రేవంత్ వర్సెస్ కేటీఆర్

మీది మేనేజ్‌మెంట్ కోటా..



మీది పేమెంట్ కోటా?



- కేంద్ర బడ్జెట్‌పై చర్చలో ఇద్దరి నడుమ మాటల యుద్ధం
- కేసీఆర్ ఎందుకు రాలేదన్న రేవంత్..మీ స్థాయికి మేం చాలన్న కేటీఆర్

- వివరాలు 5లో

గుండు సున్నా వచ్చినా.. బుద్ధిమారకుంటే ఎలా? అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ విమర్శలు

2లో

మేమెప్పుడూ ప్రజాపక్షమే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ హక్కులను కాలరాశారు: కేటీఆర్

టీడీపీ హింసాకాండకు సంబంధించిన దృశ్యాలను చూస్తున్న యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్, వైఎస్ జగన్, ఐయూఎంఎల్ ఎంపీ వాహబ్ తదితరులు



నరమేధంపై కన్నెర్ర

ఏపీలో ఆటవిక పాలనపై జాతీయ పార్టీల ఆగ్రహం

చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండపై హోరెత్తిన జంతర్ మంతర్

టీడీపీ కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు..
మరో మణిపూర్‌గా మారకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి
దారుణకాండపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలి
ఆ ప్రభుత్వాన్ని ఎందుకు బర్తరఫ్ చేయకూడదు?
సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ, శివసేన (ఉద్ధవ్), ఆప్, ఏఐఏడీఎంకే, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఐయూఎంఎల్, ఎంఐఎం, వీసీకే సహా పలు పార్టీల మండిపాటు
విధ్వంసకాండకు సంబంధించి వీడియో, ఫొటో ప్రదర్శనలు తిలకించిన నేతలు
రాష్ట్రంలో పరిస్థితులపై జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతల విస్మయం
వైఎస్సార్‌సీపీ పోరాటాలకు మద్దతుగా ఉంటామని హామీ
ఏపీ ఇలా మారిపోయిందా అంటూ విస్తుపోయిన జాతీయ మీడియా 12లో

అరాచకాన్ని అడ్డుకుందాం

ప్రజాస్వామ్య పరిరక్షణకు అండగా నిలవండి
జాతీయ మీడియాతో ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్

రాష్ట్ర బడ్జెట్ @ రూ.2.90 లక్షల కోట్లు



- 2024-25 బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం
- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న భట్టి విక్రమార్క.. మండలిలో శ్రీధర్‌బాబు
- వాస్తవిక కోణంతో పాటు ఆదాయం పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌కు రూపకల్పన

సాక్షి, హైదరాబాద్: వాస్తవిక కోణాన్ని ప్రతిబింబిస్తూనే అదనపు ఆదాయ రాబడులు, ఆర్థిక ప్రగతిని దృష్టిలో ఉంచుకుని 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2.90 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు చేసేందుకు సిద్ధమైంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.2,75,890 కోట్లను ప్రతిపాదించిన ప్రభుత్వం దాని కంటే 5 శాతం మేర కేటాయింపుల పెంపుతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నట్లు ఆర్థిక శాఖ వర్గాల ద్వారా తెలిసింది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో పరిశ్రమలు, ఐటీ, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అంతకంటే ముందు ఉదయం 9 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది.



రాబడుల్లో సంస్కరణలు

అప్పుల భారం పెరిగిపోతున్న నేపథ్యంలో అదనపు ఆదాయాన్ని రాబట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టింది. జీఎస్టీ లీకేజీలు అరికట్టాలని, గనుల రాయల్టీ చెల్లింపు ఎగవేతలను నిరోధించాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ ఏడాదిలో భూముల
మిగతా 12వ పేజీలో ▶

తెలంగాణకు రైల్వే కేటాయింపులు రూ.5,336 కోట్లు




- త్వరలోనే చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభిస్తాం
- 100 శాతం రైల్వేలైన్లు ఎలక్ట్రిఫైడ్ అయ్యాయి
- ఢిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

సాక్షి,న్యూఢిల్లీ/హైదరాబాద్: తాజా కేంద్రబడ్జెట్‌లో తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు రూ.5,336 కోట్లు కేటాయించినట్టు రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. 2009-14 మధ్య కాలంలో ఉమ్మడిరాష్ట్ర వార్షిక సగటు కేటాయింపులు రూ.886 కోట్లు మాత్రమేనని.. ప్రస్తుత సంవత్సరం కేటాయింపులు దాదాపు ఆరురెట్లు ఎక్కువని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలోని రైల్‌భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో అశ్వినీవైష్ణవ్ మాట్లాడారు. తెలంగాణలో ప్రస్తుతం కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టుల (కొత్త ట్రాక్‌లు) పనుల మొత్తం అంచనా వ్యయం రూ.32,946 కోట్లుగా ఉందన్నారు. రాష్ట్రంలో రైల్వేట్రాక్ పూర్తిస్థాయిలో విద్యుదీకరణ కూడా పూర్తయిందని చెప్పారు. 2009-2014 మధ్య కాలంలో రాష్ట్రంలో సంవత్సరానికి సగటున కేవలం 17 కి.మీ.మేర మాత్రమే కొత్త ట్రాక్ వేయగా, గత పదేళ్లలో సగటున సంవత్సరానికి 65 కి.మీ. చొప్పున నూతన ట్రాక్ వేసినట్టు వెల్లడించారు. పదేళ్లలో 437 ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు నిర్మించామని తెలిపారు. తెలంగాణలో 40 రైల్వే స్టేషన్‌లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. రీజనల్ రింగ్‌రోడ్డుకు సమాంతరంగా రైల్వేట్రాక్ ఏర్పాటు చేసే ప్రాజెక్టు పరిశీలనలో ఉందని, సిమెంటు పరిశ్రమలు అధికంగా ఉన్న తెలంగాణలోని ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఫ్రైట్ కారిడార్ నిర్మించే అంశాన్ని కూడా



మిగతా 3వ పేజీలో ▶

బిరబిరా కృష్ణమ్మ



శ్రీశైలం ప్రాజెక్టుకు బుధవారం భారీగా చేరిన వరద నీరు

- ఎగువ కృష్ణా పాయలో పెరిగిన వరద ఉధృతి
- ఇటు జూరాల నుంచి, అటు సుంకేశుల నుంచి పోటెత్తుతున్న జలాలు
- 'శ్రీశైలాని'కి పెరుగుతున్న ప్రవాహం..
- నిండుకుండలుగా ఆల్మట్టి, నారాయణపూర్

16లో

తండ్రి, కూతుర్ని బలిగొన్న మంటలు



ప్రమాదానికి గురైన భవనం ఇదే

- షార్ట్‌సర్క్యూట్‌తో సోఫాల కార్ఖానాలో మంటలు
- కార్మికుడైన తండ్రి, కూతురు దుర్మరణం
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు.. హైదరాబాద్ జియాగూడలో దుర్ఘటన

- వివరాలు 10లో

వానాకాలం చదువులు

కురుస్తున్న తరగతి గది గోడలు.. తడవకుండా గొడుగులు పట్టి పాఠాలు వింటున్న విద్యార్థులు..

ఇదీ మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువులు 'నీరు'గారుతున్న తీరు.



తరగతి గదిలో గొడుగులు పట్టుకొని పాఠాలు వింటున్న విద్యార్థులు

ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 55 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదు తరగతులకు మూడే గదులు ఉన్నాయి. మూడింటిలో రెండు గదుల పైకప్పు పగుళ్లు తేలి వర్షానికి కురుస్తున్నాయి. మరో రెండు తరగతుల విద్యార్థులను వరండాలోనూ, డైనింగ్ హాల్‌లోనూ కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తూ నెట్టుకొస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో పన్నెండేళ్ల క్రితం నిర్మించిన తరగతి గదుల స్లాబ్ పైకప్పు పగుళ్లు తేలి కురుస్తోంది. గోడలకు పగుళ్లు ఏర్పడి.. తరగతి గదుల్లోకి నీరు చేరుతోంది. గదిలోకి చేరుతోన్న నీటితో పుస్తకాలు.. పై స్లాబ్ నుంచి కురుస్తున్న నీటితో తామూ తడవకుండా గొడుగులు పట్టుకొని పాఠాలు వింటున్నామని 8వ తరగతి విద్యార్థులు చెబుతున్నారు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా మరమ్మతులు చేసినా, గదులు కురుస్తూనే ఉన్నాయని, వర్షాలకు రూ.6 లక్షల విలువైన డిజిటల్ టీవీ తడిసి పాడైపోయిందని ఉపాధ్యాయులు తెలిపారు. దీనిపై ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డిని సంప్రదించగా..ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. ..:: నెన్నెల


నేపాల్‌లో కూలిన విమానం



సంఘటన స్థలంలో సిబ్బంది సహాయక చర్యలు

- 18 మంది మృతి, పైలట్‌కు గాయాలు
- కఠ్మాండు టీఐఏలో టేకాఫ్ అవుతుండగా ఘటన.. విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- టేబుల్ టాప్ రన్‌వేనే ప్రమాదానికి కారణమా?

- వివరాలు 6లో



ఆగస్టు 2 వరకు బడ్జెట్ సమావేశాలు

- 31న ద్రవ్య వినిమయ బిల్లు
- ఆగస్టు 1, 2 తేదీల్లోనూ ప్రభుత్వ బిల్లులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఆగస్టు 2 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) నిర్ణయం తీసుకుంది. బీఏసీలో తీసుకున్న నిర్ణయం మేరకు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మండలిలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్ ప్రవేశపెడతారు. 26వ తేదీన బడ్జెట్‌ను అధ్యయనం చేయడానికి గాను సభకు సెలవు ప్రకటించారు. ఈనెల 27న శనివారం బడ్జెట్‌పై సాధారణ చర్చ ..అదేరోజు చర్చపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమాధానం ఇస్తారు. 28వ తేదీ ఆదివారం సెలవుదినం. 29, 30 పద్దుల పై చర్చిస్తారు. 31న ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించడంతోపాటు ఇతర బిల్లులను కూడా ఆమోదిస్తారు. ఆగస్టు 1, 2 తేదీల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ బిల్లు, జాబ్ కేలండర్‌పై చర్చించి ఆమోదించనున్నారు. ఆగస్టు 2వ తేదీ తర్వాత అసెంబ్లీ నిరవధికంగా వాయిదా పడనుంది.

నేడు ఉదయం 9గంటలకు కేబినెట్ భేటీ

2024–25 ఆర్థిక ఏడాదికి బడ్జెట్‌ను మంత్రిమండలి గురువారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలులో సమావేశమై ఆమోద ముద్ర వేయనుంది.

దేశానికి రాజనీతిజ్ఞుల కొరత ఉంది: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: దేశానికి రాజనీతిజ్ఞుల కొరత ఉందని మతం, దేవుడు పేరుతో చేసే రాజకీయాలు ఎక్కువ రోజులు సాగవని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబ శివరావు పేర్కొన్నారు. దేశాన్ని పాలించే వ్యక్తి తన కుర్చీ కాపాడు కోవడానికి తనకు మద్దతిచ్చే రాష్ట్రాలకు నిధులిచ్చి, ఇతర రాష్ట్రాలకు మొండిచేయి చూపడం సరికాదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరి గిన అన్యాయంపై బుధవారం జరిగిన చర్చ లో ఆయన మాట్లాడుతూ...దక్షిణ భారత దేశానికి కేంద్రం అన్యాయం చేస్తుందని, ఈ పరిస్థితుల్లో దేశం నుంచి దక్షిణ భారతం విడిపోవాలనే ఆలోచనలు కూడా వచ్చా యని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై అఖిల పక్షం ఢిల్లీ వెళ్లి ధర్నా చేస్తే బాగుంటుందని సూచించారు.

ఆ కార్మికులకు ఐటీ మినహాయింపు

తెలంగాణకు ఐదేళ్ల నుంచి అన్యాయం జరుగుతుందని చెబుతున్న కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నించారు. సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయింపు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో అంశాలను సాధించేందుకు పోరాటం తప్పదన్నారు.

నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం

- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షను నిరసిస్తూ నిర్ణయం: సీఎం రేవంత్‌రెడ్డి
- విభజన హామీల అమలులో ప్రధాని మోదీ నిర్లక్ష్యం
- రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యతగా ఉంటున్నాం
- తెలంగాణకు మేలు చేయాలని కోరుతూ మోదీని పెద్దన్న అన్నాను
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే ప్రధానిని మూడుసార్లు కలిశానని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష చూపడానికి, నిధుల కేటాయింపులో అన్యాయానికి నిరసనగా ఈ నెల 27న జరిగే నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం ఈ మేరకు నిరసన వ్యక్తం చేస్తోందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై బుధవారం అసెంబ్లీలో ప్రత్యేక చర్చ నిర్వహించారు. అనంతరం దీనిపై సీఎం రేవంత్ తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి రాష్ట్రానికి నిధుల కేటాయింపులో, విభజన హామీల అమల్లో కక్షపూరిత వైఖరినే అవలంబిస్తున్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ అధికారంలో ఉన్న పదేళ్ల విభజన చట్టంలోని అంశాలేవీ అమలు కాలేదు. మేం అధికారం చేపట్టాక రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యతగా వ్యవహరిస్తున్నాం. కేంద్ర పెద్దలను కలసి సాయం కోసం విజ్ఞప్తులు చేశాం. స్వయంగా నేను మూడు సార్లు ప్రధానిని.. 18 సార్లు కేంద్ర మంత్రులను కలిశా. తెలంగాణకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశా. మేం ప్రజాస్వామ్య స్ఫూర్తితోనే కలిశాం తప్ప.. ఎవరి దగ్గరో వంగిపోవడానికో.. లొంగిపోవడానికో కాదు. రాష్ట్రానికి వచ్చిన ప్రధానిని కలసి ఓ మెట్టు దిగి.. పెద్దన్నగా సంబోధించి రాష్ట్రానికి మేలు చేయాలని కోరాను. ప్రధానిని పెద్దన్న అన్నందుకు కొందరు నన్ను విమర్శించారు. నాకు సీఎం పదవి ఎవరి దయాదాక్షిణ్యాలతోనో రాలేదు. ప్రజల వల్ల, మా పార్టీ వల్ల, 64 మంది ఎమ్మెల్యేలు నన్ను నాయకుడిగా ఎన్నుకోవడం వల్ల వచ్చింది. ఎవరినో పెద్దన్న అన్నందుకు రాలేదు. బడ్జెట్‌లో అన్యాయాన్ని సరిదిద్దాలని కేంద్రాన్ని కోరేందుకే శాసనసభలో చర్చ లేవనెత్తాం. కానీ కొందరు సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్నే దోషిగా నిలబెట్టాలని, ప్రధాని మోదీని కాపాడాలని ప్రయత్నించడం రాష్ట్రమంతా చూసింది.



శాసనసభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

అది కక్షపూరిత వైఖరి

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి అన్ని రాష్ట్రాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసింది. తొలి ప్రధాని నెహ్రూ అభివృద్ధికి బాటలు వేస్తే.. ఆయన స్ఫూర్తితో ఇందిరాగాంధీ ఎన్నో సరళీకృత విధానాలను తీసుకొచ్చారు. తర్వాత సోనియాగాంధీ నేతృత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా దేశాన్ని ప్రపంచానికి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేశారు. తెలంగాణ అభివృద్ధికి కావాల్సినవన్నీ విభజన చట్టంలో పొందుపరిచి సోనియా తెలంగాణ ఇచ్చారు. కానీ 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం.. ఆ హామీల అమల్లో నిర్లక్ష్యం వహించింది. తెలంగాణపై కేంద్రానిది వివక్ష మాత్రమే కాదు.. కక్షపూరిత వైఖరి.

రూపాయి చెల్లిస్తే.. వస్తున్నది 43 పైసలే

రాష్ట్రం నుంచి ఒక రూపాయిని పన్నులుగా చెల్లిస్తే కేంద్రం తెలంగాణకు తిరిగిస్తున్నది 43 పైసలే. బిహార్‌కు రూపాయికి రూ.7.26 అందుతున్నాయి. యూపీకి కూడా అంతే. ఐదేళ్లలో తెలంగాణ నుంచి రూ.3.68లక్షల కోట్లు పన్నుల రూపంలో కేంద్రానికి వెళితే.. రాష్ట్రానికి ఇచ్చేది రూ.1.68లక్షల కోట్లు మాత్రమే. మోదీ ఏమైనా గుజరాత్‌లోని ఎస్టేట్లు అమ్మి తెలంగాణకు ఇచ్చారా? ఆయన జాగీర్దారు అమ్మి ఇచ్చారా? మన హక్కులు మనకు ఇవ్వకపోవడం వల్లే ఈ అంశంపై సభలో చర్చించాల్సిన పరిస్థితి. ఐదు దక్షిణాది రాష్ట్రాలు పన్నుల రూపంలో కేంద్రానికి చెల్లిస్తున్నది రూ.22.26 లక్షల కోట్లు అయితే.. కేంద్రం వీటికి తిరిగి ఇచ్చింది రూ.6.42 లక్షల కోట్లు మాత్రమే. అదే యూపీ పన్నుల రూపంలో కేంద్రానికి ఇచ్చినది రూ.3.41 లక్షల కోట్లు అయితే.. కేంద్రం యూపీకి తిరిగిచ్చింది రూ.6.91 లక్షల కోట్లు. ఐదు దక్షిణాది రాష్ట్రాలకు ఇచ్చిన నిధుల కంటే ఒక్క యూపీకి ఇచ్చినది ఎక్కువ. ఇదీ కేంద్రం వివక్ష కాదా.. దేశం 5 ట్రిలియన్ ఎకానమీ సాధించాలంటే హైదరాబాద్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ప్రధానికి స్పష్టంగా చెప్పాం. అందరం ఏకతాటిపై ఉంటే కేంద్రం మెడలు వంచి నిధులు సాధించుకోవటం పెద్ద కష్టం కాదు.." అని రేవంత్ పేర్కొన్నారు.

వేర్వేరుగా రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు

- త్వరలో విధివిధానాలు ఖరారు చేసిన తర్వాత దరఖాస్తులు స్వీకరిస్తాం: మండలిలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- అత్యంత పేదలకు గృహలక్ష్మి: పొంగులేటి
- వ్యవసాయం చేసే రైతుకు భరోసా: తుమ్మల





సాక్షి, హైదరాబాద్: అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు వేర్వేరుగా ఇస్తామన్నారు. రేషన్‌కార్డు నిబంధనలతో పోలిస్తే.. ఆరోగ్యశ్రీ కార్డు నిబంధనలు కాస్త భిన్నంగా ఉండడంతో ఈ మేరకు నిర్ణయించామని చెప్పారు. అతి త్వరలో మంత్రివర్గ ఉపసంఘం రేషన్ కార్డులపై భేటీ అవుతుందని, ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదించిన తర్వాత మార్గదర్శకాలు జారీ చేస్తామన్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయి నుంచి నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తులు భద్రంగా ఉన్నా, మరింత లోతైన సమాచారం కోసం దరఖాస్తుల స్వీకరణ అనివార్యమని మంత్రి వెల్లడించారు. బుధవారం శాసనమండలిలో సభ్యులు తాతా మధుసూదన్, వాణీదేవి, జీవన్‌రెడ్డి తదితరులు లేవనెత్తిన అంశాలపై మంత్రి స్పందిస్తూ పైవిధంగా సమాధానమిచ్చారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్కకార్డు కూడా జారీ చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేల సాయం చేస్తామని చెప్పినా, అమలు కాలేదంటూ వాణీదేవి తదితరులు సభలో ప్రస్తావించగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.7,500 కోట్లు రైతులకు అందించినట్టు వెల్లడించారు. రైతుభరోసా పథకానికి సంబంధించి విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదని, ఈ అంశంపై మంత్రివర్గంతోపాటు అన్నిరంగాల నిపుణులు, ప్రజాసంఘాల అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. ఈ అంశంపై ఉభయసభల్లో చర్చించి ఆమోదం పొందిన తర్వాతే రైతుభరోసా అమలు చేస్తామని చెప్పారు. అర్హత ఉన్న రైతులకే భరోసా దక్కుతుందని, గత ప్రభుత్వం రైతులు కాని వారికి కూడా సాయం చేసిందన్నారు. కానీ ఈసారి సాగుచేసే రైతులకు తప్ప కుండా భరోసా అందిస్తామని మంత్రి వివరించారు. ఇందిరమ్మ గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షల సాయం అందిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ పథకం కింద పేదలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

గృహజ్యోతి నిరంతర ప్రక్రియ: ఉపముఖ్యమంత్రి భట్టి

రెండువందల యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంట్ అందిస్తున్నామని, మార్చి 1 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మండలిలో స్పష్టం చేశారు. ఈ పథకం నిరంతరం కొనసాగుతుందన్నారు. చెల్లుబాటు ఆహారభద్రత, రేషన్‌కార్డులున్నవారు ఈ పథకానికి అర్హులని, ఇతరత్రా కారణాలతో ఒక్కోసారి 200 యూనిట్ల కంటే ఎక్కువ బిల్లు వచ్చినప్పుడు జీరో బిల్లు రాదని, ఆ తర్వాతి నెలలో 200 కంటే తక్కువ బిల్లు వస్తే తిరిగి జీరో బిల్లు అమలవుతుందన్నారు. ఈ పథకం కింద అర్హులుంటే ఎప్పటికప్పుడు వారికి పథకాన్ని వర్తింపజే స్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు 1.79కోట్ల మంది ఈ పథకం కింద లబ్ధి పొందారని, రూ.2వేల కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడినప్పు డు మిగులు బడ్జెట్‌తో ఉంటే..పదేళ్లలో అప్పులపాలు చేసి ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థను గాడిన పెడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఒక్కో సమస్యను పరిష్క రిస్తున్నట్టు వివరించారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను త్వరలోనే విడుదల చేస్తామని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గుండు సున్నా వచ్చినా.. బుద్ధి మారకుంటే ఎలా?

- శాసనసభలో బీఆర్‌ఎస్‌పై సీఎం రేవంత్ విమర్శలు
- అభిప్రాయాలు తీసుకుందామనుకుంటే.. వివాదాలు రేపుతున్నారు
- బయటికి పంపిస్తే.. బతుకు జీవుడా అంటూ వెళ్లిపోదామనుకుంటున్నారు
- మీరు ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: అందరి అభిప్రాయాలు, సలహాలు స్వీకరించి ముందుకెళ్లే మంచి సంప్రదాయాన్ని అసెంబ్లీలో నెలకొల్పుదామనుకుంటే.. బీఆర్‌ఎస్ సభ్యులు సభను దుర్వినియోగం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మాజీ మంత్రి కేటీఆర్ సత్యదూరమైన అంశాలను ప్రస్తావిస్తూ.. పాపాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. "బీఆర్‌ఎస్ ఏదో పోరాటం చేసినట్టు, ఆ పోరాటానికి ఢిల్లీ దద్దరిల్లినట్టు, పదేళ్ల చెమటోడ్చి తెలంగాణ అభివృద్ధిని ఆకాశంలోకి తీసుకెళ్లినట్టు చెప్పే ప్రయత్నం మంచిది కాదు. కాంగ్రెస్ రూ.14,500 కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగించింది. అప్పుడు ఏడాదికి రూ.6,500 కోట్లు అప్పులు కట్టాల్సి వచ్చేది. అదే ఇప్పుడు నెలకు రూ.6,500 కోట్లు అప్పుల కింద కడుతున్నాం. మిత్తీలు కట్టీ కట్టీ నడుము వంగిపోయే పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని పెట్టి వెళ్లారు. ఏదో ఉద్ధరించినట్టు చెప్తున్నారు. కేన్సర్, ఎయిడ్స్ లాంటి రోగాలున్నా కూడా ఎర్రగా, బుర్రగా ఉన్నాను కాబట్టి పెళ్లి పిల్లను చూడాలని అడిగినట్టు ఉంది.."అని రేవంత్ ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని దివాళా తీయించారని, ఎక్కడి బిల్లులు అక్కడే పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అసలు విషయాలను పక్కనపెట్టి వివాదాలు రేపితే అసెంబ్లీ నుంచి బయటికి పంపిస్తారనే ఉద్దేశంతో, బతుకు జీవుడా అంటూ వెళ్లిపోవాలని బీఆర్‌ఎస్ సభ్యులు చూస్తున్నారని విమర్శించారు. "అలా పంపవద్దు, బీఆర్‌ఎస్ వారు ప్రజలకు సమాధానం చెప్పించాల్సిందే. అన్ని వివరాలు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే బయటపెడతా.."అని రేవంత్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుండు సున్నా వచ్చినా కూడా బుద్ధి మారకపోతే ఎలాగని వ్యాఖ్యానించారు.

బీఆర్‌ఎస్, బీజేపీలకు రాజకీయాలే ముఖ్యం

- శాసనసభలో ఉపముఖ్యమంత్రి భట్టి విమర్శ
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే అందరూ పనిచేయాలని పిలుపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రయోజనాల కోసమే ప్రభుత్వం శాసనసభలో 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం'పై పెట్టిన చర్చకు ప్రతిపక్షాల నుంచి ఆశించిన మేరకు మద్దతు రాలేదనిపిస్తుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజన చట్టం ద్వారా ఏపీలోని అమరావతి, పోలవరానికి నిధులు ఇస్తామని కేంద్రం చెప్పిందన్నారు. 'తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఈ చట్టాన్ని యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ తీసుకొచ్చారు. విభజన చట్టం ద్వారా హక్కుగా తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడం బాధాకరం. పక్క రాష్ట్రానికి నిధులు ఇచ్చినందుకు మేం బాధపడటం లేదు. కానీ, తెలంగాణకు నిధులు ఇవ్వనందుకు కేంద్రాన్ని అడుగుతున్నాం. తెలంగాణ ప్రయోజనాల కోసమే పుట్టామని చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీ కేంద్రం వివక్షపై గట్టిగా వాదిస్తుందని ఆశించాం. కానీ బీజేపీ ప్రభుత్వానికి కోపం వస్తుందోనన్న భయంతో సభలో తీర్మానం చేయాల్సిన అంశం గురించి కాకుండా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మిగతావి మాట్లాడారు. కేటీఆర్ సీనియర్ శాసనసభ్యుడు, మంత్రిగా పనిచేశారు. ఈనాడు చర్చ జరిగే అంశాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సభానాయకుడికి అనుభవం లేదంటూ అవహేళన చేయడం సరికాదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్.. ప్రభుత్వంతో కలిసి రావాలి. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు శాసనసభలో చర్చకు పెట్టిన తర్వాత అంశాన్ని చెప్పేవారు. కానీ, మేం చర్చకు ముందే అంశం గురించి చెప్పాం. విభజన చట్టం ద్వారా హక్కుగా రావాల్సిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయహోదా, ఐటీఐఆర్, బయ్యారం ఉక్కుకర్మాగారం, ఐఐఎం, నవోదయ స్కూల్స్, వరంగల్- హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్, మూసీ ప్రక్షాళన-అభివృద్ధి, మెట్రోరైల్ విస్తరణ, ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణాలకు కేంద్రాన్ని నిధులు ఇవ్వాలని కోరినా బడ్జెట్లో పైసా కూడా కేటాయించకపోవడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాలు పన్నులు పంపిస్తే, హక్కుగా రావాల్సిన వాటా ఇవ్వకుండా.. రాజకీయ ప్రయోజనం చూసుకుంటున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాలు కేంద్రం వైఖరిపై ఆలోచన చేస్తున్నాయి. రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన అంశం గురించి కేంద్రాన్ని అడగడానికి అన్ని పక్షాలు ప్రభుత్వంతో కలిసి వచ్చి తీర్మానాన్ని ఏకీభవించాలని కోరుతున్నా' అని భట్టి అన్నారు.

యావత్ తెలంగాణ మనసు నొచ్చుకుంది

- దేశంలో తెలంగాణ భాగం కాదా? ఎందుకు విస్మరించారో ప్రజలకు సమాధానం చెప్పాలి
- మనందరం ప్రధానిని అడుగుదాం.. మీ సహకారం కావాలి
- కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై చర్చను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో యావత్ తెలంగాణ మనసు నొచ్చుకుందని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఈ బడ్జెట్.. అసలు బడ్జెట్ ఉద్దేశాన్నే దెబ్బతీసేవిధంగా, అత్యంత వివక్ష పూరితంగా ఉందని అభిప్రాయపడ్డారు. బుధవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల చూపిన వివక్షపై చర్చకు అనుమతించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. అనంతరం ఈ చర్చను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించి మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వం అనుసరించాల్సిన సమాఖ్య న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉంది. కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ అనే పదాన్ని కూడా ప్రస్తావించకపోవడం దారుణం. తెలంగాణ దేశంలోనే పెద్ద గ్రోత్‌ఇంజన్. అలాంటి తెలంగాణ భాగస్వామ్యం లేకుండా దేశాన్ని 5 ట్రిలియన్ల ఆర్థికవ్యవస్థ ఎలా చేస్తారు. ఇతర రాష్ట్రాల అభివృద్ధిని మేం కాదనం. కానీ తమ పార్టీతో ఉన్న వారినే గౌరవిస్తామని, ఇతరులను నిర్లక్ష్యం చేస్తామనడం సమంజసం కాదు. అన్ని రాష్ట్రాలను బలోపేతం చేయకుండా వికసిత భారత్ ఎలా సాధ్యమవుతుంది. 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించిన తర్వాత రాష్ట్రానికి కేంద్రం ఏమైనా చేస్తుందేమోనని ఆశించిన ప్రజలకు అన్యాయం చేశారు. అందుకే తెలంగాణ ప్రజల మనోభావాలను కేంద్రానికి తెలియచేయడానికి అసెంబ్లీలో కేంద్రబడ్జెట్‌పై చర్చ పెట్టాం. కేంద్ర పన్నుల్లో వాటా, ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన నిధులు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, ఐఐఎం, సింగరేణికి బ్లాకుల కేటాయింపు ఇలా అన్ని రంగాల్లోనూ తెలంగాణ చేసిన విజ్ఞప్తులను కనీసం పట్టించుకోలేదు. ఈ దేశంలో తెలంగాణ భాగం కాదా' అని శ్రీధర్‌బాబు నిలదీశారు. రాష్ట్ర బీజేపీ ఎంపీలతో కలిసి బడ్జెట్‌ను సవరించి తెలంగాణకు న్యాయం చేయాలని కోరారు. రాజకీయ పక్షాల సూచనలు, సలహాలు తీసుకుని ముందుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందరం కలిసి వెళ్లి మనందరి ప్రధానిని అడుగుదామని విజ్ఞప్తి చేశారు.

మేమెప్పుడూ ప్రజా పక్షమే

రాష్ట్ర విశాల ప్రయోజనాలే బీఆర్‌ఎస్‌కు పరమావధి

- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ హక్కులను కాలరాశారు
- పదేళ్ల పాటు మేం చెప్పిందే.. ఇప్పుడు కాంగ్రెస్ చెబుతోంది
- రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి బీజేపీ వైఖరి ఇలానే ఉంది
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వంతో కలిసి వస్తాం.. నిలబడతాం
- అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్



అసెంబ్లీలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ హక్కులు కాలరాశారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె.తారక రామారావు ధ్వజమెత్తారు. 'ఒక రాష్ట్రానికి చేయూత అందించి మరో రాష్ట్రానికి చేయి ఇవ్వడం హక్కులను కాలరాయడమే. ఆంధ్రకు ఇవ్వడంలో తప్పు లేదు. కానీ మనకు ఇవ్వకపోవడమే బాధ కలిగిస్తోంది. అధికారంలో ఉండి పదేళ్ల మేం చెప్పిందే ఇప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారు. రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి బీజేపీ వైఖరి ఇలానే ఉంది. మేము ఇచ్చినట్టే కేంద్రం చుట్టూ తిరిగి కాంగ్రెస్ నేతలు విజ్ఞాపనలు ఇచ్చారు. అయినా న్యాయం జరగలేదు. పదేళ్ల కేంద్రం ఇబ్బంది పెట్టినా మేమెక్కడా ఆగలేదు. దేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపాం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎవరితోనూ రాజీ పడేది లేదు. ప్రభుత్వంతో కలిసి వస్తాం.. నిలబడతాం. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మేమెప్పుడూ తెలంగాణ ప్రజల పక్షానే ఉంటాం. రాష్ట్ర విశాల ప్రయోజనాలే బీఆర్‌ఎస్‌కు పరమావధి..' అని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష గురించి బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ పక్షాన కేటీఆర్ మాట్లాడారు.

పార్లమెంటులో బీఆర్‌ఎస్ లేకపోవడమే కారణం

'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన చర్చను మేము స్వాగతిస్తున్నాం.. సమర్థిస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తెలంగాణ అనే పదాన్ని నిషేధిస్తే, ఇప్పుడు పార్లమెంటులో తెలంగాణ ప్రస్తావనే లేకుండా పోయింది. ఇందుకు పార్లమెంటులో బీఆర్‌ఎస్ లేకపోవడం, గులాబీ జెండా ఎగరకపోవడమే కారణం. గణిత శాస్త్రం ప్రకారం 8 + 8 =16 . కానీ ఇప్పుడు 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు కలిపితే గుండు సున్నా వచ్చింది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ చూసిన తర్వాత ప్రతి తెలంగాణ బిడ్డకు కలిగిన భావన ఇదే. అయితే ప్రభుత్వం అసెంబ్లీలో దీనిపై చర్చ పెట్టడం వెనుక కారణం వేరే ఉంది.

మేమెవరితోనూ కలిసేది లేదు.. విలీనమయ్యేది లేదు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీ వెళ్లిన 21 ట్రిప్పులు, విమాన ఖర్చులు వృథా కావడంతో, పైసా రాకపోవడంతో ప్రజల ముందు మొహం చెల్లక ఈ చర్చ పెట్టారు. చర్చ పెట్టాల్సింది ఇక్కడ కాదు. పార్లమెంటులో ఉన్న 99 మంది కాంగ్రెస్ ఎంపీలు కలిసి కొట్లాడాలి. మేము ఎక్కడికీ వెళ్లేది లేదు. ఎవరితోనూ కలిసేది లేదు. విలీనమయ్యేది లేదు. ఇక్కడే ఉంటాం. ఆరు గ్యారంటీలు అమలయ్యేదాకా మిమ్మల్ని అడుగుతూనే, కడుగుతూనే ఉంటాం. ఐటీఐఆర్ తెస్తారా.. చస్తారా ప్రజలు చూస్తారు. మా జెండా, ఎజెండా తెలంగాణమే. ఈ విషయంలో ఎక్కడకు, ఎలా తీసుకెళ్లినా తెలంగాణ ప్రజల కోసం ప్రభుత్వంతో కలిసి వస్తాం..' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

మాపై ఎదురుదాడి ఎందుకు?

కేటీఆర్ మాట్లాడుతున్న సందర్భంలో అధికార కాంగ్రెస్ సభ్యులు పలుమార్లు అడ్డు తగిలారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబులు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించే ప్రయత్నం చేశారు. ఈ దశలో ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ రెండు పార్టీల ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం జరిగి సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర బడ్జెట్‌లో ఏం జరిగిందో చెప్పకుండా కేటీఆర్ పదేళ్ల చరిత్రను చెబుతున్నారంటూ కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. ఇందుకు స్పందించిన కేటీఆర్.. తాము ఎక్కడైనా తప్పు, పొరపాటు చేసి ఉంటే ప్రజలు అందుకు తగిన శిక్ష విధించి ఇక్కడ కూర్చోబెట్టారని, తమపై ఎదురుదాడి ఎందుకని ప్రశ్నించారు.

ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేయండి

సీఎంతో సహా మంత్రులంతా పాల్గొనాలి

బీఆర్‌ఎస్ తరఫున వెయ్యి మంది వచ్చి మద్దతిస్తాం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగినందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రిమండలి అంతా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేయాలని, దానికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని కేటీఆర్ చెప్పారు. 'తెలంగాణకు నిధులు వచ్చేంతవరకు ఆమరణ నిరాహార దీక్ష చేయాలి. అందుకు మా పార్టీ తరఫున వెయ్యి మంది వస్తాం. మేం బీజేపీతో ఎలాంటి చీకటి ఒప్పందం చేసుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి మాపై అలాంటి ఆరోపణలు చేయడం సరికాదు. రామ్‌నాథ్ కోవింద్ దళితుడని, వెంకయ్య నాయుడు తెలుగువారైనందున వారిద్దరికీ మద్దతు ఇచ్చామే తప్ప బీజేపీకి కాదు. రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేసిన యశ్వంత్‌సిన్హాకు రాహుల్‌గాంధీతో కలిసి ఆయనకు మద్దతుగా సంతకం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలి.

చీకటి స్నేహాలు మాకు తెలియవు: చీకటి స్నేహాలు మాకు తెలియవు. రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో బీజేపీ ఎంపీలు పని చేయిస్తారు. ఆయనే బీజేపీతో స్నేహం చేస్తున్నారు. మేం బీజేపీలో విలీనం చేయం. రేవంత్‌రెడ్డిలాగా పరాన్నజీవులం కాదు.. అధికారం కోసం పార్టీలు మారడానికి. మోదీ పేరు చెప్పడానికే రేవంత్‌రెడ్డి ఎందుకు భయపడుతున్నారు?' అని కేటీఆర్ ప్రశ్నించారు.

మీరాకుమార్‌కు మద్దతెందుకు ఇవ్వలేదు: భట్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జోక్యం చేసుకుంటూ.. 'బీజేపీకి బీఆర్‌ఎస్ ప్రతి విషయంలో మద్దతు ఇచ్చింది. బీజేపీ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు దళితుడని మద్దతిచ్చామని అంటున్నారు.. అలాగైతే తెలంగాణ రావడంలో కీలకంగా వ్యవహరించిన అప్పటి స్పీకర్ మీరాకుమార్ దళితురాలే. తెలంగాణ బిల్లు పాస్ కావడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. అలాంటి మీరాకుమార్‌కు బీఆర్‌ఎస్ ఎందుకు మద్దతివ్వలేదు? బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయాలనుకుంటే అది మీ ఇష్టం. కానీ పక్షంలో బీజేపీతో బీఆర్‌ఎస్‌కు సంబంధం లేదని, తాము అంటకాగడం లేదని బీఆర్‌ఎస్ చెప్పాలి. రాజకీయ ప్రయోజనాలు కాదని, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ప్రజలకు వెల్లడించాలి. సింగరేణి గురించైనా, దేని గురించైనా మరో రూపంలో మాట్లాడేందుకు మేము సిద్ధం..' అని భట్టి అన్నారు. కాగా కేటీఆర్ స్పందిస్తూ, 'మీరాకుమార్ అంటే మాకు గౌరవం ఉంది. ఆమెకు మద్దతిస్తూ తీర్మానం చేస్తే మేం ఆమోదిస్తాం..' అని చెప్పారు.

కాంగ్రెస్‌లో టీఆర్‌ఎస్‌ను విలీనం చేద్దామనుకున్నాం

- దిగ్విజయ్ సింగ్ వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయింది
- అప్పుడు రేవంత్.. సోనియాను, రాహుల్‌గాంధీని తిట్టే పనిలో ఉన్నారు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఇచ్చినందుకు 2014లో తాము అప్పటి టీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేద్దామని అనుకున్నామని, అయితే దిగ్విజయ్‌సింగ్ వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయిందంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం అసెంబ్లీలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్‌తో విలీనం చర్చలు జరుపుతున్నప్పుడు ఇదే రేవంత్‌రెడ్డి సోనియాను బలిదేవత అని, రాహుల్‌గాంధీని ముద్దపప్పు అని తిట్టే పనిలో బిజీగా ఉన్నారు. ఏం చేసినా మేం బాజాప్తాగానే చేశాం..' అని కేటీఆర్ స్పష్టం చేశారు. 'కేసీఆర్‌పై రేవంత్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆయన పదవుల కోసం పార్టీలు మారారు. మేం పార్టీ కోసం, తెలంగాణ కోసం పదవులు వదులుకున్నాం. మేం పదవులకు ఒకసారి కాదు వందసార్లు రాజీనామా చేశాం..' అని చెప్పారు. ఎన్నికల సమయంలో ఆరు నెలలు రాజకీయాలు చేద్దామని, మిగతా రోజులు రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దామని సూచించారు. అంతకుముందు బీఆర్‌ఎస్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలపై స్పందించేందుకు తమకు అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కోరగా, స్పీకర్ అవకాశం ఇవ్వలేదు. దీంతో బీఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది.

క్లుప్తంగా...

68.72 లక్షల ఎకరాల్లో పంటల సాగు

● అందులో పత్తి 39.95 లక్షలు.. 12.25 లక్షల ఎకరాల్లో వరినాట్లు



సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్లో బుధవారం నాటికి 68.72 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. మొత్తంగా గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇంకా సాగు విస్తీర్ణం అంతగా పెరగలేదని లెక్కలు తేలుస్తున్నాయి. గతేడాది ఇదే సమయానికి వానాకాలం సీజన్లో 69.96 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే 1.24 లక్షల ఎకరాల్లో సాగు తగ్గిందన్నమాట. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ ఏడాది వానాకాలం అన్ని పంటల సాధారణ సాగువిస్తీర్ణం 1.29 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 53.14 శాతం విస్తీర్ణంలో సాగయ్యాయి. ఇప్పటివరకు సాగైన పంటల్లో అత్యధికంగా పత్తి ఏకంగా 39.95 లక్షల ఎకరాల్లో ఉండగా, వరి సాధారణసాగు విస్తీర్ణం 57.18 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 12.25 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 8.52 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.66 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి.

● ఆదిలాబాద్ జిల్లాలో సాధారణ పంటల సాగువిస్తీర్ణం 5,62,098 ఎకరాలు కాగా, 5,62,685 ఎకరాల్లో సాగైంది. అంటే 100.11 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. ● అత్యంత తక్కువగా వనపర్తి జిల్లాలో కేవలం 13.81 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి.

ఆగస్టు 1 నుంచి బీఆర్క్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఆగస్టు 1వ తేదీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్)లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. మండలి చైర్మన్ లింబాద్రి నేతృత్వంలో బుధవారం జరిగిన సమావేశంలో షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈ సమావేశంలో మండలి వైస్ చైర్మన్లు మహమూద్, వెంకటరమణ, కార్యదర్శి శ్రీ రాం వెంకటేశ్, టీజీ బీఆర్క్ ప్రవేశాల కన్వీనర్‌కుమార్ పాల్గొన్నారు. ఆగస్టు 1 నుంచి 8 వరకు రిజిస్ట్రేషన్.. 17, 18 తేదీల్లో వెబ్ ఆప్షన్లు.. 21న సీట్ల కేటాయింపు చేపడుతున్నట్లు మండలి తెలిపింది. ఆ తర్వాత రెండో దశ కౌన్సెలింగ్ చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించింది.

నేటి నుంచి దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్

Degree Online Services, Telangana (DOST)
Government of Telangana

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్‌ను గురువారం నుంచి చేప డుతున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. 25 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, ఈనెల 27 నుంచి ఆగస్టు 3 వరకు వెబ్ ఆప్షన్లు చేపడుతున్నట్లు తెలిపారు. సీట్ల కేటాయింపు ఆగస్టు 6న ఉంటుందని, సీట్లు వచ్చిన విద్యార్థులు ఆగస్టు 9లోగా రిపోర్ట్ చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని నేషనల్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ సంస్థలో నాలుగేళ్ల బీబీఏ కోర్సులో ప్రవేశాలను దోస్త్ ద్వారా ఈ ఏడాది నుంచి నిర్వహించాలని నిర్ణయించినట్లు లింబాద్రి తెలిపారు. ప్రత్యేక కౌన్సెలింగ్‌లో ఈ సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు.

డీఈసెట్ -2024 ఫలితాల విడుదల

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలను బుధవారం విద్యాశాఖ వెల్లడించింది. తెలుగు మీడియం విద్యార్థులు 8,189 మంది పరీక్ష రాయగా 6,644 (81.13%)అర్హత సాధించారు. ఇంగ్లిష్ మీడియంలో 6,280 మంది పరీక్ష రాయగా 5,024 (80%), ఉర్దూ మీడియంలో 681 మందికి 364 మంది (53.45%) అర్హత పొందారు.

విద్యుత్ ఇంజనీర్లకు పదోన్నతి కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: పదోన్నతులు లేక ఏడేళ్లుగా నిరీక్షిస్తున్న విద్యుత్ ఇంజనీర్లకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఇంజనీర్ల బదిలీలపై సత్వరం విధివిధానాలను ప్రకటించాలని కోరింది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నెహ్రూ, ఎన్.భాస్కర్ బుధవారం విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కో, జెన్‌కో ఇన్‌చార్జి సీఎండీ రోనాల్డ్ రాస్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. 1999–2004 మధ్యకాలంలో నియమితులైన ఉద్యోగులకు జీపీఎఫ్ పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. రామగుండం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో.. కొత్త విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే చేపట్టాలని సూచించారు.

చదువుల తల్లికి సీఎం చేయూత

● మధులత విద్యాభ్యాసానికి ప్రభుత్వ ఆర్థిక సాయం
● సచివాలయంలో చెక్ అందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

వీర్నపల్లి (సిరిసిల్ల): ఐఐటీ పాట్నాలో సీటు సాధించిన పేద గిరిజన విద్యార్థిని బదావత్ మధులత విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని సీఎంవో బుధవారం అధికారికంగా వెల్లడించింది. కోర్సు పూర్తయ్యేవరకు ఆర్థిక సహాయం కొనసాగుతుందని హైదరాబాద్‌కు వెళ్లిన విద్యార్థినితో పాటు వారి కుటుంబీకులకు సీఎంవో హామీ ఇచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గోనేనాయక్ తండాకు చెందిన బదావత్ మధులత జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభచూపి 824వ ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. పాట్నా ఐఐటీలో చదవాలంటే దాదాపు రూ.3 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని సోమవారం 'సాక్షి'లో 'ఐఐటీకి వెళ్లలేక.. మేకల కాపరిగా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇది సీఎంవో దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ విద్యార్థినిని హైదరాబాద్‌కు పిలిచారు. బుధవారం మధులత ఆమె తండ్రి రాములుతో కలిసి వెళ్లింది. చదువు పూర్తి చేసేందుకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందించాలని సీఎం ఆదేశించడంతో గిరిజన సంక్షేమ శాఖ నుంచి నిధుల మంజూరు ఉత్తర్వులు జారీచేశారు. సచివాలయంలో రాష్ట్ర గిరిజన శాఖ కార్యదర్శి శరత్ మధులతకు రూ.1,51,831 చెక్కును అందజేశారు. మధులత కోరిక మేరకు హైఎండ్ కంప్యూటర్ కొనుగోలు కోసం రూ.70 వేలు ఇవ్వడంతో పాటు అదనంగా మరో రూ.30 వేలు కూడా ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని గిరిజన సంక్షేమ శాఖ మధులతకు భరోసా ఇచ్చింది. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు వి.సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, చదువులో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ, మధులతను రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో అభినందించారు. తన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సాక్షితోపాటు తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రికి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధులత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



మధులతకు చెక్కును అందిస్తున్న అధికారులు

కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి

● అసెంబ్లీలో చర్చ పెట్టి తీర్మానాలు చేయడమంటే బ్లాక్ మెయిల్ చేయడమే
● కాంగ్రెస్, బీఆర్ఎస్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయి
● రాజీనామా చేయాల్సింది నేను కాదు.. రేవంత్ రెడ్డి చేయాలి
● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి



ఢిల్లీలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: గతంలో కేసీఆర్ ఎలాగైతే వ్యవహరించారో, అదే తరహాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. నాటి సీఎం కేసీఆర్ బాటలోనే రేవంత్ నడుస్తుండటం.. తెలంగాణ ప్రజల దురదృష్టమన్నారు. గతంలో తమ ప్రభుత్వ అసమర్థత కారణంగా కేంద్రంపై బీఆర్ఎస్ బురదజల్లిన విధంగానే నేడు కాంగ్రెస్ కూడా డ్రామాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. బుధవారం ఢిల్లీలోని అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో చర్చ పెట్టి తీర్మానాలు చేయడమంటే బ్లాక్‌మెయిల్ చేయడమేనని అన్నారు. ఢిల్లీలో దీక్ష చేద్దాం.. ఆమరణ దీక్షలు చేద్దామనడంలోనే వాళ్ల ఆలోచన స్పష్టమైందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సహాయం చేయాలని గతంలో కోరిన బీఆర్ఎస్, కాంగ్రెస్.. నేడు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గత 8 నెలల్లో రేవంత్‌రెడ్డి ఢిల్లీకి ఎక్కువగా వచ్చింది కేవలం తమ పార్టీ నాయకులను, గాంధీ కుటుంబాన్ని కలవడానికేనని ఎద్దేవా చేశారు. రాజీనామా చేయాల్సింది తాను కాదని.. రేవంత్‌రెడ్డే చేయాలని చెప్పారు. కుర్చీ బచావో అనేది కాంగ్రెస్ నినాదమని.. డబ్బులిచ్చి సీఎం సీట్లు కొనుక్కోవడం ఆ పార్టీ సంస్కృతి అనే విషయం ప్రజలకు తెలుసునని విమర్శించారు.

ఎవరి కోసం బహిష్కరిస్తున్నారు?

నీతి ఆయోగ్ సమావేశాన్ని ఎవరి ప్రయోజనాల కోసం బహిష్కరిస్తున్నారని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని బహిష్కరించే సమయం ఎంతో దూరంలో లేదన్నారు. తెలంగాణ పదమే బహిష్కరించారని రేవంత్ అనడం హాస్యాస్పదమని.. తెలంగాణకు ఏం చేయాలో బీజేపీకి బాగా తెలుసునని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో మధ్యప్రదేశ్, రాజస్తాన్, హరియాణా, పుదుచ్చేరి పదాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. వాళ్ల దీక్ష చేసినంత మాత్రాన.. తెలంగాణకు ఏం మేలు జరగదన్నారు. అమరావతికి నిధులిస్తే.. మీకు వచ్చిన ఇబ్బందేమిటి? అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కేంద్రం పదేళ్లలో 10 లక్షల కోట్లు తెలంగాణ అభివృద్ధికి ఇచ్చిందని... అయితే, కేంద్ర ప్రభుత్వ నిధులను దారిమళ్లించిన విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు.

సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచన లేదు

సింగరేణి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు లోక్‌సభ వేదికగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి విషయంలో తెలంగాణ ప్రజానీకానికి, సింగరేణి ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తరఫున భరోసా కల్పించారు. సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51%, కేంద్ర ప్రభుత్వం వాటా 49%గా ఉందని... అలాంటి సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచన కేంద్రానికి లేనే లేదన్నారు. సింగరేణి బలోపేతానికి మోదీ ప్రభుత్వం కృషిచేస్తూనే ఉందని చెప్పారు. తెలంగాణ విద్యుత్ ప్రయోజనాలను కాపాడే ఆలోచనతో.. అవసరమైన అన్ని చర్యలను కేంద్రం తీసుకుంటోందన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై అసెంబ్లీ తీర్మానం దుర్మార్గం: బండి



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలోని ఏ గ్రామ పంచాయతీకైనా వెళ్దాం. కేంద్రం వాటా లేకుండా ఏ పంచాయతీలోనైనా పాలన కొనసాగుతుందని, అభివృద్ధి జరుగుతుందని నిరూపించే దమ్ముందా?' అని సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష చూపారని నిరసిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అసెంబ్లీలో చేసిన తీర్మానం.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ బ్లాక్ పేపర్ తప్ప మరొకటి కాదని ధ్వజమెత్తారు. తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామిగా ఉన్న కేంద్రాన్ని నిందిస్తూ తీర్మానం చేయడమంటే తల్లిపాలు తాగి రొమ్ముగుద్దిన చందంగా ఉందని, ఇది పూర్తిగా ఆత్మహత్యా సదృశమేనని హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కేంద్రం గత పదేళ్లలో ఏమీ చేయలేదని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ అందుకు నిరసనగా అప్పుడు తెలంగాణలో ప్రజా ఉద్యమాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గత పదేళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేంద్రం దాదాపు రూ.10 లక్షల కోట్ల నిధులు వెచ్చించిందనే స్పృహ లేకుండా నిందించడం విచారకరమన్నారు. అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ పాలనపై పలు శ్వేతపత్రాలు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేంద్రం తెలంగాణకు ఖర్చు చేసిన నిధులపై ఎందుకు శ్వేతపత్రం విడుదల చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని సంజయ్ డిమాండ్ చేశారు. దేశంలో తెలంగాణ భాగమని, కేంద్రం ప్రతీ పథకానికి ఖర్చు చేసే నిధుల్లో తెలంగాణ వాటా ఉంటుందనే సోయి మర్చిపోయి ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు బీఆర్ఎస్, ఎంఐఎం నేతలు మాట్లాడటం వారి అవకాశవాదానికి పరాకాష్ట అని బండి మండిపడ్డారు.

తెలంగాణకు రైల్వే కేటాయింపులు రూ.5,336 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలిస్తున్నట్టు చెప్పారు. రైళ్ల పరస్పరం ఢీకొనకుండా ఏర్పాటు చేసే కవచ్‌కు సంబంధించి 4.0 వెర్షన్‌కు ఆమోదం లభించిందని, దీని ఏర్పాటుకు సంబంధించి త్వరలోనే ప్రణాళిక సిద్ధమవుతుందని తెలిపారు. చర్లపల్లి టెర్మినల్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. వర్చువల్ పద్ధతిలో సికింద్రాబాద్ నుంచి దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ, నగర ప్రజారవాణాకు కీలకమైన ఎంఎంటీఎస్ రెండోదశకు సంబంధించి మిగిలిన పనులను రైల్వేశాఖ సొంత నిధులతో పూర్తి చేస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని, దీనికి రాష్ట్ర నిధుల కోసం ఎదురుచూడమని తేల్చిచెప్పారు. బీబీనగర్-గుంటూరు డబ్లింగ్ పనులు మొదలయ్యాయని, జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులను భర్తీ చేస్తామని వెల్లడించారు.







కొన్నిసార్లు కనీసం బతకడం కూడా దానికదే ఒక సాహసోపేత చర్య.
– సెనెకా

సాక్షి

గురువారం, 25 జూలై 2024

నెత్తుటి పాలనపై రణభేరి!

'వెయ్యిమంది పాలకుల నిరంకుశాధికారం కూడా ఒక వ్యక్తిమాత్రుడి హేతువు ముందు దూదిపింజెలా కొట్టుకుపోతుంద'ంటాడు ఇటాలియన్ ఖగోళ శాస్త్రవేత్త గెలీలియో గెలీలి. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన క్షణం నుంచి గూండా మూకల్ని మందలుగా వదుల్తూ హత్యలూ, విధ్వంసాలతో ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న టీడీపీ నేతృత్వంలోని అధికార ఎన్డీయే కూటమికి ఈ జ్ఞానం తలకెక్కే సమయం ఆసన్నమైంది. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు వివిధ జాతీయ పార్టీల నాయకులు హాజరై మద్దతు తెలపడం, హింసాకాండపై ప్రదర్శించిన వీడియోనూ, ఛాయా చిత్రాలనూ చూసి దిగ్భ్రాంతి చెందటం దీన్నే చాటుతోంది. ఏపీలో ఇంత దారుణమైన పరిస్థితులున్నాయని ఇన్నాళ్లుగా తెలియదని సమాజ్‌వాదీ, ఉద్ధవ్ శివసేన, ఆప్, తృణమూల్, ఐయూఎంఎల్, అన్నా డీఎంకే, వీసీకే పార్టీల నేతలు ప్రకటించారు. ఒకటా రెండా... గత యాభై రోజులుగా రాష్ట్రంలో చిత్తూరు మొదలుకొని శ్రీకాకుళం వరకూ ఏదోమూల పాలకపక్ష మూకలు మారణహోమాన్ని సృష్టిస్తున్నాయి. నడిరోడ్లపై పట్టపగలు హత్యలకు పాల్పడుతున్నాయి. కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు, రాళ్లతో ఇళ్లపైకి పోయి వీరంగం వేస్తున్నాయి. బుల్‌డోజర్లతో నివాసగృహాలను నేలమట్టం చేస్తున్నాయి. ఇంతవరకూ 36 మంది ప్రాణాలను పొట్టనబెట్టుకున్నాయి. 300 మందిపై హత్యాయత్నాలు, మొత్తంగా వెయ్యికి పైగా దాడులు జరిగాయి. వీరి ఆగడాలు తట్టుకోలేక దాదాపు 4,000 మంది స్వస్థలాలు విడిచిపోయారు. 30 మంది వరకూ బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ ముఠాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రిగా కూడా బాధ్యతలు వెలగబెడుతున్న ఆయన పుత్రరత్నం లోకేశ్ వెనకుండి ప్రోత్సహిస్తుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిమ్మకు నీరెత్తినట్టు మిగిలిపోయారు. పశ్చిమ బెంగాల్ వంటిచోట్ల జరిగిన స్వల్ప స్థాయి సంఘటనలకే కేంద్ర బలగాలను పంపి హడావిడి చేసిన కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న అరాచకాలను చూసీచూడనట్టు వదిలేసింది. ఎన్డీయే వంచనా శిల్పం ఎంతటిదో చెప్పటానికి మంగళవారం నాటి ఉదంతాలు తార్కాణం. పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ పల్లెసీమల్లో, పట్టణాల్లో భూ యాజమాన్య హక్కులను నిర్ధారించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రాలకు సూచించారు. ఇంచుమించు అదే సమయంలో ఆ కూటమి నేతృత్వంలోనే ఉన్న ఏపీ ప్రభుత్వం గతంలో జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తూ బిల్లు ప్రవేశపెట్టింది. అంతకుముందు ఎన్నికల ప్రచారఘట్టంలో సైతం ఈ చట్టంపై టీడీపీ, జనసేన అధినేతలు అవాకులూ చవాకులూ మాట్లాడుతుంటే బీజేపీ గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది. రాజకీయాల్లో కనీస నైతిక విలువలు పాటించాలన్న స్పృహలేని ఇలాంటి పార్టీలు పాలన చేజిక్కించుకోవటం మన ప్రజాస్వామ్య ప్రారబ్ధం.

'సూపర్ సిక్స్' పేరుతో ప్రజానీకాన్ని వంచించి, ఎన్నికల సంఘాన్ని చెప్పుచేతల్లో పెట్టుకుని సాధించిన గెలుపును చూసి బలుపని భ్రమపడుతున్న కూటమి నేతలు ఇంతవరకూ వాగ్దానాల అమలు ఊసెత్తడం లేదు. వాటి సంగతేం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఫలితాలు వెలువడుతుండగానే ప్రారంభమైన దాడులను కొనసాగించి జనం దృష్టి మళ్లించకపోతే తమకు రాజకీయ మనుగడ లేదన్న నిర్ణయానికొచ్చి ఈ రాక్షసకాండకు తెరలేపారు. వినుకొండలో పట్టపగలు అందరూ చూస్తుండగా టీడీపీ కార్యకర్త జిలానీ వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్త రషీద్‌ను కత్తితో నరికి చంపితే కనీసం ప్రాథమిక దర్యాప్తు కూడా జరపకుండా పల్నాడు జిల్లా ఎస్పీ వ్యక్తిగత కక్షలే ఈ హత్యకు కారణమని ప్రకటించారు. ఇలాంటి అధికారుల కారణంగానే మారణాయుధాలతో రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయి. ఈ హింసాత్మక వాతావరణం పర్యవసానంగానే పసిపిల్లలు మొదలుకొని అనేకమందిపై అత్యాచారాలు సాగుతున్నాయి. హత్యలు జరుగుతున్నాయి. ఆడపిల్లలపై ఎవరు అకృత్యాలకు పాల్పడినా వెంటనే వచ్చి వాలతానని, దుండగులను పట్టి బంధిస్తామని ఎన్నికల ప్రచార సమయంలో పెద్ద కబుర్లు చెప్పిన పవన్ పత్తాలేరు.

దాడులకు, హత్యలకు పాల్పడుతుంటే సాధారణ ప్రజానీకం భయపడి వాగ్దానాలపై తమను నిలదీయటానికి సాహసించరని కూటమి పాలకులు భ్రమపడుతున్నట్టుంది. ఢిల్లీ ధర్నాలో సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ చెప్పినట్టు బుల్డోజర్ పాలన ఎల్లకాలం సాగదు. యూపీలో ఈ తరహా పాలనే సాగిస్తున్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో జనం గట్టిగా బుద్ధి చెప్పారు. కాస్తయినా ఇంగితజ్ఞానం ఉంటే గతం కన్నా తాము మెరుగైన పాలన అందిస్తున్నామని నిరూపించుకోవటానికి కృషి చేయాలి. సకాలంలో హామీలు నెరవేర్చి ప్రజల మన్ననలు పొందాలి. కానీ జరుగుతున్నదంతా అందుకు భిన్నం. బడులు తెరిచి నెల్లాళ్లయినా ఇంతవరకూ 'అమ్మకు వందనం' లేదు. సాగుబడి మొదలై నెల కావస్తున్నా 'రైతు భరోసా' జాడలేదు. నిరుద్యోగులకు నెలకు రూ. 3,000, మహిళలకు నెలకు రూ. 1,500, ఇంటింటికీ మూడు ఉచిత సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కబుర్లు ఎటు పోయాయో తెలియదు. తెల్లారిలేస్తే మారణకాండే పాలకులకు నిత్యకృత్యమైంది. ఇలాంటి ప్రభుత్వానికి కనీసం ఒక్కరోజైనా అధికారంలో కొనసాగే నైతిక హక్కుంటుందా? కేంద్రం కళ్లు తెరవాలి. ఈ అరాచకానికి అడ్డుకట్ట వేయాలి. ఉపేక్షిస్తే సర్వోన్నత న్యాయస్థానంతో చెప్పించుకునే స్థితి వస్తుందని గుర్తించాలి.

యూపీఎస్సీపై మరక తొలగేదెలా?

ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్‌కర్ వివాదం యూపీఎస్సీ ఎంపిక ప్రక్రియలోని లోపాలను ఎత్తిచూపింది. పదవిలో ఉన్నప్పుడే కాకుండా, పదవీ అనంతరం కూడా ఎన్నో అత్యున్నత నియామకాలను సివిల్ సర్వీసెస్ వాళ్లు పొందుతున్నారు. అలాంటప్పుడు ఇందులోకి ఎలాగోలా ప్రవేశించడానికి న్యాయమో, అన్యాయమో ఒక కోటాను వాడుకోవడానికి అవకాశం ఉంది. బుగ్గకారు, అధికారిక వసతి వంటి అప్రధాన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే స్వార్థపరులకు ఈ వ్యవస్థ తలుపులు తెరిచి ఉంచింది. అన్ని దశలలో క్లిష్టమైన మానసిక సామర్థ్యాలు అవసరమయ్యే సివిల్ సర్వీస్ కోసం వైకల్యం కోటాలో మానసిక వైకల్యాన్ని అనుమతించడంలోని హేతుబద్ధతను సిబ్బంది–శిక్షణా సంస్థ(డీఓపీటీ) తప్పనిసరిగా వివరించాలి. వ్యవస్థను సంస్కరించడానికీ, ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికీ నిర్మాణాత్మకమైన బహుముఖ విధానం అవసరం.

ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్‌కర్ చుట్టూ అలుముకున్న వివాదం ఏమిటంటే, ట్రెయినీ ఐఏఎస్‌గా పుణె కలెక్టరేట్‌లో నియమితురాలైన ఆమె బంగ్లా, కారు లాంటివి కావాలని అల్లరి చేయడమే! ఇది తెలిసి మన అత్యున్నత శిక్షణా విభాగం అంతా బాగానే ఉందా అని ప్రజలు ఆశ్చర్యపోయారు. నేడు అందరి దృష్టీ ఖేడ్‌కర్ మీద ఉంది. కానీ ఈ ఉదంతంపై త్వరలోనే సిబ్బంది, శిక్షణా విభాగం(డీఓపీటీ) అదనపు కార్యదర్శి నివేదిక వెల్లడించిన తర్వాత, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) స్వయంగా దీనిపై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

ఈ ఉదంతాన్ని ఖేడ్‌కర్‌తో ప్రారంభించాలంటే, రెండు వేర్వేరు పేర్లతో వైకల్య ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడు ఆమె మనస్సులో ఏముంది అనేది ఆలోచించాలి. ఆమె మొదటి సందర్భంలో ఏ విభాగపు వైకల్యం కోసం దరఖాస్తు చేసుకున్నారు? కొన్ని మీడియా వార్తలు సూచించినట్లుగా ఆమె వాస్తవానికి మరొకదానికి మారారా లేక మరో వక్రమార్గాన్ని జోడించారా? ఆమె తండ్రి ప్రకటించిన వార్షిక ఆదాయం 8 లక్షల రూపాయల గరిష్ఠ పరిమితి కంటే ఎక్కువగా ఉన్నప్పుడు కూడా, నాన్–క్రీమీలేయర్ ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) ధ్రువీకరణను ఎలా పొందగలిగారు? అక్కడి తహసీల్దార్ కూడా ఖేడ్‌కర్ తండ్రీ కూతుళ్ల కోరిక మేరకు ఈ సృజనాత్మక రచనలో తన సముచిత వాటాను పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

వైకల్యాలున్న వ్యక్తుల హక్కుల (ఆర్‌పీడబ్ల్యూడీ) చట్టం– 2016, దీర్ఘకాలిక ప్రాతిపదికన ఒక నిర్దిష్ట విభాగంలో కనీసం 40 శాతం వైకల్యం ఉన్నట్లుగా, వైద్యాధికారి ధ్రువీకరించిన వ్యక్తినే 'బెంచ్‌మార్క్ వైకల్యం' ఉన్న వ్యక్తిగా నిర్వచించింది. 'మానసిక వికలాంగుల' విభాగంలో ఉపాధి కోసం ఆమోదించబడిన వైకల్యపు కనీస శాతం 35. ఖేడ్‌కర్ ఉదంతంలో చాలామంది ఆమె 35 శాతం మానసిక వైకల్యం సమీపంలో కూడా లేదనీ, తన కేసును ముందుకు తీసుకు రావడానికి ఆమె ఉదహరించిన రెండు వైకల్యాల్లో ఇది ఒకటనీ హామీపూర్వకంగా చెబుతున్నారు.

పూజా ఖేడ్‌కర్ కేసు సముద్రంలో నీటిబొట్టంతే కావచ్చు. సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియ నిస్సందేహంగా, కొన్ని వందల ఉద్యోగాల కోసం లక్షకుపైబడిన వార్షిక దరఖాస్తుదారులతో తీవ్రాతితీవ్రమైన పోటీతో కూడి ఉంటుంది. అభ్యర్థులు వాస్తవానికి, డబ్బు, సమయం పరంగా భారీగా పెట్టుబడి పెడతారు. సగటున, వారు తమ అమూల్యమైన కాలంలో రెండు–మూడు సంవత్సరాలు కేవలం సన్నాహకాల్లోనే గడుపుతారు. ఉత్తమంగా ప్రయత్నాలు చేసినప్పటికీ, దానిని సాధించే విషయంలో అత్యంత చురుకైన వారికి కూడా ఎలాంటి హామీ ఉండదు. అటువంటి అత్యున్నత ప్రయోజనాలతో కూడిన వ్యవస్థలో న్యాయమో, అన్యాయమో వైకల్యం సహా వివిధ కోటాలను పోస్టుకు హామీగా ఉపయోగించుకోవడానికి చాలామంది ఆకర్షితులు కావచ్చు.



వివాదాస్పద ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్‌కర్

విచారణ పరిధిని విస్తరించడానికి అన్ని వైకల్య కేసులను ఈ దృక్కోణం నుండి చూడటం సిబ్బంది–శిక్షణా సంస్థ(డీఓపీటీ)కి మంచిది.

సివిల్ సర్వీసెస్‌లోకి ప్రవేశించడానికి అభ్యర్థులు ఎంత దూరమైనా వెళతారు అనేందుకు తగు కారణాలు స్పష్టంగా ఉన్నాయి. ఇది సర్వీసులో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా ప్రతిష్ఠాత్మకమైన, సవాలుతో కూడిన కెరీర్ ఎంపికలను వాగ్దానం చేస్తుంది. చాలామంది మాజీ సివిల్ సర్వెంట్లను ప్రభుత్వం ట్రిబ్యునళ్లు, కమిషన్లు, రెగ్యులేటరీ అథారిటీలు, గవర్నర్ పదవులకు కూడా నియస్తుంటుంది. పలువురు వ్యక్తులు ప్రైవేట్ రంగంలో కూడా అత్యున్నత నియామకాలను అందుకుంటారు. అతి పెద్ద కన్సల్టింగ్ సంస్థలు ఇప్పుడు నయా ట్రెండ్! ప్రభుత్వం లోపల తమ నెట్‌వర్క్‌లను ప్రభావితం చేయాలనే ఆశ వీరికుంటుంది.

సర్వీసులో ఉండగానే వీరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కీలక పదవులు నిర్వహిస్తున్నారు. ఇరవైల మధ్య నుండి చివరి వరకు మాత్రమే వయస్సు గల ఒక వ్యక్తి తరచుగా చిన్న ఐరోపా దేశాల పరిమాణంలో ఉన్న జిల్లాకు ప్రపంచంలో మరెక్కడైనా నాయకత్వం వహించగలరా?

అన్ని దశలలో క్లిష్టమైన మానసిక సామర్థ్యాలు అవసరమయ్యే సివిల్ సర్వీస్ కోసం వైకల్యం కోటాలో మానసిక వైకల్యాన్ని అనుమతించడంలోని హేతుబద్ధతను సిబ్బంది, శిక్షణా సంస్థ(డీఓపీటీ) తప్పనిసరిగా వివరించాలి. కీలకమైన మరొక ప్రశ్న ఏమిటంటే యూపీఎస్సీ పరీక్ష సమర్థత గురించి! పునరావృత అభ్యసన, అర గంట ఇంటర్వ్యూలకు ప్రాధాన్యత ఇవ్వడమే అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఉత్తమమైన మార్గమా? సమగ్రత, సహానుభూతి, సానుకూల నాయకత్వం, సమస్య పరిష్కారం వంటి లక్షణాలను అస్సలు అంచనా వేయలేము. డిఫెన్స్ సర్వీసెస్ విషయంలో లాగా కాకుండా, ఇక్కడ యోగ్యతా పరీక్ష లేదు. తత్ఫలితంగా, మన సివిల్ సర్వీసులను నిర్వహించే విషయంలో ప్రస్తుత సందర్భంలో లాగా, మనకు తక్కువ భావోద్వేగాలు ఉన్న వ్యక్తులు ఉన్నారు. బుగ్గకారు, అధికారిక వసతి వంటి అప్రధాన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే స్వార్థపరులకు ఈ వ్యవస్థ తలుపులు తెరిచి ఉంచింది.

దరఖాస్తుదారులకు ప్రయోజనాలను తగ్గించడానికీ, తద్వారా మోసం, రిగ్గింగ్ అవకాశాలను తగ్గించడానికీ ఒక మార్గం ఏమిటంటే ఎంపిక ప్రక్రియ వ్యవధిని తగ్గించడం. బహుశా సాంకేతికతను ఉపయోగించడం. ప్రతి దశలో మూల్యాంకన ప్రమాణాలు, మార్కింగ్ ప్రమాణాలు, ఇతర సంబంధిత సమాచారాన్ని బహిర్గతం చేయడం ద్వారా పారదర్శకతను పెంచడం అవసరం. తద్వారా సవాళ్లు అధిగమించబడతాయి, పరిష్కరించబడతాయి. వాస్తవానికి, అడ్మినిస్ట్రేటివ్ స్థానాల్లోకి అధిక అర్హత కలిగిన నిపుణులు, డొమైన్ నిపుణుల ప్రవేశం కేవలం పేరును బట్టి ఉండకూడదు. బలమైన పార్శ్వ ప్రవేశ ప్రక్రియ సివిల్ సర్వీసును దాని యథాస్థానంపై నిలిపి ఉంచుతుంది.

యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత దేశ సివిల్ సర్వెంట్లు వారి ఉద్యోగాల కోసం శిక్షణ పొందే లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ భారీ పాత్రను పోషించాలి. రెండు సంవత్సరాల శిక్షణ ఒక అధికారి భవిష్యత్తుకు, ఆమె/అతను పరిస్థితులతో వ్యవహరించే విధానానికి పునాది వేస్తుంది. పేద గిరిజన రైతు జక్కు గోండ్‌పై కార్యకర్త హర్ష్ మందర్ చేసిన కేస్ స్టడీలు నేటికీ చాలామంది మనస్సులలో నిలిచిపోయాయి. పేదరికానికి సంబంధించిన సమస్యలతో వ్యవహరించడంలో ఇవి ఒక తరం అధికారులను ప్రభావితం చేస్తూ వచ్చాయి.

విచ్ఛిన్నమైన వ్యవస్థలతో పోరాడటం కంటే మనం వాటిని సరిదిద్దాలి. ఒక ప్రక్రియపై, దాని న్యాయబద్ధతపై మనకు విశ్వాసం ఉంటే, మనం ఫలితాలను ఆమోదించగలము. ఏదైనా వ్యవస్థను సంస్కరించడానికీ, ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికీ నిర్మాణాత్మకమైన బహుముఖ విధానం అవసరం. రోజులు గడుస్తున్నకొద్దీ, ఎంపిక ప్రక్రియను మోసగించిన అధికారుల ప్రవేశానికీ, ఇటీవలి నీట్ వైఫల్యానికి దారితీసిన లోపాలకూ మధ్య వింతైన సారూప్యత నొక్కి చెప్పబడుతోంది. ఫలితంగా ఈ దేశవ్యాప్త పరీక్షలపై ప్రజల విశ్వాసం సన్నగిల్లింది. ఇలాంటివి జరగకుండా చేయలేని మన లాంటి విశాల దేశానికి ఇది దురదృష్టకరం. వ్యవస్థను సరిగ్గా అమర్చడంలో, దానిపై విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో డీఓపీటీ, యూపీఎస్సీ సరిగ్గా వ్యవహరిస్తాయని ఆశిద్దాము.

– అశోక్ ఠాకూర్ I కేంద్ర మాజీ విద్యా కార్యదర్శి
– ఎస్.ఎస్. మంథా I 'ఏఐసీటీఈ' మాజీ ఛైర్మన్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిరాశపూరిత తీర్పు



ప్రాణాన్ని కాపాడటానికి అత్యంత అవసరమైన శస్త్ర చికిత్స చేయడానికి బదులుగా, 'నీట్' మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మహా అయితే పట్టీ మాత్రమే! మోసాలు, లీకులు కొనసాగకుండా నిరోధం ఏమీలేదు. కోచింగ్ సెంటర్లకు శుభదినమే కానీ ప్రజలకు నిరాశాపూరితం.
– కె. సుజాతా రావు, కేంద్ర మాజీ ఉన్నతాధికారి

ఊహించలేరు!



దేశంలోని టాప్ 10 శాతం ధనికులు తాము దేశంలోని ఒక శాతం ధనికులమని అనుకోవడం నాకెప్పుడూ సరదాగా అనిపిస్తుంటుంది. దేశంలోని ఒక శాతం ధనవంతులు ఎంత ధనవంతులో వీళ్ల ఊహకు కూడా అందదు.
– సుఖద, వ్యాఖ్యాత

ఎందుకు చేయలేదు?



5,07,656 మంది ఆర్ఎస్ఎస్ వలంటీర్లు 92,656 కోవిడ్ రిలీఫ్ కేంద్రాలు నెలకొల్పి, 4,663 కోట్ల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. వాళ్లు ఇవన్నీ చేస్తున్నప్పుడు కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనడం మీద నిషేధం ఉంది. అలాంటప్పుడు మీకు (బీజేపీకి) అవకాశం ఉండీ ఈ నిషేధాన్ని (గతంలో) ఎత్తేయనప్పుడు, కాంగ్రెస్‌ను ఎందుకు నిందించడం?
– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' గౌరవ సంపాదకుడు

'దక్షిణ' అమెరికా



మొత్తంగా అమెరికాలో దక్షిణ భారత పోటీ నడుస్తోంది. తమిళనాడు (కమలా హారిస్) వర్సెస్ ఆంధ్రప్రదేశ్(ఉషా వాన్స్). ఒకవేళ ఏదైనా జరిగి వివేక్ రామస్వామి (కేరళ) కూడా రంగంలోకి దిగాడంటే, అప్పుడూ దక్షిణ భారత పోటీయే అవుతుంది. ఏమైనా ఉత్తర భారతీయులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన విషయం ఇది.
– ఇయాన్ హాల్, హానరరీ ఫెలో

అందరికీ అంతేనా?



మతాలు, జాతులు, కులాలతో నిమిత్తం లేకుండా అందరినీ ఉమ్మడిగా నిరాశలో ఉంచడానికి మనకు నిర్మలా సీతారామన్ లాంటి మరింత మంది నాయకులు కావాలి! (వ్యంగ్యంగా)
– ఆస్థా, కంటెంట్ క్రియేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

కోపానికి మహోగ్ర రూపం... మౌనం!

కామెంట్



కరణ్ థాపర్

మనుషులు భిన్న వైరుధ్యాలతో ఉంటారు. ఉన్నవారు, లేనివారు అని మాత్రమే కాదు. మంచివాళ్లు, చెడ్డవాళ్లు; రూపసులు, కురూపులు; ఇంకా... ఉల్లాసంగా ఉండేవాళ్లు, ఉసూరుమంటూ పడివుండే వాళ్లు; ఆలోచనాపరులు, ఉద్వేగప్రాణులు; తియ్యగా మాట్లాడేవారు, మాటలసలే రానివాళ్లు, అలాగే ఉత్తి పుణ్యానికి భగ్గుమనేవారు కొందరైతే, కోపమే తెచ్చుకోని వారు మరికొందరు. ఈ జాబితాలోని చివరి వైరుధ్యం గురించే నేను ఈ వారం మాట్లాడబోతున్నది. దీనికి కారణం ఏమిటంటే, నేను ఇట్టే చికాకు పడిపోతాను. మర్యాదస్తుల సమాజం నన్ను 'షార్ట్ టెంపర్డ్' అంటుంది. అయితే మీరు నన్ను ఓర్పు లేని, సహనం లేని మనిషి అనవచ్చు. చివరికి కోపధారి అని కూడా.

నాలోని వైరుధ్యం ఏమిటంటే... శాంతంగా ఉండేందుకు నేను ప్రయత్నిస్తున్నానని నాకు అనిపించటంతోనే నేను నా ప్రసన్నతను కోల్పోతూ ఉంటాను. ఎంతగానంటే కోపాన్ని అణచుకోవటం నాకు అలవిమాలిన సవాలుగా అనిపిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఇంగితజ్ఞానం లేకుండా, ఉద్దేశపూర్వకంగా నన్ను రెచ్చగొడుతున్నప్పుడు కొద్ది నిముషాలు మాత్రమే నన్ను నేను నిగ్రహించుకుని ఉండగలను. తర్వాత, హఠాత్తుగా పెను వేగంతో నా చిరునవ్వు మాయమవటం మొదలై, నా మెదడు పదునైన మాటలతో పొంగిపొర్లి దెబ్బకు దెబ్బ తిప్పికొట్టటానికి నేను సిద్ధమౌతాను. ఒక మెరుపుదాడిలా నా కోపం బయటికి బద్దలౌతుంది.

వెసూవియస్ అగ్నిపర్వతంలా అది సత్వరమే చిత్రంగా అంతటా వ్యాప్తి అవుతుంది. అదృష్టవశాత్తూ మరిగి ఉన్న టీ పాత్రలా నేను వేగంగా చల్లబడతాను. కానీ మళ్లీ లావా లాగా – లేదా, చింది పడిన వేడి నీళ్ల మాదిరిగా – ఆ నష్టం చాలా ఎక్కువ కాలం ఉంటుంది. దురదృష్టం ఏమిటంటే నేను కోపం ప్రదర్శించిన వ్యక్తులు గుంభనంగా ఉండిపోతారు. వాళ్లు అంత తేలిగ్గా బద్దలవరు. నిజానికి వాళ్లు అలా బద్దలవటానికి సిద్ధపడేముందు చాలా సమయం తీసుకుంటారు. ఒకసారి బద్దలయ్యాక రోజుల పాటు వారు రగిలిపోతూ ఉంటారు. వెంటనే చల్లారటం ఉండదు.

అలాంటి మనిషి నా భార్య నిషా. మా తొలి తగాదా చాలా చిన్నదైన ఒక విషయం మీద జరిగింది. అది ఇలా సాగింది: తన ధ్యాస నాపై ఉండటాన్ని నేను కోరుకుంటానన్న సంగతి నిషాకు బాగా తెలుసు. నేను ఆశించినట్లే తను ఉండేది. సమస్యేమిటంటే... నేను ఆశిస్తున్నట్లు తను ఉంటున్నానన్న గమనింపును నిషా నాలో కలిగించేది. దాంతో ఆమె నన్ను ఆట పట్టిస్తోందని నాకు తెలిసిపోయింది. అటువంటి సందర్భాలలో నిషా నన్ను 'కె.టి. బాబా' అని పిలిచేది. అలా పిలవటంలో ప్రేమా ఉండేది, నవ్వులాటా ఉండేది.

ఆమె నన్ను ఆట పట్టిస్తోందని నా గ్రహింపునకు వచ్చినప్పుడు మొదట నేను జోక్‌గానే తీసుకున్నాను. కానీ జోకులతో సమస్య ఏమిటంటే మిగతా వారు కూడా వాటిల్లోకి చొరబడతారు. నా బెస్ట్ ఫ్రెండ్ ప్రవీణ్, ఇంకా అఫ్తాబ్, మరొక స్నేహితుడు నిషా మాటల్ని పట్టుకుని నాపైకి నవ్వులాటకు వచ్చేవారు. నిమిషాల వ్యవధిలోనే అది అటువైపు ముగ్గురు, ఇటువైపు ఒక్కరు అయ్యేది. ఆ



తర్వాత నా మతిస్థిమితం నాపై విజయం సాధించి హాస్యమంతా పొడైపోటానికి ఎంతో సమయం పట్టేది కాదు.

నా ఉద్వేగం నా తలలోకి పరుగులు పెట్టేది. నా ముఖం ఎర్రబడేది. నా గొంతు పైకి లేచేది. దురదృష్టవశాత్తూ, ఇలా జరగటం అన్నది రాబోయే ప్రమాదం నుంచి వాళ్లను హెచ్చరించటానికి బదులుగా వాళ్లను మరింతగా నవ్వులాటకు పురిగొల్పేది. ఆ మాటల యుద్ధంలో నేను తలదూర్చేలా నా కోసం వల పన్ని వేడుకగా చూస్తుండేవారు.

ఆ ముగ్గురితో నేను గొడవ పడేవాడినని చెప్పటం సరిగ్గా ఉంటుంది. అయితే ప్రవీణ్, అఫ్తాబ్ నవ్వుతూ కొట్టి పడేస్తే, నిషా నా కోపాన్ని తను చిన్నతనంగా భావించి బాధపడేది. మీరు కనుక పెళ్లయినవారైతే భార్యలు... భర్తల (అలాంటి) తత్వాన్ని అక్కడ ఉన్నదాని కంటే చాలా ఎక్కువగా తీసుకుంటారని తెలుస్తుంది. వాళ్లంతా వెళ్లాక నిషా నాపై తన కోపాన్ని కుమ్మరించింది.

''మీరొక పరమ బుద్ధిహీనుడిలా ప్రవర్తించారు.'' ''నవ్వులాటను తేలిగ్గా తీసుకోలేరా?'' అని నిషా. ''అదేం తమాషాగా లేదు'' అని నేను. ''అందరికీ తెలుసు అదంతా తమాషాకేనని. కానీ అది మీ మీద జోక్ కనుక మీకు కోపం వచ్చింది'' – నిషా. ఇరవై నిముషాల తర్వాత నా కోపం అంతా చల్లారిపోయింది. నేను ప్రశాంతచిత్తుడినై ఉండిపోయాను. కానీ నిషా ఇంకా తన కోపాన్ని లోలోపల అణచుకునే ఉంది.

''కాఫీ'' అని అడిగాను. మౌనం! ''టీ?'' అన్నాను, అది కాకపోతే ఇది అన్నట్లు. మరింతగా మౌనం! ''ఏంటి నీ బాధ?'' అని పెద్దగా అరిచాను... ఆమె నాతో మాట్లాడటానికి తిరస్కరిస్తున్నందువల్ల వచ్చిన కోపంతో. అప్పుడు కూడా మౌనం! ''ఛీ పో...'' అన్నాను. ''నువ్వే ఛీ పో'' అంటూ అప్పుడు నోరు తెరిచి, మళ్లీ మౌనంగా ఉండిపోయింది. ఇదంతా సర్దుకోడానికి రెండు రోజులు పట్టింది.

ఏమైనా, బయటివాళ్లతో వచ్చే తగాదాలు బద్దలయ్యేంతగా గానీ, దీర్ఘ కాలం కొనసాగేంతగా గానీ ఉండవు. ఇట్టే అవి చెలరేగితే చెలరేగి ఉండొచ్చు గాక. నాకిప్పుడు తెలుస్తోంది నా ప్రారంభ ప్రతిస్పందన ఆత్మనిగ్రహం లేనిదిగా, సాధారణంగా నా వైపు నుండే తప్పును ఎత్తి చూపించేదిలా ఉంది అని. కానీ ఏం చేయటం, నాకు తెలివి వచ్చేటప్పటికే బాగా ఆలస్యం అయిపోయింది. తర్వాత నేను చేయగలిగిందంతా నేనే మొదట క్షమాపణలు చెప్పి పరిస్థితిని చక్కబరచుకోవటం. కొన్నిసార్లు అది పని చేస్తుంది కానీ అన్నిసార్లూ కాదు. ఆఫీసులో నా సహోద్యోగులు కొందరు రోజుల తరబడి బిగదీసుకుని ఉండేవారున్నారు.

గతవారం, మానవ ప్రవర్తనల్ని విశ్లేషించే ఒక అమెరికన్ ఇచ్చిన వివరణ అనుకోకుండా నా దృష్టికి వచ్చింది. ''షార్ట్ టెంపర్డ్‌గా ఉండేవాళ్లకు, అంటే... తేలిగ్గా, తరచు తప్పుగా కోపం తెచ్చుకునేవాళ్లకు మనసులో ఏమీ ఉండదు. అంతా పైకే కనబరిచేస్తారు. తమను ఎగతాళి చెయ్యటాన్ని వారు నవ్వుతూ తీసుకుంటారు. అయితే దాని వల్ల వారు తరచు అన్యాయంగా వెక్కిరింపులు పడవలసి వస్తుంది. దాంతో అదుపు తప్పుతారు. వాళ్ల మాదిరిగా నియంత్రణ కోల్పో వటం మంచిదే. కానీ అందులో మీరు నిజాయితీగా ఉండండి. దారి మళ్లించటానికి, మనసులో ఉన్నది దాచిపెట్టుకోటానికి మాత్రమే నిజమైనది కాని మౌనాన్ని కొనసాగించండి.''

నిషా ఈ మాటల్లోని సమర్థనీయతను అంగీకరించి ఉండేదా అని నా ఆశ్చర్యం. లేదంటే, ఆమె పెద్దగా నవ్వి, 'కె.టి. బాబా ఇదంతా మీరు కల్పించారు కదా? వినటానికైతే బాగుంది'' అని ఉండేదా?

కావచ్చు. అప్పుడైతే అది మానవ ప్రవృత్తిలోని గొప్ప విషయం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గాలిలో కదిలే దీపం!

ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు. ఇక్కడ దేనికి, ఎప్పుడు కాలం చెల్లిపోతుందో ఎవ్వరూ చెప్పలేరు. కనుక, ఇక్కడ శాశ్వతమైనది ఏది? అని ప్రశ్న వేసుకుంటే 'అంతాన్ని గురించిన అనిశ్చితియే!' అనే సమాధానం దొరుకుతుంది. ఆ అనిశ్చితిని మనసులో ఒక వాస్తవంగా స్థాపించుకున్న వ్యక్తికి దుఃఖం

జ్యోతిర్మయం

దూరమై, ముక్తి దగ్గరౌతుందని విజ్ఞులు చెప్పారు. వేదాంత పరమైన ఈ వాస్తవాన్ని కనుపర్తి అబ్బయామాత్యుడు, తాను రచించిన 'కవిరాజ మనోరంజనం' ప్రథమాశ్వాసంలోని ఒక సన్నివేశంలో పురూరవుడికి, నారద మహర్షికి మధ్య జరిగిన సంభాషణలో భాగంగా ఒక చక్కటి పద్యంలో చెప్పాడు. తన జనరంజక పాలనను గొప్పగా పొగుడుతున్న నారదుడితో పురూరవుడు ఎందరో రాజులు ఈ పుడమిని ఇంతకు మునుపు గొప్పగా పాలించారు కనుక తనను అంతగా పొగడవలసిన పనిలేదని చెప్పాడు. ఆపై సంభాషణ కొనసాగింపుగా ఇలా అంటాడు:

దేహము వాయుసంచలిత దీపిక, పుత్రకళత్ర మిత్ర సం
దోహము స్వప్నకాలమున దోచెడి సందడి రాజ్యభోగ స
న్నాహము జంత్రపుంబ్రతిమ నాట్యము సంపద యింద్రజాల మీ
యైహికసౌఖ్య మేమి సుఖమంచు దలంచెదనయ్య నారదా!

పద్యం ప్రారంభంలోని 'దేహము వాయుసంచలిత దీపిక' అనే మాటలలో సామాన్యము, విశేషము అయిన రెండు భావాలు అవగత మౌతాయి. మానవ దేహం గాలిలో కదులుతున్న దీపం వంటిది. ఎప్పుడైనా ఆరిపోవచ్చు. ఆ కారణంగా దాని భవితవ్యం అనిశ్చితం అని సామాన్యార్థం. విన్నవెంటనే మనసుకు తోచే అర్థం. ఇక రెండవది – మానవ శరీరంలో ఊపిరి అనే వాయువు ప్రసరిస్తున్నంత వరకు దేదీప్యమానంగా వెలిగే దీపం వంటిది ఈ దేహం. ఊపిరి ప్రసరణం ఆగిపోగానే అదీ ఆగిపోతుంది, ఆరి పోతుంది అనే విశేషమైన భావం! ఈరెండు భావాలు కూడా పద్యంలోని సందర్భానికి సొగసును కూర్చేవే!

'భార్య, బిడ్డలు, బంధువులు, మిత్రులతో కూడిన జీవితం, సందడి అంతా కలలో జరిగేదిగానే భావిస్తాను. జీవం లేని మరబొమ్మ చేసే నాట్యం వంటిది రాజ్యభోగం అనీ, ఇంద్రజాలికుడు వెదజల్లే ధనం వంటిది సంపద అనీ సదా భావించి, ఇహలోకంలో సౌఖ్యం లేదనుకోవడంలోనే సుఖముందని నేను భావిస్తాను!' అనేది పురూరవుడు నారదుడితో చెప్పిన మాటలకు అర్థం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.24 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.8.45 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.57 నుండి 10.48 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.57 వరకు, **అమృత ఘడియలు:** ప.1.17 నుండి 2.45 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.



అసెంబ్లీలో యాదాద్రి లడ్డూ ప్రసాదం పంపిణీ



యాదగిరిగుట్ట రూరల్/హైదరాబాద్: తెలంగాణలో రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మంత్రులు, అన్ని పార్టీల శాసనసభ్యులకు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట మేరకు రైతులు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో రూ.31 వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం హర్షణీయమన్నారు.

ఊసరవెల్లిలా కాంగ్రెస్ ప్రభుత్వం: హరీశ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఊసరవెల్లి కన్నా ఎక్కువగా రంగులు మారుస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దుయ్యబట్టారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకరకంగా, అధికారంలోకి వచ్చాక మరోవిధంగా వ్యవహరిస్తోందని అన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలైనా జాబ్ కేలండర్ విడుదల చేయలేదని విమర్శించారు. గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారని, ఇప్పుడు ఎందుకు దానిపై నోరు మెదపడం లేదని నిలదీశారు. ఉమ్మడి ఏపీలో వైఎస్సార్ ప్రభుత్వం, ఏపీలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 1:100 పద్ధతిలో నియామకాలు చేపట్టాయని గుర్తుచేశారు. ఇప్పుడు ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం 1:50 పద్ధతిలో నియామకం చేయడం ఏంటని ప్రశ్నించారు. నిరుద్యోగుల సమస్యపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడం సరికాదన్నారు. 'రాష్ట్రంలో 21 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ప్రకటించారు. ఇప్పుడు ఎందుకు మెగా డీఎస్సీ వేయలేదు' అని ప్రశ్నించారు.

సిద్దిపేటలో వెలిసిన గుండు సున్నా బోర్డులు



సిద్దిపేట జోన్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించలేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్న క్రమంలో బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ బోర్డులు దర్శనమిచ్చాయి. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ సాధించింది గుండు సున్నా అని పెద్ద పెద్ద అక్షరాలతో టీ పోల్స్, భారీ హోర్డింగ్‌లు పట్టణ ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

తెలంగాణపై వివక్ష

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం బాధ్యత. ఈ ఫెడరల్ స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం విస్మరించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచీ ఇదే ధోరణి కొనసాగుతోంది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల సుస్థిర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. కానీ విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. ఇది తెలంగాణ ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపింది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి, మంత్రులు పలు దఫాలుగా ప్రధాన మంత్రిని, ఇతర కేంద్ర మంత్రులను కలసి వివిధ విజ్ఞప్తులు చేశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం కోరటంతో పాటు చట్ట ప్రకారం రావాల్సిన నిధులు, అపరిష్కృతంగా ఉన్న అంశాలపై అనేక అభ్యర్థనలు అందించారు. కానీ కేంద్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల పూర్తిగా వివక్ష చూపింది. తెలంగాణ పట్ల కేంద్రం అనుసరించిన తీరుపై శాసనసభ తీవ్ర అసంతృప్తిని, నిరసనను తెలియజేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ చర్చల్లోనే కేంద్ర బడ్జెట్‌కు సవరణలు చేసి.. తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఈ సభ తీర్మానం చేస్తోంది..''



మీది మేనేజ్‌మెంట్ కోటా.. మీది పేమెంట్ కోటా



అసెంబ్లీలో రేవంత్ వర్సెస్ కేటీఆర్

- కేంద్ర బడ్జెట్‌పై చర్చలో ఇద్దరి నడుమ మాటల యుద్ధం
- కేసీఆర్ ఎందుకు రాలేదన్న రేవంత్.. మీ స్థాయికి మేం చాలన్న కేటీఆర్
- నేను అయ్యా, తాత పేరు చెప్పుకుని రాలేదన్న సీఎం... రాహుల్, రాజీవ్‌ను అంటున్నారా? అంటూ కేటీఆర్ కౌంటర్
- అన్నదమ్ముల అనుబంధం ఏమైందంటూ ప్రశ్న... మోదీతో ప్రేమలో మురిసిపోయిందెవరని ప్రశ్నించిన రేవంత్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై బుధవారం శాసనసభలో వాడివేడిగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ పక్షాన మాట్లాడిన ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒకరుచేసిన వ్యాఖ్యలను మరొకరు దీటుగా తిప్పికొట్టారు. మధ్యలో డిప్యూటీ సీఎం భట్టి కూడా కలుగజేసుకున్నారు. అయితే ఈ మాటల యుద్ధం ప్రధానంగా రేవంత్ వర్సెస్ కేటీఆర్ అన్నట్టుగా సాగింది.

చర్చా..తీర్మానమా?: కేటీఆర్

కేటీఆర్: కేంద్ర బడ్జెట్‌పై చర్చ పెట్టారా? తీర్మానం చేస్తున్నారా? ఏం అర్థం కావడం లేదు.

రేవంత్: కేంద్ర బడ్జెట్‌పై చర్చ అని స్పష్టంగా చెప్పా. అవగాహన రాహిత్యంతో మళ్లీ ప్రశ్నిస్తే ఎలా?

కేటీఆర్: సీఎం మాట్లాడతారని అనుకున్నాం. మంత్రితో చర్చను ప్రారంభించారు. ముఖ్యమంత్రికి మాట్లాడడం ఇష్టం లేదేమో?

రేవంత్: ఇష్టం లేనిది పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి. కేసీఆర్ ఎందుకు రాలేదు? మోదీ ఎక్కడ చూస్తారో, ఏమవుతుందోననే భయంతో ఇంట్లో కూర్చుని వీళ్లను పంపించి మాట్లాడిస్తున్నారు. వీళ్లా మాట్లాడేది?

కేటీఆర్: ఈ నాయకుడి స్థాయికి మేం చాలు. కేసీఆర్ అవసరం లేదు. మీ సత్తా మాకు తెలుసు. మాకు సమాధానం చెప్పండి చాలు.

మీది అవగాహనా రాహిత్యం: సీఎం

కేటీఆర్: తీర్మానం ఏది? ఏం చేస్తున్నారో అర్థం కాకుండా పోతోంది. ముఖ్యమంత్రి అంటే గతంలో మంత్రిగా చేయలేదు. ఆయనకు అనుభవం లేకపోవచ్చు. అనుభవం ఉన్న మంత్రిగా మీరు (శ్రీధర్‌బాబునుద్దేశించి) చెప్పాలి కదా? మేం మిమ్మల్ని కోరుతున్నాం.

రేవంత్: మీది అవగాహన రాహిత్యం. అనవసర వివాదాలను తేవద్దు. మీది మేనేజ్‌మెంట్ కోటా మాత్రమే కాదు... నయా భూస్వామ్య విధానం. నేను అయ్యా, తాత పేరు చెప్పుకుని రాలేదు. జిల్లా పరిషత్ నుంచి మండలి సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా స్వయంకృషితో ఎదిగి సీఎం అయ్యా. వివాదాలు వద్దు. చర్చలో పాల్గొని మీ అభిప్రాయాలు చెప్పండి.

కేటీఆర్: ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వారికి సహనం, సంయమనం, ఓపిక ఉండాలి. నన్ను మేనేజ్‌మెంట్ కోటా అన్నారు. పేమెంట్ కోటాలో సీఎం సీటు కొట్టేశారని నేను అంటా. అయ్యల పేర్లు చెప్పి అని మాట్లాడుతున్నారు. మీరు రాహుల్ గురించి మాట్లాడుతున్నారా? రాజీవ్ గురించి మాట్లాడుతున్నారా?

మీదాకా వస్తే కానీ అర్థం కాలేదా?: కేటీఆర్

కేటీఆర్: ప్రధాని రాష్ట్రానికి వస్తే పెద్దన్నా అంటూ అన్నదమ్ముల అనుబంధాన్ని పండించారు. కానీ ఏం జరిగింది? మీదాకా వస్తే కానీ అర్థం కాలేదా? మేం ఇన్ని రోజులు చెప్పింది అదే. వారి వ్యవహారం అలానే ఉంటుంది. తత్వం ఇప్పుడైనా మీకు అర్థమైంది చాలు.

రేవంత్: మిషన్ భగీరథ కార్యక్రమానికి 2016, ఆగస్టు 7న మెదక్ జిల్లా కోమటిబండకు ప్రధాని మోదీ వస్తే కేసీఆర్ ఏమన్నారు. మాకు 50 వేల కోట్లు, లక్ష కోట్లు వద్దు. మీ ప్రేమ, ఆశీర్వాదాలు చాలు అనలేదా? ప్యార్ చాహియే అంటూ మోదీ ప్రేమలో మునిగి తేలి తెలంగాణను ముంచలేదా?

బీజేపీని కాపాడింది మీరు కాదా?: రేవంత్

కేటీఆర్: ఎలివేటెడ్ కారిడార్ మేమే తెచ్చాం. రక్షణ శాఖ భూముల విషయంలో ఎంతో చేశాం. ఎవరో చేసిన దాన్ని మా ఖాతాల్లో వేసుకునే అలవాటు లేదు. ఏమీ చేయకుండానే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని మేం చెప్పుకోం. కేంద్రం నిధులివ్వకపోయినా ఆగలేదు. పోరాడాం.. గర్జించాం.

రేవంత్: మీరేదో పోరాటం చేసినట్టు, మీ పోరాటానికి ఢిల్లీ దద్దరిల్లినట్టు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. 2014–21 వరకు ఎన్డీయేకు రాజ్యసభలో మెజార్టీ లేనప్పుడు బీజేపీని కాపాడింది మీరు కాదా? జీఎస్టీ బిల్లు పెట్టగానే బీజేపీ రాష్ట్రాల కంటే ముందే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అసెంబ్లీలో తీర్మానం చేయలేదా? ఆర్టీఐ చట్ట సవరణ బిల్లు, నోట్ల రద్దుకు మద్దతివ్వడంతో పాటు రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడికి ఓట్లు వేసిందెవరు? ఆర్టికల్ 370 రద్దుకు మద్దతిచ్చిందెవరు? ట్రిపుల్ తలాఖ్ అప్పుడు వాకౌట్ చేసిందెవరు? ఇప్పుడు అసలు విషయం పక్కనపెట్టి ఏదో చేశామని చెప్తారా?

ఓల్డ్ సిటీలో అదానీ మనుషుల సంగతి చూడండి: కేటీఆర్

కేటీఆర్: కేంద్రం మోటార్లకు మీటర్లు పెట్టమంటే మేం పెట్టలేదు. రైతుల పక్షాన నిలబడ్డాం. కానీ, ఇప్పుడు హైదరాబాద్‌లో కరెంటును అదానీకి అప్పజెపుతున్నారని వార్తలొచ్చాయి. ఓల్డ్‌సిటీలో అదానీ మనుషులు వచ్చారని గొడవలు జరుగుతున్నాయి చూసుకోండి. ఎంఐఎం ఎమ్మెల్యేలతో మాట్లాడి వారిలో భరోసా కల్పించండి.

భట్టి: అదానీ గురించి మేం ఎప్పుడూ చెప్పలేదు. సభను తప్పుదోవ పట్టించకండి. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. అసలు అంశాన్ని పక్కన పెట్టి ఆవు కథలాగా మళ్లీ పదేళ్ల చరిత్ర చెబుతున్నారు. బీజేపీకి ఎక్కడ కోపం వస్తుందోనని 'ఆవుకు నాలుగు కాళ్లు ఉండును. తోక ఉండును అని అంటున్నారు.

రేవంత్: గాలివాటం వార్తలు పట్టుకుని గాలిమాటలు మాట్లాడడం కాదు. అదానీకి అప్పగిస్తామని మేమెప్పుడూ చెప్పలేదు.

ప్రతి తండాకు బీటీ రోడ్డు, విద్యుత్

- త్వరలో సమగ్ర ప్రణాళిక రూపొందిస్తాం: సీఎం రేవంత్
- రాష్ట్రంలో 6176 గ్రామ పంచాయతీలకు భవనాలు లేవు: సీతక్క
- అన్ని బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి: పొన్నం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని తండాలు, గూడేలకు తాగునీరు, విద్యుత్, బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం త్వరలో సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు రామ్‌చందర్ నాయక్, బీర్ల అయిలయ్య, చిక్కుడు వంశీకృష్ణ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం హయాంలో తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చినా.. కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు. ఇక గత ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చిందే తప్ప రెవెన్యూ గ్రామాలుగా మార్చలేదని పలువురు సభ్యులు ప్రస్తావించగా.. దీనిపై రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క వెల్లడించారు. రాష్ట్రంలోని 6,176 గ్రామ పంచాయితీలకు భవనాలు లేవని చెప్పారు.

15 ఏళ్లు దాటిన బస్సులు తుక్కుకే..

విద్యా సంస్థలకు చెందినవి సహా అన్ని బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు, మెడికల్ కిట్లు, యజమానుల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచే విధానాన్ని తప్పనిసరి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 15 ఏళ్లుపైబడ్డ బస్సులను తుక్కుగా మార్చే నిబంధనను కచ్చితంగా అమలు చేస్తున్నామని చెప్పారు. పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో వాటి సమయాలకు తగినట్టుగా ఆర్టీసీ బస్సులు తిప్పేలా చూస్తామని.. విద్యార్థులకు అవసరమైన సంఖ్యలో బస్సు ట్రిప్పులు నిర్వహిస్తామని వెల్లడించారు.

'మూసీ'లో రూ.లక్ష కోట్ల అవినీతికి స్కెచ్

- ప్రభుత్వంపై బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ధ్వజం
- ఏపీకి స్పెషల్ స్టేటస్ ఇస్తే తెలంగాణ ఎడారి అవుతుందని వ్యాఖ్య
- అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన బీజేపీ సభ్యులు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ సభ్యుల అరుపులు, కేకలతో అసెంబ్లీ సభ దద్దరిల్లింది. బుధవారం కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ జరిగిన చర్చలో బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో అధికార, బీజేపీ సభ్యులకు మధ్య వాగ్వాదం నెలకొంది. పలుమార్లు మహేశ్వర్‌రెడ్డిని మాట్లాడకుండా అడ్డుకోవడం, తర్వాత మంత్రి పొన్నం మాట్లాడుతున్న సమయంలో బీజేపీ సభ్యులు అడ్డుతగులుతుండటం ... పోడియం వద్దకు వెళ్లేందుకు యత్నించడం లాంటి ఘటనలతో గందరగోళం నెలకొంది. చివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు ఏలేటి మాట్లాడుతూ.. 'మూసీ ప్రక్షాళనకు కేంద్రాన్ని నిధులు అడుగుతున్నారు. బీఆర్ఎస్ నాయకులకు కాళేశ్వరం ఎలా ఏటీఎం అయిందో మూసీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు ఏటీఎంలా మారనుంది. రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడేందుకు పెద్ద స్కెచ్చే వేశారు. కేంద్ర బడ్జెట్‌లో చేసిన కేటాయింపుల్లో రాష్ట్రాల ప్రాధాన్యత ఉండదు. కొడంగల్‌కు వేల కోట్ల నిధులు కేటాయించినప్పుడు, మిగతా జిల్లాల వారు చర్చకు డిమాండ్ చేస్తే చర్చకు ఒప్పుకుంటారా? ఆర్ఆర్ఆర్ కోసం కేంద్రం 30 వేల కోట్ల నిధులు ఇచ్చింది. కాంగ్రెస్‌కు చెందిన 8 మంది ఎంపీలు రాజీనామా చేయాలి' అని చెప్పారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ... కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి 8 మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలిగానీ, తామెందుకు చేయాలని ప్రశ్నించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ జోక్యం చేసుకొని కేంద్రం నుంచి నిధులు తెప్పించేందుకు బీజేపీ కృషిచేస్తుందా లేదా అని నిలదీశారు.

ఏపీకి స్పెషల్ స్టేటస్ ఇస్తే తెలంగాణ ఎడారే...

తెలంగాణకు మేలు చేసేందుకే... ఏపీకి స్పెషల్ స్టేటస్ ఇవ్వకుండా కేంద్రం నిధులు కేటాయించిందని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఏపీకి స్పెషల్ స్టేటస్ ఇస్తే తెలంగాణ ఎడారిగా మారిపోతుందన్నారు. అక్కడికే పరిశ్రమలు తరలిపోతాయన్నారు. ఈ విషయంలో మోదీకి మీరు పాలాభిషేకం చేయాలన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మెటీరియల్ థర్డ్ క్లాస్ అని నిర్ధారించారన్నారు.

కేసీఆర్‌ను రమ్మనండి.. ఢిల్లీలో దీక్షకు నేను రెడీ

- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందన
- తెలంగాణకు పైసలు తెచ్చుడో, సచ్చుడో తేల్చుకుందామని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: ''తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం ఢిల్లీలో దీక్ష చేయాలని హరీశ్‌రావు, కేటీఆర్ పదే పదే అడుగుతున్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా నేను కూడా సిద్ధం. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేద్దాం. రాష్ట్రానికి నిధుల కోసమైనా కేసీఆర్ ముందుకు రావాలి. మీరే తారీఖు డిసైడ్ చేయండి. దీక్షకు మేం సిద్ధం. పైసలు తెచ్చుడో, సచ్చుడో తేల్చుకుందాం''అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శాసనసభలో కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్షపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ అన్యాయంపై కేంద్రాన్ని నిలదీయాలని, సీఎం రేవంత్ ఢిల్లీలో దీక్ష చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తే, తాను దీక్షకు సిద్ధమని చెప్పారు. ''మిత్రులు దీక్ష గురించి ఉబలాటపడుతున్నారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చామని మేమెప్పుడూ పదే పదే చెప్పలేదు. దీక్ష మొదలుపెట్టి 24 గంటలు కాకముందే నిమ్మరసం తాగి నిమ్స్ ఆస్పత్రిలో చేరిందెవరో అందరికీ తెలుసు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారుగానీ, అగ్గిపెట్టె మర్చిపోయినట్టు నటించి.. శ్రీకాంతాచారితో పాటు అమాయక విద్యార్థులను మేం బలిగొనలేదు..''అని రేవంత్ వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తమకు మైక్ ఇవ్వాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. భట్టి మాట్లాడాక అవకాశం ఇస్తామని స్పీకర్ చెప్పడంతో గందరగోళం సద్దుమణిగింది.

హరీశ్‌రావు చిట్టీలు అందిస్తున్నారు.. భట్టి వ్యాఖ్యలతో సభలో నవ్వులు

అసెంబ్లీలో చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలు నవ్వులు పూయించాయి. భట్టి మాట్లాడుతున్న సమయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు కాగితం మీద ఏదో రాసి బీఆర్ఎస్ సభ్యులకు ఇచ్చి దానిపై మాట్లాడాల్సిందిగా చెప్పడం కనిపించింది. ఇది చూసిన భట్టి.. ''హరీశ్‌రావు సభ్యులకు చిట్టీలు అందిస్తున్నారు. బీజేపీ వాళ్లకు కూడా చిట్టీలు ఇస్తున్నారు''అని వ్యాఖ్యానించారు. దీంతో సీఎం సహా పాలక, ప్రతిపక్ష సభ్యులు గట్టిగా నవ్వారు. భట్టి తన ప్రసంగం కొనసాగిస్తూ.. బీఆర్ఎస్ హరీశ్‌రావు బీజేపీ హరీశ్‌రావు (సిర్పూరు ఎమ్మెల్యే) ద్వారా బీజేఎల్పీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డికి చిట్టీలు అందిస్తున్నారు'అని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై సభలో దుమారం

బీఆర్ఎస్ సభ్యులు– మంత్రుల మధ్య వాగ్వాదం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఆరోపణలు..ప్రత్యారోపణలతో శాసనసభ ప్రశ్నోత్తరాల సమయం కాసేపు ఉద్రిక్తంగా మారింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశం ఏ స్థితిలో ఉంది..దాని అమలులో జాప్యానికి కారణాలు చెబుతూ.. ఎప్పట్లోగా అమలు చేస్తారో చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, ముఠాగోపాల్, సంజయ్‌లు ప్రశ్నించారు. ఆ ప్రతిపాదన పరిశీలనలో ఉందంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన సమాధానంపై.. జాప్యం లేదు అని చెప్పటమేంటని హరీశ్‌రావు నిలదీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆర్టీసీపై చెప్పిన హామీలను ప్రస్తావించారు. 2015 నాటి వేతన సవరణ బాండు బకాయిలు విడుదల చేస్తున్నట్టు గత ఫిబ్రవరిలో నెక్లెస్ రోడ్డు వద్ద జరిగిన సభలో స్వయంగా సీఎం ప్రకటించి నమూనా చెక్కును చూపారని, ఇప్పటి వరకు ఆ చెక్కు నిధులు నెక్లెస్ రోడ్డు నుంచి బస్‌భవన్‌కు చేరలేదని, మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం ఆర్టీసీకి నిధులు సరిగా రీయింబర్స్ చేయటం లేదని పేర్కొన్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీని చంపేసి ఎన్నికల ముందు ఓట్ల కోసం అసంబద్ధంగా, సంప్రదింపులు లేకుండా విలీనం చేశారని ఎదురుదాడికి దిగారు. గవర్నర్ సంతకం చేయటం లేదంటూ కార్మికులను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టి రాజ్‌భవన్ ముందు ఆందోళన చేయించారన్నారు. త్వరలో అన్ని బకాయిలు చెల్లిస్తామని మంత్రి పేర్కొన్నారు. మంత్రి నుంచి సానుకూల సమాధానం రానందున తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. దీనిని స్పీకర్ తిరస్కరించారు. తమకు నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు కోరినా ఇవ్వలేదు. అదే సమయంలో సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావుకు అదే అంశంపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వటంతో బీఆర్ఎస్ సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. దీనిని మంత్రి శ్రీధర్‌బాబు ఖండించారు. ప్రశ్నోత్తరాల సమయంలో నిరసన వ్యక్తం చేసే ప్రొవిజన్ లేదన్నారు. మరి ఆ ప్రశ్న అడిగిన వారిలో కూనంనేని లేకున్నా, ఆయనకు స్పీకర్ అవకాశం ఇవ్వటం నిబంధనకు విరుద్ధం కాదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని..ఒకసారి ప్రశ్న ఆమోదం కాగానే అది సభ ఆస్తిగా మారుతుందని, దానిపై ఇతర సభ్యులకు మాట్లాడే అధికారం లేదని ఏ రూల్ చెప్పటం లేదని పేర్కొన్నారు. సభ్యులు పోడియం వద్దకు వస్తే బయటకు పంపే నిబంధన కూడా ఉందని, కానీ స్పీకర్ ఆ నిర్ణయం తీసుకోలేదన్నారు. కార్మిక సంఘానికి అప్పట్లో హరీశ్‌రావు గౌరవాధ్యక్షుడిగా ఉంటే ఆయన్ను ఎలా తొలగించాలో ఆ పార్టీ నాయకుడికి తెలియక కార్మిక సంఘాలనే రద్దు చేశారని, అది వారి కుటుంబగొడవ అని, దానితో తమకు సంబంధం లేదని సీఎం అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తుండగానే, స్పీకర్ వాయిదా తీర్మానాలను తిరస్కరించి ఇటీవల చనిపోయిన మాజీ సభ్యుల మృతికి సంతాపం వ్యక్తం చేసి టీ విరామ సమయం ప్రకటించారు.

నేడు కాళేశ్వరం పర్యటనకు బీఆర్ఎస్ బృందం

రేపు కన్నెపల్లి, మేడిగడ్డ సందర్శన

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవ స్థితిగతులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల బృందం గురువారం అక్కడ పర్యటించనుంది. ఉదయం అసెంబ్లీలో రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత అక్కడి నుంచి నేరుగా కాళేశ్వరం వెళ్లనుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు నేతృత్వంలో ఈ బృందం తొలుత కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్‌ను సాయంత్రం సందర్శిస్తుంది. రాత్రి రామగుండంకు చేరుకుని అక్కడే బస చేస్తుంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు కన్నెపల్లి పంప్‌హౌజ్, 11 గంటలకు మేడిగడ్డ బ్యారేజీని సందర్శిస్తుంది. రాత్రికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

బీజేపీకి తెలంగాణ అంటే ఎందుకు కక్ష: పొన్నం



సాక్షి, హైదరాబాద్: బీజేపీకి తెలంగాణ అంటే ఎందుకు అంత కక్ష అని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిలదీశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులపై బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడినంత సేపూ బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి సహా ఆ పార్టీ సభ్యులు అడ్డుచెబుతూనే ఉన్నారు. మరోవైపు బీజేపీ సభ్యుడు ఒకరు ఏయ్ అనడంతో బీసీ మంత్రిని ఇలాగంటే ఊరుకునేది లేదంటూ పొన్నం వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ గందరగోళం మధ్యనే బిగ్గరగా పొన్నం ప్రసంగం కొనసాగింది. మధ్యలో బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి వాటర్ బాటిల్ తీసుకొచ్చి పొన్నంకు ఇవ్వడంతో సభలో నవ్వులు పూశాయి. 'రాష్ట్రానికి న్యాయం జరగాలని మనం ప్రతిపాదిద్దాం. అవసరమైతే బీజేపీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోయి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకుందాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దశలో సుష్మాస్వరాజ్ మద్దతు ఇవ్వకపోతే వీళ్లు తెలంగాణకు అనుకూలంగా ఉండే వారే కాదు. బీజేపీ ఎంపీలకు తెలంగాణ పౌరుషం ఉందా లేదా? తెలంగాణ అమరులను కించపరిచే విధంగా మోదీ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకునేలా సభ తీర్మానం చేయాలి. మళ్లీ రాష్ట్రానికి అన్యాయం జరిగితే బీజేపీ నేతలు కనీసం మాట్లాడటం లేదు'అని అన్నారు.

అధికారం పోయాక నిరుద్యోగులు గుర్తుకొచ్చారా?

బీఆర్ఎస్‌కు మంత్రి సీతక్క ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: అధికారం కోల్పోయాక బీఆర్ఎస్‌కు నిరుద్యోగులు గుర్తుకు వచ్చారని, వారి సమస్యలపై ఆ పార్టీ నిరసనలు తెలపడం హాస్యాస్పదంగా ఉందని పీఆర్, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిందే ఉద్యోగ నియామకాల కోసమని, అలాంటి ముఖ్యమైన అంశాన్ని అధికారంలో ఉన్నప్పుడు అస్సలు పట్టించుకోని చరిత్ర బీఆర్ఎస్‌దని ఆమె మండిపడ్డారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ఆమె ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, పదేళ్లపాటు ఉద్యోగాల భర్తీని పట్టించుకోని ఆ పార్టీ ఇప్పుడు జాబ్ కేలండర్ కోసం డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 30 వేల ఉద్యోగాల భర్తీతో పాటు, జాబ్ నోటిఫికేషన్లు ఇచ్చిందని తెలిపారు. గతంలో నిరసనలను అణగదొక్కిన బీఆర్ఎస్ ఇప్పుడు నిరసనకు దిగడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు.

కేసీఆర్ వస్తే మజా వచ్చేది: రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'గేమ్ ఇప్పుడే స్టార్ట్ అయింది. అసెంబ్లీకి మాజీ సీఎం కేసీఆర్ వస్తే మజా వచ్చేది'అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి జైలుకు పోయే లిస్టులో మొదటి వ్యక్తి'అని అన్నారు. తాను హోంమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లో మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి – రాజగోపాల్‌ల మధ్య ఈ ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. 'కేసీఆర్ రూ. 20, 30 కోట్ల చొప్పున రేటు ఎక్కువ పెట్టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొన్నాడు. మేము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రూ. 5 ,10 కోట్లకు మాత్రమే అడుగుతున్నాం. అందుకే ఇంకా 26 మంది ఎమ్మెల్యేలు మా దగ్గరికి రాలేదు. బీఆర్ఎస్‌లో కొద్ది మంది మంచోళ్లు ఉన్నారు. ప్రశాంత్‌రెడ్డి లాంటి వారిని మేము కొనలేం. జగదీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తే నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు మొత్తం బీఆర్ఎస్‌లోకి వెళతారు'అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ 'మాతో మంచిగుంటే నువ్వు హోంమంత్రి అవుతావు రాజగోపాల్‌రెడ్డి'అని బదులిచ్చారు. 'అసెంబ్లీకి కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు...ఆయన వస్తే మీరు తట్టుకోలేరు'అని వ్యాఖ్యానించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత: కోవింద్



పుస్తకాన్ని విడుదల చేస్తున్న గురూజీ కమ్లేష్ పటేల్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

నందిగామ: ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అప్పుడే లక్ష్య సాధన సులువవుతుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రంలో హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమ్లేష్ డి.పటేల్ ఆధ్వర్యంలో ధ్యాన గురువు పూజ్య చారిజీ మహారాజ్ 97వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామ్‌నాథ్ కోవింద్ ధ్యాన వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక సాధనలో క్రమబద్ధంగా, శ్రద్ధగా ఉండటం ఎంత ముఖ్యమో, క్రమం తప్పకుండా ధ్యానం చేయడమూ అంతే ముఖ్యమన్నారు. అనంతరం చారిజీ రచించిన 'ఫ్రమ్ దాజీ విత్ లవ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. దాజీ గతంలో రచించిన 'ది స్పిరిచువల్ అనాటమీ', 'ది హార్ట్‌ఫుల్ వే' పుస్తకాలతో పాటు ఆడియో బుక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు.

సైబర్ చోరులూ... హ్యాండ్సప్!

ఆన్‌లైన్ నేరాల కట్టడిపై కేంద్రం దృష్టి ● ఏఐ పరిశోధనలకు మరింత ఊతం ● వాటికి బడ్జెట్లో రూ.1,550 కోట్లు

డిజిటల్ చెల్లింపుల్లో భారత్ దూసుకుపోతోంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 46 శాతం వాటా మనదే. వీటిలో ఏకంగా 80 శాతం యూపీఐ చెల్లింపులే. మరోవైపు సైబర్ నేరగాళ్లు కూడా అదే స్థాయిలో పేట్రేగిపోతున్నారు. ఢిల్లీ ఎయిమ్స్ సర్వర్లపై పదేపదే సైబర్ దాడులు, చిరుతిళ్ల తయారీ దిగ్గజం హల్దీరామ్స్‌పై రాన్సమ్‌వేర్ దాడి వంటివి ఇందుకు కేవలం ఉదాహరణలే. గీత ఐదేళ్లలో మన దగ్గర సైబర్ దాడుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. జాతీయ సైబర్ దాడుల నమోదు పోర్టల్‌కు ఈ ఏడాది ఇప్పటిదాకా సగటున రోజుకు కనీసం 7,000 పై చిలుకు ఫిర్యాదులందాయి. వీటి వాస్తవ సంఖ్య ఇంకా భారీగా ఉంటుందని సైబర్ నిపుణులు చెబుతున్నారు. సైబర్ నేరాల్లో భారత్ ప్రస్తుతం ప్రపంచంలో పదో స్థానంలో ఉంది. నానాటికీ తీవ్రరూపు దాలుస్తున్న ఈ బెడదకు అడ్డుకట్ట వేసే దిశగా 2024–25 కేంద్ర బడ్జెట్లో పలు చర్యలకు మోదీ ప్రభుత్వం ఉపక్రమించింది. సైబర్ భద్రతకు నిధులు పెంచింది. కీలకమైన ఆన్‌లైన్ వ్యవస్థలు, డేటా భద్రత, సైబర్ నేరాల కట్టడి, కృత్రిమ మేధలో పరిశోధనలకు రూ.1,550 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.238 కోట్లు కేంద్ర స్థాయిలో సైబర్ భద్రత, నేరాలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించే నోడల్ ఏజెన్సీ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్–ఇన్)కు దక్కాయి. మొత్తమ్మీద సైబర్ భద్రత ప్రాజెక్టులకు రూ.759 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఇవి ఏకంగా 90 శాతం అధికం కావడం విశేషం!

సైబర్ సెక్యూరిటీ కృత్రిమ మేధ ప్రాజెక్టుల కోసం కేంద్ర హోం శాఖకు కేటాయించిన భారీ నిధుల్లోని మొత్తాలను వెచ్చించనున్నారు. ఆ శాఖ అధీనంలో పని చేసే భారత సైబర్ నేరాల (కట్టడి) సమన్వయ కేంద్రం (ఐ4సీ) ఈ తరహా నేరాలపై ఉక్కుపాదం మోపే విషయంలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి సహాయ సహకారాలు అందించనుంది. కీలకమైన ఈ ఏజెన్సీకి ఈసారి నిధులను 84 శాతం పెంచారు. గతేడాది కేవలం రూ.86 కోట్లు ఇవ్వగా ఈసారి రూ.150.95 కోట్లు వెచ్చించనున్నారు.

సైబర్ సెక్యూరిటీ ప్రాజెక్టులకు నిధులను 90 పెంచడమే గాక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు సైబర్ దాడుల ముప్పు ఎదుర్కొన్నప్పుడు తక్షణం స్పందించి అప్రమత్తం చేసే హెచ్చరిక సంస్థ సెర్ట్–ఇన్‌కు కూడా నిధులు పెంచారు.



మహిళలు, చిన్నారుల రక్షణకు..

మహిళలు, చిన్నారులు సైబర్ వలలో చిక్కుతున్న ఉదంతాలు పెరుగుతున్నందున వాటికి అడ్డుకట్ట వేయడంపైనా కేంద్రం దృష్టి సారించింది. అందుకోసం బడ్జెట్‌లో రూ.52.8 కోట్లు కేటాయించారు. డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం, 2023 కింద ఏర్పాటుచేసిన డాటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు జీతభత్యాలు తదితరాల కోసం రూ.2 కోట్లు కేటాయించారు.


ఏఐకి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు

కృత్రిమ మేధ రంగం అభివృద్ధి, విస్తరణ కోసం వచ్చే ఐదేళ్లలో రూ.10,300 కోట్లు ఖర్చుచేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం గత మార్చిలో ప్రారంభించిన ఇండియా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్‌ను పరుగులు పెట్టించనున్నారు. ఇండియాఏఐ మిషన్‌కు ఈసారి రూ.551 కోట్లు కేటాయించడం ఇందులో భాగమే. మొత్తమ్మీద సైబర్ సెక్యూరిటీ, ఏఐ ఇన్నోవేషన్‌కు ఈ బడ్జెట్‌లో రూ.840 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఇది 84 శాతం ఎక్కువ! ఇక ఏఐ, మెషీన్ లెర్నింగ్‌పై విస్తృత పరిశోధనలు చేస్తున్న ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విభాగానికి రూ.255 కోట్ల నిధులిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

భారత్‌లో సైబర్ దాడి ఘటనలు





ఫిర్యాదుల వరద...

భారత్‌లో సైబర్ దాడుల ఉధృతి మామూలుగా లేదు. సొమ్ములు పోయాయంటూ జాతీయ సైబర్ దాడుల నమోదు పోర్టల్‌కు ప్రజలు, సంస్థల నుంచి రోజూ అందుతున్న 7,000 పై చిలుకు ఫిర్యాదుల్లో ఏకంగా 85 శాతం ఆన్‌లైన్ మోసాలే! మన దేశంలో ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు 2019లో కేవలం 26 వేలు కాగా 2021లో 4.5 లక్షలకు, 2023 నాటికి ఏకంగా 15.5 లక్షలకు పెరిగాయి. ఇక ఈ ఏడాది మే నాటికే 7.4 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయి! 2023లో భారత్‌లో ప్రతి 129 మందిలో ఒకరు సైబర్ దాడుల బారిన పడ్డట్టు మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్, అనాలిసిస్ గణాంకాల్లో వెల్లడైంది. ఢిల్లీలో అత్యధికంగా ప్రతి లక్ష మందిలో 755 మంది సైబర్ బాధితులున్నారు. ఈ జాబితాలో హరియాణా (381) తర్వాత తెలంగాణ (261) మూడో స్థానంలో ఉంది.

మన కంపెనీలే లక్ష్యం

కొన్నేళ్లుగా భారత కంపెనీలే లక్ష్యంగా సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఈ ఏడాది రెండో త్రైమాసికంలో సైబర్ నేరగాళ్లకు భారతీయ కంపెనీలే రెండో అతిపెద్ద లక్ష్యంగా మారాయి. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, రుణ, గేమింగ్, డేటింగ్ యాప్‌లతో పాటు ఆన్‌లైన్‌లో పదేపదే చూసే, వెదికే కంటెంట్‌ను ఎరగా వేస్తూ మెల్లిగా ముగ్గులోకి దింపి ఖాతాల్లో ఉన్నదంతా ఊడ్చేసే ఘటనలు భారత్‌లో ఎక్కువైనట్టు పారికర్ సంస్థ హెచ్చరించింది. సైబర్ సెక్యూరిటీకి అందరికంటే ఎక్కువగా అమెరికా ఈ ఏడాది రూ.1.08 లక్షల కోట్లు వెచ్చిస్తోంది. బ్రిటన్ రూ.7,891 కోట్లు కేటాయిస్తోంది.



రైతు నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న రాహుల్

చట్టబద్ధత కోసం తీవ్ర ఒత్తిడి తెస్తాం

- పంటలకు కనీస మద్దతు ధర విషయంలో రాహుల్ ఉద్ఘాటన
- విపక్షనేతతో భేటీ అయిన రైతుసంఘాల నేతలు

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత సాధన కోసం మోదీ సర్కార్‌పై తీవ్రమైన ఒత్తిడి తెస్తామని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. బుధవారం పార్లమెంట్ భవన కాంప్లెక్స్‌లో రాహుల్‌ను రైతు సంఘాల నేతలు కలిశారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 12 మంది రైతునేతల బృందం రాహుల్‌తో సమావేశమై రైతాంగ సమస్యలపై చర్చించారు. ''కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని మా మేనిఫెస్టోలో ప్రస్తావించాం. పూర్తిస్థాయి సమీక్ష తర్వాతే ఇది ఆచరణ సాధ్యమని చెప్పాం. ఈ విషయమై రైతునేతలతో కాంగ్రెస్ చర్చించింది. ఇక 'ఇండియా' కూటమి నేతలతో సమాలోచనల జరిపి ఎంఎస్‌పీ చట్టబద్ధత కోసం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తాం' అని భేటీ తర్వాత రాహుల్ చెప్పారు.

ఉగ్రవాదులు జైలుకు లేదా నరకానికి

హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో క్రియాశీలకంగా ఉన్న ఉగ్రవాదులు అయితే జైలుకు లేదా నరకానికి వెళతారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ బుధవారం రాజ్యసభలో అన్నారు. మోదీ సర్కారు ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోదన్నారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ఇటీవలి ఉగ్ర అలజడికి త్వరలో ముగింపు పలుకుతామని, ఉగ్రవాదులు తమ లక్ష్యాలను అందుకోలేరన్నారు. గత కొద్దిరోజుల్లో కశ్మీర్‌లో 28 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని చెప్పారు.

కవచ్‌కు రూ. 1,112 కోట్లు: మంత్రి వైష్ణవ్



న్యూఢిల్లీ: రైల్వే భద్రతకు బడ్జెట్‌లో పెద్దపీట వేశామని మంగళవారం ఘనంగా చెప్పిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మరుసటి రోజు రాజ్యసభలో అసలు విషయం బయటపెట్టారు. రైలు ప్రమాదాలను నివారించే ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థ కవచ్‌కు తాజా బడ్జెట్లో రూ. 1,112 కోట్లు మాత్రమే కేటాయించినట్లు డీఎంకే ఎంపీలు కనిమొళి, రాణి శ్రీకుమార్‌లు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. కవచ్‌కు ఇప్పటిదాకా రూ.1,217 కోట్లు ఖర్చు పెట్టినట్లు వైష్ణవ్ వివరించారు.


లాలూ ప్రసాద్ యాదవ్‌కు అస్వస్థత



న్యూఢిల్లీ: దాణా కుంభకోణంలో దోషిగా తేలి బెయిల్‌పై బయటికొచ్చిన ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం క్షీణించింది. దీంతో మంగళవారం వెంటనే ఆయనను బిహార్ రాజధాని పట్నా నుంచి హుటాహుటిన ఢిల్లీ ఎయిమ్స్‌కి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. 77 ఏళ్ల లాలూ గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. రెండు మూత్రపిండాలు 75 శాతం విఫలమైన నేపథ్యంలో 2022లో సింగపూర్‌కు వెళ్లి కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నారు. కూతురు రోహిణి ఆచార్య దానంచేసిన కిడ్నీని శస్త్రచికిత్స ద్వారా లాలూకు విజయవంతంగా అమర్చిన విషయం తెల్సిందే. తర్వాత ఆయన భారత్‌కు తిరిగొచ్చినా క్రియాశీలక రాజకీయాల్లో లేరు. అదే ఏడాది ఇంట్లో కిందపడటంతో పలు చోట్ల ఎముకలు విరిగాయి. ఆనాటి నుంచి లాలూను అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.

సింగపూర్ పాస్‌పోర్టు.. పవర్‌ఫుల్

195 దేశాలకు వీసా రహిత ప్రయాణ నదుపాయం



న్యూఢిల్లీ: సింగపూర్ పాస్‌పోర్టు ఉన్నవాళ్లు భలే అదృష్టవంతులు. ఎందుకంటే 195 దేశాలకు వీసా లేకుండా నిక్షేపంగా వెళ్లొచ్చు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుగా సింగపూర్ పాస్‌పోర్టు ఘనత సాధించింది. ఇండియా పాస్‌పోర్టుకు 82వ స్థానం దక్కింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇండియా పాస్‌పోర్టు ర్యాంకు 85 కాగా, ఇప్పుడు కొంత మెరుగుపడింది. ఈ పాస్‌పోర్టుతో ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ తదితర 58 దేశాలకు వీసా లేకుండా వెళ్లే అవకాశం ఉంది. హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ జాబితా తాజాగా విడుదలైంది. భారత పాస్‌పోర్టుతో సమానంగా సెనెగల్, తజకిస్తాన్ దేశాల పాస్‌పోర్టులకు సైతం 82వ ర్యాంకు లభించింది. జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, స్పెయిన్ పాస్‌పోర్టులకు రెండో ర్యాంకు దక్కింది. ఈ దేశాల పాస్‌పోర్టుల్లో 192 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే సౌలభ్యం ఉంది. ఆస్ట్రియా, ఫిన్‌లాండ్, ఐర్లాండ్, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, దక్షిణ కొరియా, స్వీడన్ పాస్‌పోర్టులకు మూడో ర్యాంకు సొంతమైంది. ఈ పోస్‌పోర్టులతో 191 దేశాలకు వీసాలేని ప్రయాణం సాగించవచ్చు.

చందమామపై నీటి జాడలు!

జాబిల్లి నుంచి తెచ్చిన మట్టిలో గుర్తించిన చైనా సైంటిస్టులు



బీజింగ్: చందమామపై నీటి ఆనవాళ్లు ఉన్నాయా? అంటే నిజమేనని చెబుతున్నారు చైనా శాస్త్రవేత్తలు. జాబిల్లి నుంచి తీసుకొచ్చిన మట్టి నమూనాలను పరీక్షించగా, జలం జాడ కనిపించిందని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్) వెల్లడించింది. చైనా 2020లో ప్రయోగించిన చాంగే–5 స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి నుంచి మట్టి నమూనాలను తీసుకొచ్చింది. దాదాపు 2 కిలోల మట్టి, రాళ్ల నమూనాలను భూమిపైకి చేర్చింది. వీటిపై చైనా సైంటిస్టులు పరీక్షలు చేస్తున్నారు. ఈ నమూనాల్లో భారీ స్థాయిలో నీటి అణువులు ఉన్నట్లు గుర్తించారు. 2009లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రయోగించిన చంద్రయాన్–1 స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడిపై నీటి ఆనవాళ్లు ఉన్నట్లు కనిపెట్టింది.

ఫేజ్2 బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: దాదాపు 5,000 కి.మీ.ల దూర శ్రేణి శత్రు క్షిపణులను అడ్డుకునే క్షిపణి రక్షణ వ్యవస్థను రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) విజయవంతంగా పరీక్షించింది. రెండో(ఫేజ్2) ప్రయోగ దశలో ఉన్న మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో పరీక్షించారు. వ్యవస్థ అన్ని పరామితులను ఖచ్చితత్వంతో సాధించిందని రక్షణ శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ముందుగా శత్రు క్షిపణి మాదిరిగా ఒక డమ్మీ క్షిపణిని మధ్యాహ్నం 4.20 గంటలకు ప్రయోగించారు. గగనతలం, సముద్రతలంపై మొహరించిన సాయుధ రాడార్లు వెంటనే ఈ శత్రు క్షిపణి దిశను గుర్తించిన ఇంటర్‌సెప్టార్ వ్యవస్థను క్రియాశీలం చేశాయి. ఇందులోని ఫేస్2 ఏడీ ఎండో అట్మాస్ఫిరిక్ క్షిపణి బయల్దేరి.. శత్రు క్షిపణిని విజయవంతంగా అడ్డుకుంది.

'బ్రిటన్‌తో బంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం'

న్యూఢిల్లీ: బ్రిటన్‌తో ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఇరుదేశాలకు ప్రయోజనం చేకూర్చే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) ఖరారు చేసుకోవాలనే బ్రిటన్ ఆకాంక్షను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ బుధవారం ప్రధాని మోదీని కలిశారు. భారత్– యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం, బలోపేతం చేసుకోవడానికి బ్రిటన్ నూతన ప్రధాని కియర్ స్టార్మర్ ప్రాధాన్యమివ్వడాన్ని మోదీ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పరీక్షల్లో అక్రమాలకు రూ.10 లక్షల జరిమానా

బిహార్ అసెంబ్లీలో కీలక బిల్లు ఆమోదం

పాట్నా: పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలను అరికట్టడమే లక్ష్యంగా బిహార్ ప్రభుత్వం కీలకమైన బిల్లును తీసుకొచ్చింది. ఈ బిల్లు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాల పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే రూ.10 లక్షల జరిమానా విధిస్తారు. ఐదేళ్ల దాకా జైలు శిక్ష విధిస్తారు. ఈ మేరకు పబ్లిక్ పరీక్షలు(అక్రమ వ్యవహారాల నిరోధక) బిల్లు ఆమోదం పొందింది.

రైతులు–ప్రభుత్వం మధ్య అపనమ్మకమే అసలు సమస్య

- రైతుల్లో విశ్వాసం నెలకొల్పే చర్యలు చేపట్టండి
- 'తటస్థ అంపైర్'ను ఏర్పాటు చేయండి
- పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: ప్రభుత్వం–రైతుల మధ్య నెలకొన్న అపనమ్మకాన్ని తొలగించాలని, ఇందుకోసం 'తటస్థ అంపైర్'గా వ్యవహరించే ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. రైతుల సమస్యలు, డిమాండ్లపై చర్చించి, పరిష్కార మార్గాలు కనిపెట్టాలని పేర్కొంది. ప్రభుత్వం–రైతుల నడుమ అపనమ్మకం చోటుచేసుకుందని, ఇదే సమస్యగా మారిందని అభిప్రాయపడింది. రైతులు ఢిల్లీకి వెళ్లకుండా ఈ ఏడాది ఫిబ్రవరిలో మూసివేసిన శంభు సరిహద్దును వెంటనే తెరవాలంటూ పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హరియాణా ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల భూయాన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. రైతులతో చర్చలు జరిపేందుకు ఏనాడైనా ప్రయత్నించారా? అని హరియాణా ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రైతాంగం ఎదుర్కొంటున్న అసలు సమస్యలను ప్రభుత్వాలు గుర్తించడం లేదని పేర్కొంది. వారిలో విశ్వాసం నెలకొల్పే చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ప్రభుత్వానికి, రైతన్నలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపే తటస్థ అంపైర్‌ను(స్వతంత్ర కమిటీ) నియమించాలని హరియాణా, పంజాబ్ ప్రభుత్వాలకు సూచించింది. కమిటీలో ఎవరిని నియమిస్తే బాగుంటుందో ప్రతిపాదించాలని పేర్కొంది. శంభు సరిహద్దు వద్ద బారికేడ్లను తొలగించడానికి ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందుల లేకుండా చూడాలని ఆదేశించింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ధర్మాసనం వచ్చేవారానికి వాయిదా వేసింది.

మోసగాళ్లను ఓడించాలి

ట్రంప్‌పై విమర్శల వర్షం



వాషింగ్టన్: ట్రంప్ లాంటి అవినీతి పరులను, ద్రోహులను ఎన్నికల పోరాటంలో మట్టికరిపించడమే తన ధ్యేయమని రిపబ్లికన్ అభ్యర్థిగా దాదాపు ఖరారైన కమలా హారిస్ ఉద్ఘాటించారు. మంగళవారం విస్కాన్సిన్ రాష్ట్రంలో డెమొక్రటిక్ పార్టీ సమావేశంలో ఆమె తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. అభ్యర్థిత్వానికి సరిపడా మద్దతు కూడగట్టుకున్నాక కమల మాట్లాడిన మొదటి సమావేశం ఇదే. గతంలో కాలిఫోర్నియా ప్రాసిక్యూటర్‌గా పనిచేశానని, తన రికార్డు ఏమిటో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మహిళలను వేధించిన దుర్మార్గులను, అమాయక ప్రజలను దగా చేసిన మోసగాళ్లను, సొంత లాభం కోసం నిబంధనలు అతిక్రమించిన దుష్టులను ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాగా, డెమొక్రటిక్ అభ్యర్థిగా తొలుత బరిలోకి దిగిన బైడెన్‌కు ప్రజల నుంచి వచ్చిన విరాళాలను హారిస్‌కు బదిలీ చేయడం ఆపాలని ట్రంప్ ప్రచార బృందం కోరింది. ఈ మేరకు ఫెడరల్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

సర్వేల్లో హారిస్‌దే పైచేయి

లేటుగా వచ్చినా, లేటెస్ట్‌గా వచ్చారన్న నానుడిని హారిస్ నిజం చేస్తున్నారు. అధ్యక్ష రేసులో బైడెన్‌పై ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన ట్రంప్ జోరుకు ఆమె వచ్చీ రాగానే కళ్లెం వేశారు. మానసిక చురుకుదనం, సవాళ్లను దీటుగా ఎదుర్కోగల సత్తా విషయంలో ట్రంప్ కంటే హారిస్‌కే అమెరికన్లు జైకొట్టడం విశేషం! ఈ విషయమై రాయిటర్స్/ఇప్సోస్ చేసిన తాజా సర్వేలో 56 శాతం మంది హారిస్‌కు ఓటేయగా ట్రంప్‌కు 49 శాతమే దక్కాయి. తాజాగా సోమ, మంగళవారాల్లో సీఎన్ఎన్ జరిపిన దేశవ్యాప్త సర్వేలో కూడా ట్రంప్‌కు 49 శాతం రాగా, హారిస్ 46 శాతం ఓట్లు సాధించారు.

కేంద్ర బడ్జెట్‌పై సభా సమరం

- బీజేపీ, విపక్షాల వాగ్యుద్ధం
- బిహార్, ఏపీలకు పకోడీ, జిలేబీ
- మిగతా రాష్ట్రాలకు మొండిచేయి
- రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే
- ఉభయ సభల్లో వాకౌట్ల పర్వం

న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయసభల్లో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై అధికార, విపక్షాల తీవ్ర వాగ్యుద్ధం చోటుచేసుకుంది. సమాఖ్య స్ఫూర్తికి, పేదలకు బడ్జెట్ ఫక్తు వ్యతిరేకంగా ఉందంటూ విపక్షాలు దుయ్యబట్టాయి. అధికార ఎన్డీఏ కూటమి భాగస్వాములను ప్రసన్నం చేసుకోవడానికే మోదీ సర్కారు పరిమితమైందని ఆరోపించాయి. రాజ్యసభ, లోక్‌సభ సమావేశం కాగానే బడ్జెట్ కేటాయింపులపై చర్చకు అవకాశం ఇవ్వాలంటూ పట్టుబట్టాయి. సభాపతులు అందుకు నిరాకరించడంతో ఉభయ సభల నుంచీ కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ వాకౌట్ చేశాయి.

కుర్చీ కాపాడుకునే బడ్జెట్!

''బడ్జెట్లో బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు పకోడా, జిలేబీ దక్కాయి. మిగతా రాష్ట్రాలన్నింటికీ మోదీ మొండిచేయి చూపారు'' అంటూ రాజ్యసభలోవిపక్ష నేత ఖర్గే దుయ్యబట్టారు. ఇతర కార్యకలాపాలను పక్కన పెట్టి ముందుగా బడ్జెట్‌పై చర్చ చేపట్టాలంటూ నోటీసులిచ్చారు. వాటన్నింటినీ చైర్మన్ తిరస్కరించడంపై విపక్ష సభ్యులంతా మండిపడ్డారు. 'కేవలం ఐదు రాష్ట్రాలకే పరిమితమైన బడ్జెట్', 'కుర్చీని కాపాడుకునే బడ్జెట్' అంటూ నినాదాలకు దిగారు. బడ్జెట్ కేటాయింపులు విపక్షపూరితమంటూ విపక్ష ఎంపీలు బుధవారం ఉదయం లోక్‌సభ ప్రవేశద్వారం వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. ఈ అంశాన్నే ముందు చర్చకు చేపట్టాలంటూ సభలో పదేపదే డిమాండ్ చేశారు. వారి తీరుపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహించారు. బైఠాయించి ఎవరినీ లోనికి రానీయకపోవడం ఏం పద్ధతని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ బి.మహతాబ్ బడ్జెట్‌పై చర్చ ప్రారంభించారు. నయా మధ్యతరగతిని సాధికారతకు బడ్జెట్ పెద్దపీట వేసిందన్న ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ సభ్యురాలు కుమారి సెల్జా తీవ్రంగా ఆక్షేపించారు. కేంద్ర బడ్జెట్ ఎవరి కోసమో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. 'ఇది వికసిత్ బడ్జెట్ కాదు, విచలిత్ బడ్జెట్' అంటూ ఎద్దేవా చేశారు. తుమ్మితే ఊడేలా ఉన్న సంకీర్ణానికి మోదీ సారథ్యం వహిస్తున్నారంటూ తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ ఎద్దేవా చేశారు. అందుకే కీలక ఎన్డీఏ భాగస్వాములను తృప్తి పరిచేందుకు బిహార్, ఏపీలకే బడ్జెట్లో పెద్దపీట వేశారని ఆరోపించారు. బెనర్జీ వ్యాఖ్యలు తృణమూల్ పాలిత పశ్చిమబెంగాల్‌కే వర్తిస్తాయంటూ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తిప్పికొట్టారు. దయానిధి మారన్ (డీఎంకే), సుప్రియా సులే తదితరులు బడ్జెట్‌పై విమర్శలు గుప్పించారు. విపక్ష సభ్యులనుద్దేశించి బీజేపీ ఎంపీ అభిజిత్ గంగోపాధ్యాయ చేసిన విమర్శలు వివాదమయ్యాయి. దాంతో వాటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ చెప్పారు.



పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షాల నిరసన

కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తీరుపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష పాలిత రాష్ట్రాలకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిపై బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. దేశ సమాఖ్య వ్యవస్థ పవిత్రతపై మోదీ ప్రభుత్వం దాడి చేసిందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. విపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపించారని, ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. కాంగ్రెస్ ఎంపీలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు అఖిలేష్ యాదవ్ సహా డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు.

నిర్మల మాతాజీ! ఖర్గే సంబోధన కూతురన్న ధన్‌ఖడ్

రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సంబోధనల సంవాదం జరిగింది. చాలా రాష్ట్రాలకు బడ్జెట్లో అన్యాయం జరిగిందని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతుండగానే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరణ ఇచ్చేందుకు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ అవకాశమిచ్చారు. దాంతో ఖర్గే ఆగ్రహించారు. నిర్మలను ఉద్దేశించి, ''మాతాజీ! మీరు మాట్లాడటంలో ఎక్స్‌పర్ట్ అని నాకు తెలుసు. కానీ ముందుగా దయచేసి నన్ను పూర్తి చేయనివ్వండి'' అన్నారు. మాతాజీ సంబోధనపై చైర్మన్ అభ్యంతరం తెలిపారు. ''ఆర్థిక మంత్రికి 64 ఏళ్లు. మీకు 82. ఆమె మీకు మాతాజీ కాదు, కూతురి వంటిది'' అన్నారు. అనంతరం ఖర్గే చర్చను కొనసాగిస్తూ నిర్మల కర్నాటక నుంచి రాజ్యసభకు ఎన్నికైనందున బడ్జెట్లో ఆ రాష్ట్రానికి ఎంతో ఇస్తారనుకుంటే అసలేమీ ఇవ్వలేదంటూ ఎత్తిపొడిచారు.

నేపాల్‌లో విమాన ప్రమాదం

- కఠ్మాండు ఎయిర్‌పోర్టులో టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే కూలిన విమానం
- 18 మంది మృతి
- పైలెట్‌కు తీవ్ర గాయాలు

కఠ్మాండు: హిమాలయాల నేల నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. కాఠ్మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై శౌర్య ఎయిర్‌లైన్స్ విమానం కుప్పకూలిన ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక చిన్నారిసహా ఒక కుటుంబానికి చెందిన ముగ్గురు ఉన్నారు. పైలట్ ఒక్కరే ప్రాణాలతో బయటపడ్డారు. తీవ్రగాయాలైన పైలట్ మనీశ్ రత్న శాక్యకు కంటి, వెన్నుముక శస్త్రచికిత్స చేస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11 గంటల సమయంలో కఠ్మాండు ఎయిర్‌పోర్ట్ నుంచి పొఖారా సిటీకి బయల్దేరేందుకు టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే బంబార్డియర్ తయారీ సీఆర్‌జే–200 రకం విమానం కూలింది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. టేకాఫ్ అయ్యాక ఎడమవైపుగా పయనించాల్సిన విమానం దిశను హఠాత్తుగా కుడి వైపునకు తిప్పడంతో స్థిరత్వం కోల్పోయి నేలరాలిందని ఎయిర్‌పోర్ట్ చీఫ్ జగన్నాథ్ నిరౌలా 'బీబీసీ న్యూస్ నేపాలీ' వార్తాసంస్థతో చెప్పారు. కూలిన విమానంలో సాధారణ ప్రయాణికులెవరూ లేరుగానీ పైలెట్, సాంకేతిక సిబ్బంది, ఇద్దరూ విమాన సిబ్బందితో కలిపి మొత్తం 19 మంది ఉన్నారు. విమానం రన్ వే మీద పడిన వెంటనే మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుంది. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మంటలను ఆర్పేశారు. 15 మంది ఘటనాస్థలిలో ముగ్గురు ఆస్పత్రుల్లో చికిత్సపొందుతూ మరణించారు. ఘటనాస్థలిని నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి సందర్శించారు. ఘటనపై విచారణకు ఆదేశించారు.

టేబుల్ టాప్ రన్‌వే

చుట్టూతా ఉండే హిమాలయ పర్వతాల మధ్య నుంచి దిగుతూ నేపాల్ ఎయిర్‌పోర్ట్‌ల గుండా రాకపోకలు సాగించడం ఇక్కడి పైలెట్లకు కత్తిమీద సామే. పర్వతప్రాంతం కావడంతో ఇక్కడి గాలి వీచే దిశ, వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు అనూహ్యంగా మారిపోతుంటాయి. తక్కువ ఎత్తులో నడపడం సవాల్‌తో కూడిన పని. అందులోనూ కఠ్మాండు విమానాశ్రయంలో టేబుల్ టాప్ రన్‌వే ఉంది. అంటే రన్‌వే దాటి ఏమాత్రం ముందుకు వెళ్లినా లోయలో పడే ప్రమాదముంది. రన్‌వేకు ఒక వైపు గానీ, రెండు వైపులా గానీ లోయ లేదా ఏటవాలు భూమి టేబుల్ టాప్ రన్‌వేగా పిలుస్తారు. దీనిపై టేకాఫ్, ల్యాండింగ్ ఖచ్చితత్వంతో చేయకుండా ప్రమాదమే. బుధవారం జరిగిన ప్రమాదానికి ఈ రకం రన్‌వే కూడా ఒక కారణమని వార్తలొచ్చాయి. భారత్‌లో సిమ్లా, కాలికట్, మంగళూరు, లెంగ్‌పుయ్ (మిజోరం), పాక్యోంగ్ (సిక్కిం)లలో ఈ టేబుల్–టాప్ రన్‌వేలు ఉన్నాయి. వీటిలో కేరళ, మంగళూరులో గతంలో పెద్ద విమాన ప్రమాదాలు జరగడం గమనార్హం.




దగ్ధమవుతున్న విమానం

7

సాక్షి హైదరాబాద్

గురువారం । 25 । జూలై । 2024



బల్దియాకు కావాలి రూ.5,360 కోట్లు

పలు ప్రాజెక్టుల కోసం ప్రభుత్వానికి జీహెచ్ఎంసీ వినతి

మూసీ, మెట్రోలకు నిధులు విదల్చని కేంద్రం

ప్రతిపాదనలు, ప్రణాళికలు ఓకే.. డీపీఆర్ తయారీలో జాప్యం

రూ.20 వేల కోట్లకు పైగా అంచనా వ్యయం

రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తేనే పనులకు అవకాశం

ఎస్టీపీ, సివరేజ్, సుంకిశాల ప్రాజెక్టు, ఫ్రీ వాటర్‌కు రూ. 5,650 కోట్లు అవసరం

ప్రభుత్వానికి జలమండలి ప్రతిపాదనలు

'కమాండ్ కంట్రోల్'కు కేటాయింపులు ఉండేనా?

వర్సిటీలకు వరాలిచ్చేనా?

నేటి రాష్ట్ర బడ్జెట్‌పై ఆశల పల్లకిలో గ్రేటర్ నగరం

కావాలి.. ఇవ్వాలి

ఆశల పద్దు పొడిచేనా!

రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులపై మహా నగరం కోటి ఆశలు పెట్టుకుంది. గతంలో చేపట్టిన ప్రాజెక్టులతో ఆర్థిక భారం మోయలేక విలవిలలాడుతున్న బల్దియాకు ఈ వార్షిక సంవత్సరానికి దాదాపు రూ.5,360 కోట్లు కావాల్సి ఉంది. గత సర్కారు హయాంలో రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు రాలేదు. పోయిన ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.1100 కోట్లు కేటాయించడంతో పాటు తొలి క్వార్టర్ నిధులుగా ఇటీవల రూ. 275 కోట్లు మంజూరు చేసింది. దీంతో జీహెచ్ఎంసీకి కొత్త ప్రభుత్వంపై కొంగొత్త ఆశలు చిగురించాయి. అలాగే.. మూసీ ప్రక్షాళన, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం ప్రస్తుత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంతో మొత్తం భారమంతా రాష్ట్రంపైనే పడనుంది. మెట్రో రెండో దశను సైతం ప్రస్తుతానికి రాష్ట్ర నిధులతోనే ప్రారంభించాల్సిన పరిస్థితి. ఈ రెండు ప్రధాన ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయించనున్నారనేది ఆసక్తి రేకెత్తిస్తోంది. జలమండలి సైతం రాష్ట్ర బడ్జెట్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. దాదాపు రూ.5,650 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో సిటీ ప్రాజెక్టులే అత్యంత కీలకం కానున్నాయి. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క గురువారం శాసన సభలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో మహా నగరంపై ఏ మేరకు వరాలు కురిపిస్తారో.. ఎంతమేరకు కరుణిస్తారో కొద్ది గంటల్లో తేటతెల్లం కానుంది.

– సాక్షి, సిటీబ్యూరో

- వివరాలు 8లో ▶

"మూసీ ప్రక్షాళన, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం ప్రస్తుత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. దీంతో మొత్తం భారమంతా రాష్ట్రంపైనే పడనుంది. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కోసం కేంద్రం సుమారు రూ.10 వేల కోట్ల నిధులను కేటాయించాలని రాష్ట్రం కోరింది. కేంద్రం నుంచి ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో మూసీ భారాన్ని పూర్తిగా రాష్ట్రమే భరించాల్సి వచ్చింది."

"మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుపైన డీపీఆర్‌లో జాప్యం కారణంగా ఈ ప్రాజెక్టును కేంద్రానికి సమర్పించడంలో ఆలస్యం జరిగింది. బడ్జెట్ కంటే ముందే ఈ ప్రాజెక్టుపైన కేంద్రానికి డీపీఆర్‌ను సమర్పించి ఉంటే నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఉండేది. కానీ ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయించనున్నారనేది చర్చనీయాంశంగా మారింది."

"రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులపై జలమండలి భారీ ఆశలు పెట్టుకుంది. దాదాపు రూ.5,650 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. రాష్ట్ర బడ్జెట్ 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ అభివృద్ధి పనులు, రుణాల చెల్లింపు, ఉచిత నీరు, పవర్ రాయితీ కింద నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. గత ఏడాది సుమారు రూ.5,937 కోట్లను ప్రతిపాదిస్తే రూ.1,960.70 కోట్లు కేటాయించారు."

"జీహెచ్ఎంసీ అవసరాల దృష్ట్యా జీహెచ్ఎంసీకి వివిధ మార్గాల ద్వారా రావాల్సిన నిధుల్ని ఇవ్వడంతో పాటు వివిధ ప్రాజెక్టుల పనులు, ఇతరత్రా అవసరాల కోసం దాదాపు రూ.5,360 కోట్లు ఇచ్చి ఆదుకోవాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇందులో రూ.5000 వేల కోట్లు పెద్ద ప్రాజెక్టుల పనుల కోసం కోరింది. ఆయా పద్దుల కింద జీహెచ్ఎంసీకి రావాల్సిన నిధుల్లో కనీసం రూ.360 కోట్లు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. వీటితో పాటు ఆయా పనుల కోసం రూ.100 కోట్లు అప్పు చేసేందుకు కూడా అనుమతించాల్సిందిగా నివేదించినట్లు సమాచారం."

GHMC
GREATER HYDERABAD MUNICIPAL CORPORATION

అధిక లాభాల ఆశచూపి...

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగరానికి చెందిన 40 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగికి మార్వాడీ సెక్యూరిటీస్ ఫైనాన్షియల్ లిమిటెడ్ ప్రతినిధి నుంచి సెబీ రిజిస్ట్రేషన్ నంబర్‌లో కాల్ వచ్చింది. అతను ఈ వివరాలను ఆన్‌లైన్‌లో వెరిఫై చేసుకుని సరైందేనని భావించాడు. ఉచిత ట్రేడింగ్ అకౌంట్‌ను అందిస్తామని చెప్పి, 140 మంది సభ్యులతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. వారి ప్లాన్ ప్రకారం గ్రూప్‌లో ట్రేడింగ్ లాభాలపై చాటింగ్ చేశారు. నిజమేనని నమ్మిన బాధితుడు మొదట కొంత డబ్బు పెట్టుబడి పెట్టాడు. కొంత లాభాలు వచ్చాయనే విధంగా నమ్మించారు. దీంతో బాధితుడు విడతల వారీగా మొత్తం రూ.19,50,000 పెట్టుబడులు పెట్టాడు. అనంతరం లాభాలతో పాటు డబ్బు విత్‌డ్రా చేసుకోవాలంటే 25 శాతం డబ్బు ముందుగా బదిలీ చేయాలని చెప్పారు. దీంతో మోసపోయానని భావించి బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆశల పద్దు పొడిచేనా!

గత ప్రభుత్వ హయాంలో వివిధ ప్రాజెక్టుల కోసం నెత్తిన పడ్డ ఆర్థిక భారం నుంచి బయట పడలేక జీహెచ్‌ఎంసీ విలవిలలాడుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్సార్డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం)తో పాటు ఎస్‌ఎన్‌డీపీ(వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) తదితర పథకాల కోసం రూ.6500 కోట్లకు పైగా అప్పులు చేసింది. అప్పుల చెల్లింపుల వాయిదాలు, వడ్డీలు వెరసీ.. నెలకు రూ.100 కోట్లకు పైగా చెల్లించాల్సి వస్తోంది. అప్పులు, సిబ్బంది జీతాల చెల్లింపులకే నెలకు సగటున రూ. 220 కోట్లు అవసరం. ఇక చేయాల్సిన వివిధ ప్రాజెక్టులు, నిర్వహణ పనుల ఖర్చులు సరేసరి. ఈ నేపథ్యంలో ప్రతినెలా చివరి వారం వస్తోందంటే సంబంధిత అధికారుల గుండెలు గుభేల్‌మంటున్నాయి.
- సాక్షి, సిటీబ్యూరో

బల్దియాకు కావాలి రూ.5,360 కోట్లు
ప్రభుత్వానికి జీహెచ్‌ఎంసీ వినతి
నేటి రాష్ట్ర బడ్జెట్‌పై కోటి ఆశలు



నిధుల లేమి తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహకారం లేనిదే జీహెచ్‌ఎంసీ మనుగడ సాగించడం క్లిష్టంగా మారింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తారని జీహెచ్‌ఎంసీ కొండంత ఆశతో ఉంది. గత పదేళ్లుగా జీహెచ్‌ఎంసీకి రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు రాలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిస్థితి, అవసరాలు దృష్టిలో ఉంచుకొని గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.1100 కోట్లు కేటాయించడంతో పాటు తొలి క్వార్టర్ నిధులుగా ఇటీవల రూ. 275 కోట్లు మంజూరు చేసింది. దీంతో జీహెచ్‌ఎంసీకి కొత్త ప్రభుత్వంపై కొంగొత్త ఆశలు చిగురించాయి.

ఈ నిధులివ్వండి..

జీహెచ్‌ఎంసీ అవసరాల దృష్ట్యా జీహెచ్‌ఎంసీకి వివిధ మార్గాల ద్వారా రావాల్సిన నిధుల్ని ఇవ్వడంతో పాటు వివిధ ప్రాజెక్టుల పనులు, ఇతరత్రా అవసరాల కోసం దాదాపు రూ.5,360 కోట్లు ఇచ్చి ఆదుకోవాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇందులో రూ.5000 వేల కోట్లు పెద్ద ప్రాజెక్టుల పనుల కోసం కోరింది. ఆయా పద్దుల కింద జీహెచ్‌ఎంసీకి రావాల్సిన నిధుల్లో కనీసం రూ.360 కోట్లు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. వీటితో పాటు ఆయా పనుల కోసం రూ.100 కోట్లు అప్పు చేసేందుకు కూడా అనుమతించాల్సిందిగా నివేదించినట్లు సమాచారం.

జీహెచ్‌ఎంసీ గత ఫిబ్రవరి వరకు ఆయా ప్రాజెక్టుల కోసం బ్యాంకు రుణాలు, బాండ్ల జారీ ద్వారా చేసిన అప్పులు

ప్రాజెక్టు	అప్పు (రూ.కోట్లు)
ఎస్సార్డీపీ	4250.00
సీఆర్‌ఎంపీ	1304.00
ఎస్‌ఎన్‌డీపీ	680.00
మొత్తం	6234.00

రావాల్సిన నిధులెన్నో

జీహెచ్‌ఎంసీకి రాష్ట్ర ప్రభుత్వ భవనాల ఆస్తిపన్ను నుంచి మొదలు పెడితే వివిధ విభాగాల ద్వారా ప్రొఫెషనల్ ట్యాక్స్, మ్యుటేషన్ ఫీజులు, స్టాంపు డ్యూటీ వంటివి ఏళ్ల తరబడిగా రావడం లేదు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంపు డ్యూటీ బకాయిలు దాదాపు రూ.3వేల కోట్లు పేరుకుపోయాయి. మ్యుటేషన్ ఫీజులు దాదాపు రూ. 175 కోట్లు రావాల్సి ఉంది. వాణిజ్యపన్నుల శాఖ వద్ద దాదాపు రూ.300 కోట్ల ప్రొఫెషనల్ ట్యాక్స్ వాటా పేరుకుపోయింది.

ప్రస్తుతం ప్రభుత్వం నుంచి జీహెచ్‌ఎంసీ ఆశిస్తున్న నిధులు.. అంశాల వారీగా ఇలా ఉన్నాయి.

అంశం	నిధులు (రూ. కోట్లు)
హైసిటీ ప్రాజెక్ట్ పనులకు	2500
ఇతర ప్రాజెక్టులకు సహాయం	2500
స్టాంప్ డ్యూటీ నిధుల వాటా	300
మ్యుటేషన్ ఫీజుల వాటా	60
మొత్తం	5,360

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సార్డీపీ, ఎస్‌ఎన్‌డీపీ కింద చేపట్టి పురోగతిలో ఉన్న పనుల్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం 'హైసిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ పనులుగా మార్చింది. ఇకపై ఫ్లై ఓవర్లు, నాలాల ఆధునీకరణ తదితర పెద్ద ప్రాజెక్టుల పనుల్ని ఈ పథకం కిందే చేపట్టనున్నారు. నగరాభివృద్ధి, సదుపాయాల కోసం చేసే పనులన్నీ ఒకే పేరుతో ఉండాలనే తలంపుతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇలా భారీ మొత్తంలో పేరుకుపోయిన నిధులన్నీ ఒకేసారి వచ్చే అవకాశాలు కూడా లేవు. ఈ నేపథ్యంలో ఇకనుంచైనా సదరు నిధుల్ని ఏ నెలవి ఆ నెలకు ఎప్పటికప్పుడు చెల్లిస్తూ, పేరుకుపోయిన బకాయిలను విడతలవారీగానైనా చెల్లిస్తే జీహెచ్‌ఎంసీకి ఎంతో ఉపకరిస్తుందనే అభిప్రాయాలు జీహెచ్‌ఎంసీ వర్గాల్లో ఉన్నాయి.

రూ. 5,650 కోట్లు ఇవ్వండి

- ఎస్టీపీ, సివరేజ్, సుంకిశాల ప్రాజెక్టు, ఫ్రీ వాటర్ కోసం..
- ప్రభుత్వానికి జలమండలి ప్రతిపాదనలు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులపై జలమండలి భారీ ఆశలు పెట్టుకుంది. దాదాపు రూ.5,650 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. రాష్ట్ర బడ్జెట్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ అభివృద్ధి పనులు, రుణాల చెల్లింపు, ఉచిత నీరు, పవర్ రాయితీ కింద నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. గత ఏడాది సుమారు రూ.5,937 కోట్లను ప్రతిపాదిస్తే రూ.1,960.70 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పెరిగిన అవసరాల దృష్ట్యా రూ. 2వేల కోట్లకుపైగా నిధులు కేటాయింపు జరగవచ్చని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

మురుగు నీటి శుద్ధి కోసం..

నగరంలో వంద శాతం మురుగునీటి శుద్ధి లక్ష్యంగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం జలమండలి ఆధ్వర్యంలో సుమారు 1259.50 ఎంఎల్డీల మురుగు నీటిని శుద్ధి చేసేందుకు మొత్తం రూ.3866.41 కోట్ల అంచనా వ్యయంతో మూడు ప్యాకేజీల్లో 31 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మిస్తోంది. అందులో కొన్నింటి నిర్మాణాలు పూర్తయి ప్రారంభం కాగా, మిగతా వాటి పనులు కొనసాగుతున్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద 39 ఎస్టీపీలను మంజూరు చేసింది. దీని నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం వాటా భరించాల్సి ఉంటుంది. ఇందుకోసం భారీ నిధుల అవసరం ఏర్పడింది. మరోవైపు కొన్ని మార్గాల్లో సివరేజ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం రూ.2,250 కోట్లు అవసరమవుతాయని జలమండలి భావించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది.

సుంకిశాలకు రూ.1,300 కోట్లు..

నగరానికి కృష్ణా జలాల తరలింపునకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండటంతో పాటు భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాగార్జున సాగర్ సమీపంలో సుంకిశాల ఇన్‌టేక్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతోంది. ఇందుకోసం రూ.2,214కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఇప్పటి వరకు కొంత మేరకు నిధుల కేటాయిపు జరిగింది. తాజాగా రూ.1,300 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించింది

ఉచిత నీటి సరఫరా..
నగరంలోని గృహ కనెక్షన్ దారులకు నెలకు 20 వేల లీటర్ల వరకు ఉచితంగా నీటిని సరఫరా చేస్తోంది. ఇందుకోసం అయ్యే ఖర్చును భారీగానే భరించాల్సి వస్తోంది. 2021 జనవరి నుంచి పథకం అమలవుతోంది. గత బడ్జెట్‌లో ఉచిత నీటి సరఫరా కోసం రూ.300 కోట్లు కావాలి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం రూ.550 కోట్లు కేటాయించారు. ఈసారి ఉచిత నీటి సరఫరాతో పాటు విద్యుత్ రాయితీ కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని జలమండలి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అదేవిధంగా హడ్కో రుణ చెల్లింపులకు మరో రూ.1100 కోట్ల నిధులు ప్రతిపాదించింది.

'కమాండ్ కంట్రోల్'కు కేటాయింపులు ఉండేనా?

- పెండింగ్‌లోనే సాంకేతిక పరిజ్ఞానం సమీకరణ
- రాచకొండ కమిషనరేట్ నిర్మాణానికీ నిధులు అవసరమే


సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర పోలీసు విభాగానికే తలమానికంగా బంజారాహిల్స్‌లోని రోడ్ నెం.12లో అందుబాటులోకి వచ్చిన తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (టీజీ సీసీసీ) ఈ బడ్జెట్‌లో ఎంత కేటాయింపులు చేస్తారనే ఉత్కంఠ నెలకొంది. దీని నిర్మాణం పూర్తయినప్పటికీ నగరంపై పటిష్ట నిఘా కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీకరించుకోవాల్సి ఉంది. గతేడాది బడ్జెట్‌లో రూ.30 కోట్లు కేటాయించినప్పటికీ...అన్ని హంగులు సమకూరలేదు. అనలిటిక్స్ సహా కొత్త టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురావడానికి భారీ కేటాయింపులు అనివార్యం. మరోపక్క దీని నిర్వహణ నగర పోలీసు విభాగానికి భారంగా మారనుంది. ఈ నేపథ్యంలో టీజీ సీసీసీ మెయింటెనెన్స్‌కు కేటాయించాల్సిన అవసరం ఉంది. నగరంలో ఉన్న సీసీ కెమెరాల్లో అనేకం తరచు మరమ్మతులకు గురవుతున్నాయి. స్థానికులు ఏర్పాటు చేసిన కెమెరాల నిర్వహణ పెను సవాల్‌గా మారుతోంది. దీంతో సీసీ కెమెరాల నిర్వహణకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. నగరంలో కొత్తగా ఏర్పడిన డివిజన్లు, ఠాణాల్లో అనేకం ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న వాటిలో నడుస్తున్నాయి. వీటికి కొత్త భవనాల నిర్మాణం అనివార్యంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం భారీ కేటాయింపులే చేయాల్సి ఉంది. హైదరాబాద్ కేంద్రంగా కొత్తగా ఏర్పాటైన తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకూ గత బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో నిధులు దక్కలేదు. నార్కోటిక్స్‌కు రూ.3.1 కోట్లు, సైబర్‌కు రూ.కోటి మాత్రమే వచ్చాయి. ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్ర స్థాయిలో పని చేసే నార్కోటిక్స్ బ్యూరోకి నాలుగు ఠాణాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలతో పాటు వరంగల్‌లో ఇవి అందుబాటులోకి రానున్నాయి. వీటికి అవసరమైన భవనాలు, మౌలిక వసతులకు నిధులు కేటాయించాలి. ఏళ్లుగా నత్తనడకన సాగుతున్న మేడిపల్లిలో రాచకొండ పోలీసు కమిషనరేట్ నిర్మాణం 12 నెలల్లో పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి అవసరమైన స్థాయిలే కేటాంపులు వస్తేనే ఇది సాధ్యమవుతుంది. గత ఏడాది హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కింద రూ.216 కోట్లు కేటాయించారు.

యూనివర్సిటీలకు వరాలిచ్చేనా?

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర బడ్జెట్‌పై విశ్వవిద్యాలయాలు భారీ ఆశలు పెట్టుకున్నాయి. ఇప్పటికే వర్సిటీలకు సరైన నిధులు లేక అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన మొక్కుబడిగా తయారైంది. పరిశోధనలు కూడా అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. రాష్ట్రం మొత్తం 15 విశ్వవిద్యాలయాలు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలోనే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. గతేడాది బడ్జెట్‌లో ఉస్మానియా వర్సిటీకి రూ.457 కోట్లు కేటాయించింది. అంబేద్కర్ వర్సిటీకి రూ.214 కోట్లు కేటాయింపులు జరిపింది. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి రూ.45.01 కోట్లు, జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు రూ.48 కోట్లు, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్‌కు రూ.26 కోట్లు కేటాయించారు. మహిళా యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించారు. అయితే నిధుల విడుదల మాత్రం అంతంతమాత్రంగానే ఉండటంతో అభివృద్ధి పనులతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పనులు ముందుకు సాగలేదు. ఈసారి పద్దు కోసం భారీ స్థాయిలో వర్సిటీలు ప్రతిపాదలు సమర్పించాయి.

ఈ భారం మోసేదెవరు?

మూసీ, మెట్రో ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధులు రాలేదు..
- 70 కిలోమీటర్లకు రూ.20 వేల కోట్లకు పైగా అంచనా
- ప్రతిపాదనలు, ప్రణాళికలు ఓకే...డీపీఆర్ తయారీలో జాప్యం
- ఇక రాష్ట్ర బడ్జెట్‌లో నిధులిస్తేనే పనులు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం ప్రస్తుత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. దీంతో మొత్తం భారమంతా రాష్ట్రంపైనే పడనుంది. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కోసం కేంద్రం సుమారు రూ.10 వేల కోట్ల నిధులను కేటాయించాలని రాష్ట్రం కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు స్వయంగా కేంద్రమంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో మూసీ భారాన్ని పూర్తిగా రాష్ట్రమే భరించవలసిన వచ్చింది.

- ఇక మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుపైన డీపీఆర్‌లో జాప్యం కారణంగా ఈ ప్రాజెక్టును కేంద్రానికి సమర్పించడంలో ఆలస్యం జరిగింది. బడ్జెట్ కంటే ముందే ఈ ప్రాజెక్టుపైన కేంద్రానికి డీపీఆర్‌ను సమర్పించి ఉంటే నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఉండేది. కానీ ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో మెట్రో రెండో దశను కూడా ప్రస్తుతానికి రాష్ట్ర నిధులతోనే ప్రారంభించవలసిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఈ రెండు ముఖ్యమైన ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయించనున్నారనేది చర్చనీయాంశంగా మారింది.
- సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్, మేడ్చల్ రూట్‌లో ఫ్లై ఓవర్ల నిర్మాణాలను సైతం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి పనులకు శంకుస్థాపన చేసింది. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో సిటీ ప్రాజెక్టులే అత్యంత కీలకం కానున్నాయి. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల పాతబస్తీ మెట్రో కోసం నిధులు విడుదల చేయకపోవడం వల్ల పనులు ప్రారంభం కాలేదు. మూసీకి రూ.వెయ్యి కోట్లు ఇవ్వనున్నట్లు గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు సర్వే పనులు కొనసాగుతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ నిర్మించనున్న 70 కిలోమీటర్ల మెట్రో రెండో దశకు సుమారు రూ.20 వేల కోట్లకు పైగా వ్యయం కానున్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. మెట్రో మొదటి దశను పీపీపీ పద్ధతిలో నిర్మించగా, రెండో దశ ప్రాజెక్టును మాత్రం ప్రభుత్వమే చేపట్టింది.

ఇదీ రెండో దశ మెట్రో...

- నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు అక్కడి నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు రెండో దశలో చేపట్టనున్నారు.
- అలాగే ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు, రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు రెండో దశలోనే పూర్తికావలసి ఉంది. అలాగే ఎయిర్‌పోర్ట్ రూట్‌లోనే మైలార్‌దేవ్‌పల్లి నుంచి హైకోర్టు వరకు మరో లైన్‌ను నిర్మించనున్నారు.
- ఎయిర్‌పోర్ట్ కారిడార్, హయత్‌నగర్ కారిడార్‌లలో అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అలైన్‌మెంట్‌లు, స్టేషన్‌లను ఖరారు చేశారు.
- రెండో దశ డీపీఆర్‌ను సిస్ట్రా కన్సల్టెన్సీకి అప్పగించారు. ప్రస్తుతం ఇది తుది దశకు చేరుకుంది.

నిధులిస్తే పనులు ప్రారంభం...

- సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు సుమారు రూ.2232 కోట్ల అంచనాలతో 18.10 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- ఈ ప్రాజెక్టు కోసం వివిధ చోట్ల సుమారు 197 ఎకరాలకు పైగా భూములను సేకరించవలసి ఉంటుందని అధికారులు గుర్తించారు. ఇందులో రక్షణ శాఖకు చెందిన భూములే 113 ఎకరాల వరకు ఉన్నాయి.
- ఈ మార్గంలో తొలగించవలసిన కట్టడాలు, సేకరించాల్సిన భూములపైన కూడా క్షేత్రస్థాయి సర్వేలు పూర్తయ్యాయి.
- ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

ఈ బడ్జెట్‌లో మురిపిస్తారా...

- మూసీ అభివృద్ధి పనులు మొదలయ్యాయి. నదికి రెండు వైపులా 50 మీటర్ల పరిధిలో సామాజిక, ఆర్థిక సర్వే కొనసాగుతోంది.
- గండిపేట్ నుంచి ఘట్కేసర్ వరకు సుమారు 55 కిలోమీటర్ల మార్గంలో ఉన్న మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి అభివృద్ధి చేయనున్నారు.
- నదికి రెండు వైపులా 50 మీటర్ల పరిధిలో సుమారు 12,500 నిర్మాణాలను తొలగించవలసి ఉంటుందని అధికారులు గుర్తించారు.
- ఇళ్లు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం కోసం పెద్ద మొత్తంలో ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా.
- అలాగే ఎస్టీపీలు, నదికి ఇరువైపులా రహదారులు, ఐటీ టవర్లు, మెట్రో రైలు వంటి భారీ నిర్మాణాలను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

పారిశుద్ధ్య సమస్య తలెత్తనివ్వొద్దు

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి


జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-44లో పర్యటిస్తున్న జెడ్సీ అనురాగ్ జయంతి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-44లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లే అన్ని రోడ్లతో పాటు పరిసర ప్రాంతాలన్నీ పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, ఏఎంఓహెచ్‌తో కలసి ఇక్కడి పర్యటించారు. ఫుట్‌పాత్‌లపై పేరుకున్న చెట్ల కొమ్మలు, చెత్తా చెదారాన్ని లారీల్లోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడిపోగా వాటిని అక్కడి నుంచి తొలగించారు. రోడ్డు నెంబర్-36, 40, 45, 44, 46, 45 తదితర ప్రాంతాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, పారిశుద్ధ్యం పేరుకుపోకూడదని, ప్రతిరోజూ తనిఖీలు ఉంటాయని హెచ్చరించారు.

బంజారాహిల్స్‌లో అక్రమ నిర్మాణాలు


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణం

బంజారాహిల్స్: ఏదైనా స్థలంలో నిర్మాణం చేపట్టాలంటే జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇవన్నీ అధికారులకు తెలిసే జరుగుతున్నాయా..? తెలియకనా..? అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని శబ్దాలయ వెనుకన సంగీత దర్శకుడు చక్రవర్తికి కేటాయించిన స్థలంలో కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఓ వ్యక్తి ఏకంగా దుకాణ నిర్మాణానికే పూనుకున్నాడు. టౌన్‌ప్లానింగ్ అనుమతులు లేకుండానే ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలే ఇరుకుగా ఉన్న ఈ రోడ్డులో ఎలాంటి సౌకర్యాలు లేకుండా ఫుట్‌పాత్‌ను ఆనుకుని నిర్మిస్తున్న ఈ అక్రమ నిర్మాణాలతో సమస్యలు ఉత్పన్నమవుతాయని, వీటిని వెంటనే తొలగించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

స్మితా సబర్వాల్ తప్పును ఒప్పుకోకపోవడం బాధాకరం

పంజగుట్ట: సీనియర్ ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్ సివిల్స్‌లో వికలాంగుల రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలపై సమాజం నుంచి ఎంత వ్యతిరేకత వస్తున్నా ఆమె తప్పును ఒప్పుకోకపోగా ఇంకా కొనసాగించడం బాధాకరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ దివ్యాంగుల కమిటీ జాతీయ అధ్యక్షురాలు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్.ఉదయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్, నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ నారగోనిలు మాట్లాడుతూ గిరిజనులు ఎన్నో పోరాటాలు చేస్తే సివిల్స్‌లో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు ప్రకటించిందని తెలిపారు. ఆమెపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు శ్రీనివాస్, చెరుకు నాగభూషణం, శారద, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



ఫిలింనగర్: పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్ళు, డీజే హోరు నడుమ అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు వేడుక అత్యంత వైభవంగా జరిగింది. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు బొప్పూరం వేణుకుమార్ బుధవారం నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం వేడుకగా సాగింది. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ నేతలు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి పీవీ. నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి కొండ్రుపల్లి శివకుమార్, కండె రామ్‌కుమార్, ఎంఎస్‌పీ అధ్యక్షుడు రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితరం రాజకీయ నాయకులకు కేటీఆర్ ఆదర్శం


ఛాతీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దేదీప్య విజయ్

వెంగళరావునగర్: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిన మాజీ మంత్రి కేటీఆర్ నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు బుధవారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో శ్రమించిన మాజీ సీఎం కేసీఆర్ తన పదేళ్ళ హయాంలో రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారన్నారు. కేసీఆర్ చూపిన బాటలోనే ఆయన తనయుడు కేటీఆర్ నడుస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని, యూత్ ఐకాన్‌గా నిలిచారని అన్నారు. తొలుత కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణా భవన్‌లో కార్పొరేటర్ దేదీప్య విజయ్ దంపతులు రక్తదానాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, ఆంజనేయులు యాదవ్, అప్సర్, పవన్ ముదిరాజ్, మహబూబ్, సమద్, జహంగీర్, కిట్టు, బాలు రజక, శ్రీకాంత్, వాణి, సుజాత, ఇమ్రాన్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీ కాలయాపన


చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాదిగ హక్కుల దండోరా నాయకులు

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ కాలయాపన చేసిందని, ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఖచ్చితంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌చేస్తూ ఆగస్టు 1, 2వ తేదీల్లో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు మాదిగ హక్కుల దండోరా (ఎమ్‌హెచ్‌డీ) తెలిపింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఛలో ఢిల్లీ మహాధర్నా పోస్టర్‌ను దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ గత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సొంతంగా సంపాదించుకునేందుకు రాష్ట్రంలో దళితుల ప్రధాన సమస్య అయిన వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చి కొంతమంది నాయకులతో కుమ్మక్కై వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ర్యాలీలు, సమావేశాలతో మభ్యపెట్టేందుకు చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సుప్రీం కోర్టులో కేసును పరిష్కరించి ఆర్టికల్ 371 (డి) ద్వారా ఎస్సీ వర్గీకరణ చెయ్యాలనే డిమాండ్‌తోనే చలో ఢిల్లీ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత శ్యామ్, అధికార ప్రతినిధి సగ్గి ప్రకాష్, యువసేన అధ్యక్షులు నరేష్ మాదిగ, ఎస్.లక్ష్మయ్య, పి.శ్యామ్ మాదిగ, సునీల్ కుమార్, ప్రభాకర్, సాయి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మునిగిపోయే నావ

- మంత్రి పొన్నం ప్రభాకర్
- కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక


మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న గౌడ సంఘం నాయకులు..

రహమత్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిందని అందుకే స్వచ్ఛందంగా ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం బోరబండ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ వనజ భర్త లక్ష్మణ్‌గౌడ్‌తో పాటు గౌడ సంఘం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం బోరబండ కార్పొరేటర్ బాబా ఫషియుద్దీన్ మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన గౌడ సంఘం నాయకులకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వినాయకనగర్ ప్రెసిడెంట్ ఆనంద్‌కుమార్, బోరబండ పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్, టీఆర్ఎస్వీ యూత్ నాయకుడు కిరణ్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్, ఆనంద్‌కుమార్ తదితరులతో పాటు డివిజన్‌కు చెందిన గౌడ సంఘం నాయకులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌గౌడ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో శిక్షా సప్తాహ్

- వారం రోజులు విజ్ఞానాన్ని పెంచే కార్యక్రమాలు
- నూతన జాతీయ విద్యా విధానం అమలు
- లక్ష్యాలు విస్తృతం చేసేందుకు ప్రణాళికలు
- కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: నూతన జాతీయ విద్యా విధానం లక్ష్యాలు, ఉద్దేశాలు, విధి విధానాలు మరింత మరింత విస్తృతం చేసేందుకు విద్యాశాఖ శిక్షా సప్తాహ్ పేరుతో వారంరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులను ఆదేశించింది. ఈ మేరకు విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 47 ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానాన్ని (ఎన్‌ఈపీ) 2020లో ప్రవేశపెట్టింది. ఈ నెల 22 నుంచి 29 వరకు ఏడు రోజులపాటు విద్యార్థులకు వివిధ రకాల ఆటపాటలు ఆడించడంతో పాటు విజ్ఞానాన్ని పెంచేలా కార్యక్రమాలను చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తూ పక్కాగా అమలయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా జీపీఎస్‌తో అనుసంధానం చేయబడిన ఫొటోలు, వీడియోలను తీసే సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రతిరోజూ జరిగే కార్యక్రమాల ఫొటోలను సంబంధిత జీ-మెయిల్ అడ్రస్‌కు పంపించాలి. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా వివరాలు వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నారు.

ఖైరతాబాద్‌లో ఇదీ పరిస్థితి..

ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 47 ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 1 నుంచి 5వ తరగతి వరకు 11,796 మంది, 6-7 తరగతుల్లో 9,666 మంది, 8-10వ తరగతి వరకు 3,676 మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని బడుల్లో ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. 1, 2 తరగతులకు, 3-5 తరగతులకు, 6-10 తరగతి వరకు ప్రత్యేకంగా కార్యక్రమాలు ఉంటాయి.


విద్యార్థులకు సృజనాత్మక అంశాలను తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

శిక్షా సప్తాహ్ ప్రణాళిక ఇలా..

- మొదటి రోజు (22న) నీటి సంరక్షణ, పొదుపుపై అవగాహన కలిగించారు. ఇతరులకు ఎలా సాయం చేయాలనే అంశంపై నినాదాలు, పోస్టర్లు విద్యార్థులతో తయారు చేయించారు. ఆహారం-కూరగాయలు అనే అంశంపై కథలు రాయించారు. వ్యర్థాలతో బొమ్మల తయారీపై అవగాహన చార్ట్‌లను తయారు చేయించారు.
- 23న ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను ప్రదర్శించి, సెమినార్లు నిర్వహించి కథలు చెప్పారు.
- 24న క్రీడా దినోత్సవం నిర్వహించి ఆటలు ఆడించడంతో పాటు వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.
- 25న సాంస్కృతిక దినోత్సవం నిర్వహించి, వివిధ భాషలు, వేషధారణ, సంప్రదాయాలపై వివరిస్తారు. చిత్రలేఖనం, జానపద నృత్యాలు, హస్తకళలు, వీధి నాటకాల ప్రదర్శనలతో విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతారు.
- 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా కోడింగ్ ఛాలెంజ్, జీవావరణ కార్యక్రమాన్ని చేపడతారు. వృక్ష, జంతుజాలాలపై అవగాహన కల్పిస్తారు. పిల్లలతో చారిత్రాక స్థలాల సందర్శన తదితర ఎనిమిది రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 27న పోషకాహార దినోత్సవాన్ని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించి మొక్కలు, కూరగాయల తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తారు.
- 29న సామాజిక భాగస్వామ్యం దినోత్సవం నిర్వహించి అందరినీ అందులో భాగస్వాములను చేస్తారు.

మాల మహానాడును బలోపేతం చేస్తా



రహమత్‌నగర్: మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోరబండకు చెందిన పుట్ట రాఘవేంద్రను ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య నియమించారు. ఈ మేరకు రాఘవేంద్రకు నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో మాల మహానాడుని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు మన్నె శ్రీధర్‌రావు, హైదరాబాద్ నగర అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, కార్యదర్శి కమల్ కుమార్, నాయకులు గోసోజు శ్రవణ్, గిరి, పాశం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

ఖైరతాబాద్: కాలేజీకి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది... బంధువులతో కలసి గుడిమల్కాపూర్‌లో నివాసముండే కె.అశ్విణి (19) ఖైరతాబాద్‌లోని షాదాన్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఉదయం పరీక్ష ఉందని చెప్పి వచ్చిన అశ్విణిని పికప్ చేసుకునేందుకు మధ్యాహ్నం 12.30కు కాలేజీకి వచ్చిన బాబాయి శివప్రసాద్ ఎంతసేపు వేచి చూసినా బయటకు రాకపోవడంతో కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా పరీక్ష రాసి వెళ్లినట్లు తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన శివాజి అనే యువకుడిపై అనుమానాలున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో.....

భర్తతో దూరంగా ఉంటూ తమ్ముడితో కలసి ఉంటున్న మహిళ అదృశ్యమైన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్‌లో నివాసముంటే జక్కుల శివమ్మ (28) మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తమ్ముడు శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరానగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కబ్జా

ఇళ్లను ఖాళీ చేయించి సీజ్ చేసిన అధికారులు


ఇళ్లను సీజ్ చేస్తున్న అధికారులు....

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కొందరు కబ్జా చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇందిరానగర్ కాలనీలోని 210 ఇళ్లను నిర్మించి వాటిలో 200 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన పది ఇళ్లకు అధికారులు తాళాలు వేసి ఉంచారు. ఈ నేపథ్యంలో కొందరు స్థానికులు తాళాలను పగులగొట్టి డి బ్లాక్‌లో 9 ఇళ్లు, బి బ్లాక్‌లో ఒక ఇంటిని స్వాధీన పర్చుకున్నారు. అందులో మూడు ఇళ్లల్లో ఏకంగా సామాన్లు పెట్టుకోగా, మరి కొందరు కిరాయికి ఇచ్చారు. మరో ఇద్దరు అందులోనే నివాసముంటున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, హౌసింగ్, పోలీసులు ఏకకాలంలో దాడులు చేసి ఆ ఇళ్లను ఖాళీ చేయించారు. అనంతరం ఎమ్మార్వో నయిముద్దీన్, హౌసింగ్ ఏఈ మహేష్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ సమక్షంలో పది ఇళ్లను సీజ్ చేశారు. కబ్జా విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామని, ఎలాంటి కేటాయింపులు లేకుండానే ప్రభుత్వం నిర్మించిన గృహాలను స్వాధీనం చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఎమ్మార్వో తెలిపారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



బంజారాహిల్స్: సామాన్యులు, రైతులకు మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన నందినగర్‌తో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కారు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని అన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఉపయోగకరంగా ఉందని అన్నారు. అదే విధంగా సోమాజిగూడ డివిజన్‌లో బీజేపీ నేత జి. సూర్యవినాయక్, జూబ్లీహిల్స్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్బీటీనగర్‌లో యువకుడి దారుణ హత్య

పరారీలో నిందితుడు...పోలీసుల గాలింపు


నిందితుడు పర్షా


హత్యకు గురైన ఖాజా పాష

బంజారాహిల్స్: పాత కక్షలను మనసులో పెట్టుకొని స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని సింగాడబస్తీలో నివసించే ఖాజాపాష (20) ర్యాపిడోలో పని చేస్తుంటాడు. పర్షా (26) బంజారాహిల్స్ రోడ్‌నెం.12లోని ఎన్బీనగర్‌లో నివాసం ఉంటాడు. ఇద్దరూ స్నేహితులు కాగా తరచూ మద్యం సేవిస్తూ గొడవలకు దిగుతుంటారు. వీరు ఇద్దరూ కూడా పాత నేరస్తులే. ఓ కేసులో మూడు నెలల పాటు జైలుకు వెళ్ళి పర్షా మూడు రోజుల క్రితమే విడుదలై వచ్చాడు. ఇద్దరూ కలసి తమ మరో ముగ్గురు స్నేహితులైన గోగుల మహేష్, బడిపుడి వంశీ, పూజారి సాయితో కలసి మంగళవారం మధ్యాహ్నం బంజారాహిల్స్‌రోడ్ నెం.13లో మద్యం సేవించారు. అదే సమయంలో పాషకు, పర్షాకు మధ్య పాత గొడవల నేపథ్యంలో తీవ్ర వాగ్వాదం జరగడంతో పాష పర్షాను తీవ్రంగా కొట్టాడు. దీంతో కక్ష పెంచుకున్న పర్షా పాషను చంపాలని పథకం వేశాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో పాష ఎన్బీటీనగర్‌లో నివసించే తన స్నేహితుడు సాయి ఇంటికి వచ్చాడు. అదే సమయంలో పర్షాతో పాటు మహేష్, వంశీ, పూజారి సాయి ముగ్గురూ ఒకే బైక్ మీద ఎన్బీటీనగర్‌కు వచ్చారు. కొద్దిసేపటికే ఇంటి నుంచి బయటికి వచ్చిన పాషపై పర్షా కత్తితో దాడి చేశారు. దీంతో తలకు తీవ్ర గాయాలై పడిపోవడంతో స్థానికులు పోలీసుల సహాయంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పాష మృతి చెందాడు. హత్య చేసిన అనంతరం పర్షా అక్కడి నుంచి పరారయ్యాడు. మహేష్‌తో పాటు వంశీ, సాయిలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పర్షా కోసం ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు.

బోనాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం

రహమత్‌నగర్: బోనాల ఏర్పాట్లపై బ్రహ్మశంకర్ నగర్ కమ్యూనిటీ హాల్లో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. సర్కిల్19 డీఎంసీ ఇస్లావత్ సేవానాయక్, ఈఈ రాజ్‌కుమార్, ఏఈ భరత్, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, జలమండలి మేనేజర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్ చట్టాలపై అవగాహన ఉండాలి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న లక్ష్మణ్‌నాయక్

బంజారాహిల్స్: యాంటీ ర్యాగింగ్ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్ సూచించారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చేయడం వల్ల కలిగే పరిణామాలు, సుప్రీంకోర్టు ఆదేశాలను విద్యార్థులకు తెలియపరిచారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, వైస్ ప్రిన్సిపాల్ (హాస్టల్స్) డాక్టర్ వెంకటరమణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ మీనాక్షి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలకృష్ణ, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

3న మైన్ అండ్ యువర్స్ జ్యువెలరీ షో


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మోడల్స్

బంజారాహిల్స్: ప్రతిష్టాత్మకమైన మైన్ అండ్ యువర్స్ వెడ్డింగ్ అండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను ఆగస్టు 3, 4 తేదీల్లో తాజ్‌కృష్ణా హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమ బ్రోచర్‌ను, విభిన్న రకాల డిజైనరీ వజ్రాభరణాలను పలువురు మోడల్స్ ఆవిష్కరించారు. రెండురోజులపాటు నిర్వహించే ఈ వెడ్డింగ్ అండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా 100 మంది ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వజ్రాభరణాలను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు హర్‌ప్రీత్‌సింగ్ తెలిపారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వనం సంగీత

శ్రీనగర్‌కాలనీ: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ అన్నారు. ఎల్లారెడ్డిగూడ నాగదేవత దేవాలయం ఉన్న దారిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బస్తీలు, కాలనీల్లో రోడ్ల మరమ్మతులు ముమ్మరం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ మౌళి, నేతలు వనం శ్రీనివాసయాదవ్, యాదయ్య, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

రహమత్‌నగర్: కేంద్రం బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్ర వైఖరికి నిరసనగా బుధవారం ఎస్పీఆర్‌హిల్స్‌లో కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అన్ని రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయించడం ఆనవాయితీగా గుర్తు చేశారు. బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు లాల్‌దర్వాజాలో బంగారు బోనం



చార్మినార్: 'సప్త మాతృకలకు సప్తబంగారు బోనం'కార్యక్రమంలో భాగంగా గురువారం లాల్‌దర్వాజాలోని సింహవాహిని అమ్మవారికి భక్తులు బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఈసారి నగరంలోని మహంకాళి దేవాలయాల అమ్మవార్లకు బంగారు బోనాలను సమర్పిస్తున్నారు. ఇప్పటికే నగరంలోని ఐదు ప్రధాన దేవాలయాలతోపాటు విజయవాడ కనకదుర్గ అమ్మవారికి బంగారు బోనం, పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. చివరగా లాల్‌దర్వాజా అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో ఈ కార్యక్రమం ముగుస్తుందని కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

ఫ్యాన్సీ నంబర్లకు రూ.51.17 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన వాహన రిజిస్ట్రేషన్ నంబర్ల వేలానికి వాహనదారుల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. టీజీ 09 ఎ, బీ సిరీస్ నంబర్లకు వచ్చిన ఆన్‌లైన్ బిడ్‌లను బుధవారం తెరిచారు. మొత్తం రూ.51,17,514 ఆదాయం సమకూరిందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా టీజీ 09 ఎ 9999 నంబరును ఆనర్ డెవలపర్స్ సంస్థ రూ.19,51,111కు సొంతం చేసుకుంది. టీజీ 09 బీ 0001ను ఎన్‌జీ మైండ్ ఫార్మా రూ.8.25 లక్షలకు దక్కించుకుంది. టీజీ 09 బీ 0009 అక్షర రెడ్డి రూ.6,66,666, టీజీ 09 బీ 0006 నంబరును ఎఎమ్‌ఆర్ ఇండియా లిమిడెట్ సంస్థ రూ.2,91,166కు, టీజీ 09 బీ 0005 గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.2,50,149కి, టీజీ 09 బీ 0019ని మోల్ట్ టెక్ టెక్నాలజీస్ రూ.1.30 లక్షలకు సొంతం చేసుకున్నారు.

సాహితీ తేజోమూర్తి గుర్రం జాషువా

ప్రముఖకవి, గాయకుడు మాస్టార్జీ



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: పుట్టుకతో దళితుడైనా పట్టుదలతో కవిశేఖరుడై నవయుగ కవిచక్రవర్తిగా తన కవితాప్రతిభతో తెలుగు సాహితీలోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి గుర్రం జాషువా అని ప్రముఖ కవి, గాయకుడు మాస్టార్జీ కొనియాడారు. గుర్రం జాషువా వర్ధంతిని టీపీఎస్‌కే, తెలంగాణ సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త మోతుకూరి నరహరి మాట్లాడుతూ ఆధునిక తెలుగుకవుల్లో గుర్రం జాషువా ప్రముఖ స్థానం పొందారన్నారు. భావకవిత్వపు నుంచి పక్కకు జరిగి సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశారని పేర్కొన్నారు. టీపీఎస్‌కే గౌరవ అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ తిరస్కారాలను ఎదుర్కొన్న చోటే సత్కారాలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ సాహితి కోశాధికారి అనంతోజు మోహనకృష్ణ, తంగిరాళ్ల చక్రవర్తి, సలీమా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

'అడ్డగోలు ఫీజులకు అడ్డుకట్ట వేయాలి'

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల అడ్డగోలు ఫీజులకు అడ్డుకట్ట వేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. బుధవారం సమాఖ్య ప్రతినిధులు రాష్ట్ర సాంకేతిక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలోని ఒక ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల గతేడాది రూ.15,800 సీటు కేటాయించిందని, ఈసారి ఫీజులు పెరిగాయని, హైకోర్టు ఆర్డర్ ఉందంటూ అదనంగా రూ.40 వేలు వసూలు చేస్తోందని ఆరోపించారు. ఫీజులు చెల్లించని విద్యార్థులు తరగతులకు హాజరు కానివ్వకుండా పరీక్షలు రాయినివ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్, నగర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, పలువురు కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ ఎందుకు మారారో చెప్పండి

ప్రకాశ్‌గౌడ్‌ను నిలదీసిన బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి

మణికొండ: పార్టీ ఎందుకు మారారో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పి.కార్తీక్‌రెడ్డి నిలదీశారు. బుధవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మణికొండలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ కన్నా బీఆర్ఎస్, కేసీఆర్ పాలనే మిన్న అని ప్రజలు అంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తమ పార్టీ తిరిగి అధికారంలోకి రావటం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు పి.రూపా రెడ్డి, సీనియర్ నేత డి.సీతారాం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బట్టబయలైన కాంట్రాక్టర్ల విభేదాలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. జీహెచ్ఎంసీ చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్ని వెంటనే విడుదల చేయాలంటూ ఒక గ్రూప్ ఆందోళనలు, నిరసనలు నిర్వహిస్తోంది. బుధవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి సిద్ధమైన సదరు గ్రూప్ సభ్యులు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న మరో గ్రూప్ సభ్యులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించిన పోలీసులు వారిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు. బిల్లులు చెల్లించే వరకు పనులు చేయబోమని, వర్షాకాల పనులు సైతం నిలిపివేస్తామని ఆందోళనలు చేస్తున్న కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు జీహెచ్ఎంసీ చెల్లించాల్సిన బిల్లులు దాదాపు రూ.1,200 కోట్ల మేర ఉన్నాయని వారు తెలిపారు.

బీజేపీ ఇచ్చింది 'గాడిద గుడ్డు'

కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ వినూత్న నిరసన

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎనిమిది ఎంపీ స్థానాల్లో గెలిపిస్తే ఆ పార్టీ బడ్జెట్‌లో ఇచ్చింది 'గాడిద గుడ్డు'అంటూ వ్యంగ్య వ్యాఖ్యానాలతో బ్యానర్లు ప్రదర్శించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వెలసిన ఈ బ్యానర్లు ప్రజలను ఆకర్షిస్తూ చర్చనీయాంశంగా మారాయి.

సోఫాల కార్ఖానాలో మంటలు

షార్ట్ సర్క్యూట్‌తో జియాగూడలో భారీ అగ్నిప్రమాదం

- నిమిషాల్లో గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి రెండో అంతస్తు వరకు...
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు
- రెగ్జిన్ నిల్వలు ఉండటంతో వేగంగా విస్తరించిన మంటలు

తండ్రి, కూతురు దుర్మరణం



బాధితులు చీరల సాయంతో దిగి బయటపడ్డ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు





మృతులు శ్రీనివాస్, శివప్రియ (ఫైల్)



అగ్ని ప్రమాదం జరిగిన భవనం

జియాగూడ/అఫ్జల్‌గంజ్: జనావాసాల మధ్య ఉన్న సోఫాల తయారీ కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదం తండ్రికూతురును పొట్టనపెట్టుకుంది. అదే కుటుంబానికి చెందిన మరో ఇరువురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. భవనంలోని మూడు అంతస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. కుల్సుంపుర పోలీసుస్టేషన్ పరిధిలోని జియాగూడలో బుధవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జియాగూడ వెంకటేశ్వర నగర్‌లో ఉన్న మూడంతస్తుల భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో దాదాపు పదేళ్లుగా ధనుంజయ అగర్వాల్ సోఫా సెట్, కుషన్ కుర్చీలు, ఐరన్ టేబుల్ తయారీ కార్ఖానా నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోని ఏడు ఫ్లాట్స్‌లో 35 మంది నివసిస్తున్నారు. ఇందులో 15 మంది ఆ కార్ఖానాలో పనిచేసే కార్మికులే. ఈ కార్ఖానాలో బుధవారం రాత్రి 1.30 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు రేగాయి. అక్కడ ఉన్న సోఫా తయారీ మెటీరియల్, రెగ్జిన్, చెక్కలకు మంటలు అంటుకొని వేగంగా వ్యాపించాయి. నిమిషాల్లోనే మొదటి, రెండో అంతస్తులకు విస్తరించాయి. ఆ సమయంలో అందరూ నిద్రలో ఉండటంతో ఎవరూ గమనించలేదు.

అప్రమత్తమై తప్పించుకోవాలనుకున్నా...

ఆ భవనం మొదటి అంతస్తులో మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ (44) కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నారు. మంటలు వీరి ఫ్లాట్‌నూ చుట్టుముట్టడంతో అప్రమత్తమైన ఆయన భార్య నాగమణి(40), కుమార్తెలు శివప్రియ (10), హరిణిలను (6) తీసుకుని కిందికి వచ్చే ప్రయత్నం చేశారు. దీంతో వారికీ మంటలు అంటుకున్నాయి. వీటి ధాటికి శ్రీనివాస్, నాగమణి, శివప్రియ, హరిణిలకు తీవ్ర గాయాలు కాగా, శివప్రియ అక్కడికక్కడే కన్నుమూసింది.

బాల్కనీల నుంచి చీరలు జార విడిచి...

మంటలను గమనించిన కొందరు భవనంలోని రెండు, మూడో అంతస్తుల బాల్కనీల నుంచి చీరలను కిందికి జారవిడిచి, వాటి సహాయంతో ఈ భవనం పక్కనే ఉన్న ఖాళీస్థలంలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈలోపు స్థానికులు, పోలీసులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సైతం పలువురిని కాపాడారు. ఓ యువకుడు ప్రాణం కాపాడుకోవడానికి రెండో అంతస్తు నుంచి కిందికి దూకేయడంతో కాలు విరిగింది.

15 మందిని కాపాడిన బస్తీవాసులు

ప్రమాదంలో చిక్కుకున్న మరో 15 మందిని బస్తీ వాసులు కాపాడారు. గాయపడ్డ శ్రీనివాస్, నాగమణి, శివప్రియను అంబులెన్స్‌ల్లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి బర్న్స్ వార్డులో చికిత్స పొందుతూ శ్రీనివాస్ తుదిశ్వాస విడిచారు. మిగిలిన ఇద్దరూ అక్కడే చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు చెప్తున్నారు. ఇదే భవనంలో 2000 సంవత్సరంలోనూ ఓసారి అగ్నిప్రమాదం జరిగిందని, అయినప్పటికీ యజమాని ఎలాంటి నిరోధక చర్యలు తీసుకోలేదని స్థానికులు చెప్తున్నారు. అగ్నిప్రమాదం కారణంగా ఈ భవనం పక్కన ఉన్న మరో రెండస్తుల భవనానికీ మంటలు వ్యాపించాయి. ఆ భవనంలో ప్రాణనష్టం లేనప్పటికీ ఆస్తి నష్టం జరిగింది.



మహాదేవ్, బాధితుడు

ఐదు ఫైరింజన్లు.. ఆరు గంటలు..

ఐదు ఫైరింజన్లు దాదాపు ఆరు గంటలకుపైగా శ్రమించి మంటల్ని అదుపు చేశాయి. సంఘటనాస్థలానికి ఆర్డీవో మహిపాల్, ఆసిఫ్ నగర్ ఎమ్మార్వో జ్యోతి, సౌత్ వెస్ట్ డీసీపీ జి.చంద్రమోహన్ తదితరులు వచ్చి పరిస్థితిని పర్యవేక్షించారు. ఆర్డీవో మహిపాల్ మాట్లాడుతూ అగ్నిప్రమాదంపై కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించి చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా నడుస్తున్న ఈ కార్ఖానాపై విచారణ జరిపిస్తామని చెప్పారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే కార్ఖానా యజమాని ధనుంజయ్ అనారోగ్యమంటూ ఆస్పత్రిలో చేరారు. నష్టపరిహారం ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు హెచ్చరించారు. జియాగూడలోని పలు బస్తీల్లో అనుమతులు లేకుండా ఇలాంటి ఎన్నో కార్ఖానాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. రెండో అంతస్తు నుంచి చీరల సాయంతో కిందికి దిగి బయటపడ్డామని మహాదేవ్ అనే స్థానికుడు చెప్పారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



వివరాలు వెల్లడించిన ఆర్డీవో మహిపాల్

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.హరగోపాల్

- విద్యాపరిరక్షణ కమిటీ ప్రధానకార్యదర్శి ప్రొ.హరగోపాల్

హిమాయత్‌నగర్: కేంద్రర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య కోసం బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వకపోతే దేశ భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి, పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బుధవారం విద్యారంగ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మేధావులు, ప్రజా, ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ అందరికీ సమానమైన ఉచిత విద్య అందించాలనే డిమాండ్‌తో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పనిచేస్తోందన్నారు. ఉచిత విద్య అనే అందిస్తామని చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో విద్య రంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్య రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 15 శాతం విద్యకు కేటాయించాలని, లేనిపక్షంలో ప్రజాఉద్యమానికి శ్రీకారం చుడతామని హరగోపాల్ హెచ్చరించారు. సమావేశంలో ప్రొ.కె.చక్రధర్ రావు, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్, నాగిరెడ్డి, ఎం.సోమయ్య, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నారాయణ, ఎం.ఎన్. కిష్టప్ప, కె.రవిచందర్, ఎస్.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు చేయూతనివ్వండి

సాక్షి, సిటీబ్యూరో: చదువులో ప్రతిభ, ఆసక్తి ఉండి..ఆర్థిక పరిస్థితులు సహకరించక ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, పోస్ట్‌లాన్ అధ్యక్షుడు ఎం.సైదులు కోరారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మధులత అనే విద్యార్థినికి ఐఐటీలో చేరేందుకు సీఎంఓ స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుకుని ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను కూడా ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కులీకుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ చదువుతున్న భూపతి ముంబై ఐఐటీలో, జేఎన్‌జీపీలో ట్రిపుల్ ఈ చదువుతున్న రమేష్ తిరుచ్చిలోని ఎన్ఐటీలో సీట్లు సాధించారని సైదులు పేర్కొన్నారు. వీరిద్దరితో పాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఇంకెవరు ఉన్నత కోర్సుల్లో సీట్లు సాధించినా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ లేదా ఎస్‌బీటీఈటీ నిధుల నుంచి వారికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

చిన్నారిపై వీధికుక్కల దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గగన్

మేడ్చల్ రూరల్: వీధికుక్కలు దాడిచేయడంతో నాలుగేళ్ల బాలుడు గాయాలపాలైన సంఘటన గుండ్ల పోచంపల్లి పరిధిలోని 4వ వార్డులో బుధవారం చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన పురుషోత్తం గుండ్లపోచంపల్లి ప్రెస్టేజ్ గ్రీన్ వెంచర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం పురుషోత్తం భార్యతో కలిసి భవన నిర్మాణపనులు చేస్తుండగా వారి కుమారుడు గగన్(4) ఆ సమీపంలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో వీధికుక్కలు వచ్చి బాలుడిపై విరుచుకుపడ్డాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమివేశారు. తర్వాత బాలుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ వీధికుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించిన కొద్దిరోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం గమనార్హం.

చెరువులపై నివేదిక ఇవ్వండి

హెచ్ఎండీఏ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తూ మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బఫర్ జోన్‌ను నోటిఫై చేయడం, ఆక్రమణలు, తొలగింపు వివరాలన్నీ నివేదికలో పొందుపరచాలని చెప్పింది. తదుపరి విచారణలోగా రామమ్మకుంట ఎఫ్‌టీఎల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(ఎన్ఐటీహెచ్ఎం) కట్టిన భవన భాగాన్ని తొలగించాలని హెచ్ఎండీఏ అధికారులకు తేల్చిచెప్పింది. నగరంలోని రామమ్మకుంట ఎఫ్‌టీఎల్‌లో ఎన్ఐటీహెచ్ఎం అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదని మానవ హక్కులు, వినియోగదారుల పరిరక్షణ సెల్ ట్రస్ట్ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. తాము ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వర్చువల్‌గా హాజరై వివరణ ఇవ్వాలన్న ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ హాజరయ్యారు. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న ధర్మాసనం మూడు నెలల్లో ప్రక్రియ అంతా చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను నవంబర్ 4కు వాయిదా వేసింది.

నగరంలో నేడు..

- సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్‌లోని ది పార్క్ ఇన్ హోటల్‌లో టాలీవుడ్ నైట్ నృత్య ప్రదర్శన జరుగుతుంది.
- నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని షెరటాన్ స్టార్ హోటల్‌లో ఫ్లేవర్స్ ఆఫ్ కూర్గ్ వంటకాల రుచి చూసే అవకాశం ఏర్పడింది. ఈ నెల 30వ తేదీ వరకు ఈ ప్రత్యేక ఫుడ్ ఫెస్టివల్ అందుబాటులో ఉంటుంది.
- క్యూఎస్ డిస్కవర్ ఎంబీఏ ఫెయిర్ రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణలో జరుగుతుంది.
- లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు ప్రైమరీ హెల్త్ సెంటర్ మెదడువాపు టీకాలు(జేఈ వ్యాక్సిన్) ఇవ్వనున్నారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 15 ఏళ్ల లోపు పిల్లలకు వేస్తారు.
- రసరంజని ఆధ్వర్యంలో సాయంత్రం 6.45 గంటలకు రవీంద్రభారతిలో 'ఐ ఏట్ ఇండియా' సాంఘిక నాటకం ప్రదర్శన జరుగుతోంది.

ఆ కాలేజీలపై చర్య తీసుకోవాలి

జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్

కేపీహెచ్‌బీకాలనీ: న్యాక్, ఏఐసీటీఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్న అన్ని ఇంజనీరింగ్ కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బుధవారం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావుకు జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం 2024-25 ప్రారంభం కానుండటంతో అనేక కళాశాలలు పుస్తకాలు, ప్లేస్‌మెంట్ సెల్, శిక్షణ కేంద్రాల, ఇతర ఖర్చుల పేరిట ఒక్కో విద్యార్థి నుంచి 15 వేల నుంచి 50 వేల రూపాయల వరకు అధికంగా వసూ చేస్తున్నాయని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టియు ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్, రామకృష్ణ, చందు, శివకృష్ణ, స్నేహిత్, రోహిత్,సాయి, అరవింద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డు పోస్ట్ పేరిట మోసం

మాజీ ఎమ్మెల్సీ దిలీప్, మరొకరిపై కేసులు

బంజారాహిల్స్: ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నామినేటెడ్ పోస్ట్ ఇప్పిస్తామని ఓ వ్యక్తి వద్ద పది లక్షల రూపాయలు తీసుకొని మోసం చేసిన మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌తోపాటు మరొకరిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటకు చెందిన వి.శశిధర్ వ్యాపారి. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 36లో తెలంగాణ ఎఫ్ఎం పేరిట ఓ కార్యాలయం నిర్వహిస్తున్నాడు. పలు షార్ట్ ఫిలింలను నిర్మించాడు. సినీ నిర్మాతగా ఎదిగి పరిశ్రమలో పేరు సంపాదించాలని భావించాడు. ఈ క్రమంలో ఓ స్నేహితుడి ద్వారా ప్రశాసన్‌నగర్‌కు చెందిన పసునూరి ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో పరిచయమైంది. తనకు కేంద్ర మంత్రులు, రెండు రాష్ట్రాల మంత్రులతో పరిచయాలు ఉన్నాయని నమ్మబలికి ఫిలింసెన్సార్ బోర్డు సభ్యుడిగా అవకాశం ఇప్పిస్తానని శశిధర్‌కు ఇద్దరూ కలిసి ఆశ చూపారు. ఈ పదవికి రూ.13 లక్షల ఖర్చు అవుతుందని కపిలవాయి చెప్పగా శశిధర్ ఒప్పుకున్నాడు. కపిలవాయి సూచన మేరకు నాలుగు లక్షల రూపాయలను లహరి అనే మహిళకు, మరో ఆరు లక్షలను ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చాడు. తరువాత శశిధర్ పోస్టు గురించి అడిగితే వారు దాటవేస్తున్నారు. ఇంతలో ఎఫ్‌సీఐలో పోస్టు ఇప్పిస్తామని చెప్పి రూ.15 లక్షలు అడిగారు. అనుమానంతో శశిధర్ ఆరా తీయగా, వీరు ఇలాగే చాలామందిని మోసం చేసినట్టు తెలుసుకున్నాడు. దీంతో బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దిలీప్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 316, 318 కింద పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబర్ ప్రణీత్‌కు బెయిల్ తిరస్కరణ

సిటీ, కోర్టులు: యూట్యూబర్ ప్రణీత్ హనుమంతు బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. తండ్రీ, కూతురు సంబంధంపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అతడు గంజాయి సేవించారని వైద్య పరీక్షల్లో తేలడంతో ఎన్‌డీపీఎస్‌తోపాటు పలు చట్టాల కింద కేసులు నమోదు చేశారు. చంచల్‌గూడ జైల్లో ఉన్న ప్రణీత్ నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. ప్రణీత్ తరపున ఎస్. సురేందర్, పోలీసుల తరపున పబ్లిక్ న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న నాంపల్లి కోర్టు నాలుగో అదనపు సెషన్స్ జడ్జి సీవీఎస్ సాయిభూపతి బుధవారం బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: మహిళాశక్తి పథకం ద్వారా వచ్చే ఐదు సంవత్సరాల్లో మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (యూసీడీ) చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, టీఎల్ఎఫ్(టౌన్ లెవెల్ ఫెడరేషన్) లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్స్, క్యాటరింగ్ , తెలంగాణా పిండి వంటలు, బొటిక్స్, పిండి గిర్నీ, డీటీపీ, జిరాక్స్ సెంటర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ యూనిట్స్ ఏర్పాటు చేసుకునేలా సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల్లోని మహిళలకు అవగాహన కల్పించి పథకం అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్లు ప్రసన్న కుమార్, పద్మ మాట్లాడుతూ మహిళా శక్తి పథకం, అమలుకు చేపట్టాల్సిన చర్యలు, జీహెచ్ఎంసీ లక్ష్యం, ఆయా యూనిట్లకు అందిస్తున్న రుణాలు, సబ్సిడీ, తదితరాలపై వివరించారు. గృహ సేవల (గిన్నెలను శుభ్రపరచడం, బట్టలుతకడం, ఇల్లు తుడవడం, వంట చేయడం, పెద్దవాళ్లు, చిన్న పిల్లల బాగోగులు చూసుకోవడం లాంటి పనులకు) కోసం నెలవారీగా, పార్ట్ పుల్టైం కొరకు సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ మహిళలను గుర్తించాలని టౌన్ లెవెల్ ఫెడరేషన్ లీడర్లకు సూచించారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్ఎంఈ), గ్రామోదయ వికాస్ యోజన పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం, పీఎం విశ్వకర్మ స్కీం గురించి అధికారులు వివరించారు. వీధి వ్యాపారులకు చేయూత పథకం గురించి మెప్మా కోఆర్డినేషన్ అధికారి చైతన్య వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ యూసీడీ అధికారులతో పాటు రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల లీడ్ బ్యాంక్ అధికారులు టౌన్, స్లమ్ లెవెల్ స్థాయి మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ ధూల్‌పేట్' షురూ


2.6 కిలోల గంజాయి, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం



ధూల్‌పేట్‌లో దాడులు నిర్వహించిన ఎక్సైజ్, పోలీసు అధికారులు

అబిడ్స్: 'ఆపరేషన్ ధూల్‌పేట్'పేరిట ఎక్సైజ్, స్థానిక పోలీసులు దాడులు ప్రారంభించారు. ఆగస్టు 31లోపు ధూల్‌పేట నలుమూలలా గంజాయి అమ్మకాలు, రవాణా, వినియోగం పూర్తిగా అరికట్టే విధంగా ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం జరిగిన దాడుల్లో హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ శాస్త్రి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ రెడ్డి, ఎస్ఎఫ్‌టీ టీమ్ అధికారులు అంజిరెడ్డి, భాస్కర్, డీఎస్పీలు శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ధూల్‌పేట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, గోపాల్ పాల్గొన్నారు. ధూల్‌పేట్‌లోని గంగాబౌలి, జుమ్మేరాత్‌బజార్, జుంగుర్ బస్తీ తదితర ప్రాంతాల్లో 8 ప్రత్యేక బృందాలతో ఈ తనిఖీలు చేపట్టారు. గంజాయి అమ్ముతున్న పాత, కొత్త విక్రేతల ఇళ్లపై కూడా దాడులు చేశారు. ఈ దాడుల్లో 2.660 కిలోల గంజాయితో పాటు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు అనుమానిత వ్యక్తులను అరెస్టు చేశారు.

దృష్టి లోపంతో మేధా క్షీణత



- ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ అధ్యయనం
- బీఎంజే ఓపెన్ యాక్సెస్ అనే శాస్త్రీయ పత్రికలో విశ్లేషణ

సాక్షి, సిటీబ్యూరో: మతి భ్రమణం, మేధా క్షీణత వంటి సమస్యల పరిష్కారానికి దృష్టి లోపాన్ని సవరించడం కీలక మార్గమని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనికి సంబంధించి నగరానికి చెందిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నిపుణుల సహకారంతో బీఎంజే ఓపెన్ యాక్సెస్ అనే శాస్త్రీయ పత్రికలో ప్రచురించిన విశ్లేషణ దృష్టి లోపం ఉన్న వృద్ధుల్లో మేధో సామర్థ్యాల వైకల్యం అధిక ప్రాబల్యాన్ని సూచిస్తుంది. ఈ అధ్యయనంలో భాగంగా నలుగురు వృద్ధుల్లో ఒకరు మేధో సామర్థ్యాల వైకల్యంతో జీవిస్తున్నారని తేలింది. వాస్తవానికి దృష్టి లోపం లేనివారితో పోలిస్తే దృష్టిలోపం ఉన్న వారికి మేధో సామర్థ్యాల వైకల్యం ఉండే అవకాశం 4 రేట్లు ఉంది. సమీప దృష్టి వైకల్యం (కళ్లద్దాలు లేకుండా ఫోన్, పుస్తకాలు చదవలేని స్థితి) కూడా మేధో సామర్థ్యాల వైకల్యానికి సంబంధం ఉంది.

మహిళల్లో మేధో వైకల్యం అధికం..

నగరంలోని వృద్ధాశ్రమాల్లో ఉంటున్న 1,500 మందికి పైగా వృద్ధులపై జరిపిన ఈ అధ్యయనంలో 965 మందిని ఇందులో చేర్చారు. ఇందులో దాదాపు 27% మందికి మేధో సామర్థ్యాల వైకల్యం ఉందని వెల్లడైంది. తేలికపాటి దృష్టి లోపం ఉన్న వృద్ధుల్లో 30% కంటే తక్కువ మందికి మేధో సామర్థ్యాల వైకల్యం ఉండగా, దృష్టి వైకల్యం మరింత దిగజారుతున్న కొద్దీ ఈ శాతం క్రమంగా పెరుగుతుంది. అధ్యయనంలో అంధత్వం ఉన్నవారు 15 మంది ఉన్నారు. అందులో 60% మేధో సామర్థ్యాల క్షీణతను ప్రదర్శించారు. మహిళల్లో మేధో సామర్థ్యాల వైకల్య ప్రాబల్యం అధికంగా ఉంటుంది. పురుషులకంటే మేధో సామర్థ్యాల వైకల్యం మహిళలకు 2 రేట్లు ఎక్కువగా ఉంటుందని ఈ అధ్యయనం కనుగొంది. ఈ సందర్భంగా మేధో సామర్థ్యాల వైకల్యం తీవ్రరూపాలు మతిభ్రమణానికి (డిమెన్షియా) దారి తీస్తాయని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ పరిశోధకులు డా.శ్రీనివాస్ మర్మముల పేర్కొన్నారు. ఈ పరిశోధనా పత్రం హైదరాబాద్ ఆక్యులర్ మోర్బిడిటీ ఇన్ ది ఎల్డర్లీ స్టడీ(హోమ్స్)లో భాగంగా ప్రచురించిన 16 పేపర్లలో ఒక భాగమని తెలిపారు.


'ఫ్లేవర్స్ ఆఫ్ కూర్గ్' @ 'షెరటాన్'

నేటి నుంచి ఫుడ్ ఫెస్టివల్



రాయదుర్గం: నగరవాసులకు 'ఫ్లేవర్స్ ఆఫ్ కూర్గ్' వంటకాల రుచి చూసే అవకాశం కల్పిస్తున్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షెరటాన్ స్టార్ హోటల్‌లో ప్రత్యేక ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి 30వ తేదీ వరకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తారు. చెఫ్ పిన్ సహకారంతో ప్రఖ్యాత చెఫ్ స్మిత కలిసి కూర్గ్ ప్రాంతం గొప్ప వంటల వారసత్వాన్ని నగరవాసులకు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా పాండికూర(కూర్గ్ పోర్క్ కర్రీ), అక్కిరోటి(రైస్‌రోటీ) వంటి సాంప్రదాయ వంటకాలు, వెదురు షూట్ కర్రీ, కొడవ కాఫీ, రిఫ్రెష్‌రుచికి కూర(చికెన్ కర్రీ) వంటివాటితో పాటు అనేక రకాల వంటకాలు అందుబాటులోకి తేవడానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు, రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

టేస్టీ.. నార్త్‌ఫుడ్..





నోరూరిస్తున్న స్క్వాష్-హరిస్సా, తాహినీ-సీబాస్, సిరోహి మటన్

నగరం వేదికగా ఉత్తరాది ఫుడ్‌ఫెస్ట్

అలివ్ బ్రిస్టో వేదికగా ప్రముఖ చెఫ్ ఒబెరాయ్, కాక్‌టెయిల్ మిక్సాలజిస్ట్ చిమ్వాల్

ఓ వైపు మాన్‌సూన్ ముసుర్లతో నగరం తడిసి ముద్దవుతుంటే.. మరోవైపు నార్త్ ఇండియన్ ఫుడ్‌ఫెస్ట్‌లో స్పెషల్ డిషెస్ నగరవాసుల జిహ్వకు కొత్త రుచిని పరిచయం చేస్తున్నాయి. ఆనాటి నుంచి దక్కన్ నేల అంటేనే పసందైన రుచులు, మసాల వంటకాలకు నిలయం. అయినప్పటికీ కొత్త రుచులను ఆహ్వానించడంలో, ఆస్వాదించడంలో హైదరాబాద్ ఎల్లప్పుడూ ముందుంటుంది. దీనికి తగ్గట్టుగానే విభిన్న సంస్కృతులకు నిలయమైన నగరంలో దేశీయ వంటకాలతో పాటు కాంటినెంటల్ రెసిపీలకూ పెట్టింది పేరు. ఈ ఆనవాయితీలో భాగంగానే కొంగొత్త రుచులను ఇష్టపడే భాగ్యనగరంలో ఉత్తరాది వంటకాల ఘుమఘుమలు వెదజల్లుతున్నాయి. జూబ్లిహిల్స్‌లోని అలివ్ బిస్ట్రో అండ్ బార్ వేదికగా ప్రారంభమైన ఈ నార్త్ ఫుడ్ ఫెస్ట్ ఆగస్టు 31 వరకు కొనసాగుతుంది. ఢిల్లీకి చెందిన ప్రఖ్యాత చెఫ్ ధృవ్ ఒబెరాయ్, అవార్డ్ విన్నింగ్ మిక్సాలజిస్ట్ హరీష్ చిమ్వాల్ ఆధ్వర్యంలోని ఈ ప్రత్యేకమైన డైనింగ్ ఫుడ్ లవర్స్‌కు డెస్టినేషన్‌గా మారింది. - సాక్షి, సిటీబ్యూరో






స్పైసీ, మసాలాలు, బిర్యానీలు ఆస్వాదించే హైదరాబాద్‌లో పుల్లటి ఉసిరి, కచ్చ మామిడి సలాడ్ మొదలు హిమాలయన్ చీజ్ సౌఫిల్ వరకు వినూత్న రుచులు సందడి చేస్తున్నాయి. చెఫ్ ధ్రువ్ పాకశాస్త్ర నైపుణ్యంతో తయారు చేసిన జామూన్ ఊరగాయ, పొగబెట్టి వడ్డించిన వంకాయ లాబ్నేతో పాటు సిరోహి మటన్, క్వాయిల్ ఎగ్ కుఫ్తే మీట్‌బాల్స్ వంటి నోరూరించే వంటకాలు నగరానికి సరికొత్త ఆకలిని సృష్టిస్తున్నాయి. ఆహ్లాదమైన దుర్గం చెరువు అంచున బటర్‌నట్ స్క్వాష్-హరిస్సా, తాహినీ-సీబాస్, కటిల్ ఫిష్-పిసి వంటి ఆధునికత మిళితం చేసిన క్లాసిక్ వంటకాలు మరో లోకాన్ని పరిచయం చేస్తున్నాయి. వీటికి అద్భుత సమ్మేళనంలా హరీష్ చిమ్వాల్ అందిస్తున్న కాక్‌టెయిల్ మిక్సింగ్ మరో స్పెషాలిటీ. ఎథీనా, హైబిస్కస్, రోసా టెక్, మొరాకన్ సోర్, కోకో బౌలే వార్డియర్ వంటి మిక్స్‌లు వెస్టన్ బార్‌లను తలపిస్తున్నాయి.

హైదరాబాద్, ఢిల్లీ పాప్-అప్..

కొత్త రుచులను ఆస్వాదించడానికి నగరవాసులు విదేశాలకు లేదా ఉత్తరాది నగరాలకు వెళ్లాల్సిన శ్రమ లేకుండా.. ఆ రుచులే నగరానికి వచ్చాయి. ఈ హైదరాబాద్, ఢిల్లీ పాప్-అప్ మునుపెన్నడూ చూడని మంచి అనుభూతిని అందిస్తుంది. ఉత్తరాది వారు నగరంలో ఎంతో మంది ఉన్నారు. నార్త్ వంటకాలను ఇష్టపడే నగరవాసులు కూడా ఉన్నారు.
- విజయ్ దేవిడ్ నిరంజన్, చెఫ్-అలివ్ బిస్ట్రో హైదరాబాద్.

కొత్త రుచులే.. నా హాబీ..

మన సిటీలో నార్త్ డిషెస్ తినడం గొప్ప అనుభూతి. సాధారణంగా కొత్త కొత్త రుచుల కోసం విభిన్న ప్రాంతాలకు వెళ్తుంటాను. నా హాబీలో భాగంగా దేశంలోని అన్ని ప్రాంతాల వంటకాలను రుచి చూశాను. ఐతే.. నార్త్ వంటకాలకు ప్రత్యేకమైన రుచి ఉంటుంది. స్థానిక వంటకాలతో పాటు వాటికి మోడ్రన్ హంగులను అద్దుతారు. ఈ ఫెస్ట్‌లో హిమాలయన్ చీజ్ జామూన్ భలే రుచిగా ఉంది. ఈ కొండ పైనుంచి దుర్గం చెరువు అందాలను తిలకిస్తూ తినడం మరచిపోలేని అనుభూతి.
- కృతిక సనైన, జూబ్లీహిల్స్



వావ్ హైదరాబాద్..

హైదరాబాద్‌ను సందర్శించాలనే చికాల కోరిక ఈ విధంగా నెరవేరింది. నా దృష్టిలో సౌత్‌ఫుడ్ ఆరోగ్యకరమైంది.. నార్త్ ఫుడ్ రుచికరమైంది. ఈ ఫెస్ట్‌లో భాగంగా ఉత్తరాది రుచులను నగరవాసులు బాగా ఆస్వాదిస్తున్నారు. కాఫీ, రమ్‌లో నానబెట్టిన స్పాంజ్-మాస్కార్పోన్ ట్రిఫిల్ కొత్త అనుభూతినిస్తుంది. యువ తరం టిరామిసు పిక్నిక్ బాస్కెట్లను ఇష్టంగా ఆరగిస్తున్నారు. దక్షిణాది ఆహార ప్రియుడిగా నేను కూడా ఓల్డ్‌సిటీ రుచులకు ముగ్ధుడినైపోయా.. షాగౌస్ బిర్యానీ రుచి వావ్ అనిపించింది. దేశంలోనే కాదు గ్లోబల్ వేదికగా కూడా ఈ నగరం ఫుడ్ ప్యారడైస్ అని చెప్పొచ్చు. ఇక్కడి సంస్కృతి, వ్యక్తిత్వాలు, ఆదరణ మరే నగరానికి సాటి రాదు.
- ప్రఖ్యాత చెఫ్ ధృవ్ ఒబెరాయ్, అలివ్ బార్ అండ్ కిచెన్ న్యూఢిల్లీ

ఆకలి తెలిసిన మనిషి..

అన్నార్థులకు కొండంత అండగా
30 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు
నెలకు రూ.25 వేల వరకూ ఖర్చు
సేవ మార్గంలో కందూరి కృష్ణ

ఆకలికి పేద, గొప్ప తారతమ్యం లేదు. దానికి అందరూ సమానమే.. సమయానికి పిడికెడు మెతుకులు పొట్టలో పడకపోతే అల్లాడిపోతాం. ఆ విలువ తెలిసిన వాడు కనుకే ఆయన ఆకలితో ఉన్న వారి కోసం ఆలోచిస్తారు. మానవ సేవే మాధవ సేవ అన్న మాటను బలంగా నమ్ముతూ సేవా మార్గంలో పయనిస్తున్నారు కందూరి కృష్ణ. దానికి తాను సంపాదించిన దాంట్లో కొంత పేదల కోసం ఖర్చు చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు దాదాపు 30 ఏళ్లుగా (మూడు దశాబ్దాలుగా) ఎంతో మంది ఆకలి తీరుస్తున్నారు. కందూరి కృష్ణ చిక్కడపల్లి నివాసి. స్థానికంగా శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో నగల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. తనకు వచ్చే సంపాదనలో ఏటా సుమారు రూ.2 లక్షలకు పైగా సేవా కార్యక్రమాల కోసం వినియోగిస్తున్నారు.
- సుందరయ్య విజ్ఞాన కేంద్రం



మిత్రుల సహకారంతో..



ప్రముఖ వ్యాపారవేత్త ప్రమోద్ అగర్వాల్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్.గోవింద్‌రావుల సహకారం, ప్రోత్సాహంతో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నాం. నా సంపాదనలో కొంత భాగం పేదలకు ఖర్చు పెట్టాలనేదే ఉద్దేశం. ప్రతి రోజూ స్కూల్ విద్యార్థులతో పాటు డిగ్రీ, పీజీ, బీటెక్ విద్యార్థులు, ఇతర వర్గాల పేదలు ఉదయం 7.30 గంటల వరకు మా షాపు వద్ద క్యూలైన్‌లో ఉంటారు. ప్రతిరోజూ సుమారు 250 మందికి అల్పాహారంతో పాటు అరటిపండ్లు అందజేస్తున్నా.
- కందూరి కృష్ణ, ఫౌండేషన్ నిర్వాహకులు

ఆకలితో అలమటించే వారిని ఆదుకోవడం కోసం సాటి మనిషిగా కందూరి కృష్ణ ప్రతినిత్యం పలు ఆలయాల వద్ద అల్పాహారంతో పాటు అన్నదానం చేస్తుంటారు. చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో యాచకులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారాన్ని అందిస్తారు. సమీప ప్రాంతాల్లోని ఆలయాల పరిసరాల్లో టిఫిన్ సెంటర్ల నిర్వాహకులకు కృష్ణ ప్రతినెలా రూ.25 వేలు చెల్లిస్తారు. ఈ మేరకు టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు నిరుపేదలకు అల్పాహారాన్ని అందిస్తారు. అల్పాహారంతో పాటు అరటి పండ్లను పంపిణీ చేస్తారు. ప్రతిరోజూ తన నగల దుకాణం వద్ద ఉదయం 7 గంటలకు అల్పాహారంతో పాటు అరటి పండ్లను పంపిణీ చేస్తారు. ఇందులో పేదలతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువకులు కూడా బారులు తీరుతూ అల్పాహారాన్ని అందుకుంటారు.

30 ఏళ్లుగా షెడ్యూల్ ప్రకారం..

అప్పుడప్పుడు ఈ అల్పాహారాన్ని తీసుకుని ఉన్నత ఉద్యోగాల్లో చేరిన యువకులు కందూరి కృష్ణ వద్దకు వచ్చి సార్ మీరు ఇచ్చిన అల్పాహారం ఎంతో ఉపయోగపడింది. ఈ రోజు ఉన్నత స్థాయికి చేరుకున్నామని చెబితే ఆయన ఆనందానికి అవధులు లేకుండాపోతుందని చెబుతారు.. 30 ఏళ్లుగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం శంకరమఠం, మంగళ, బుధ వారాల్లో సికింద్రాబాద్‌లోని పద్మరావునగర్ స్కంధగిరి ఆలయం, గురువారం బాగ్‌లింగంపల్లిలోని సాయి బాబా మందిరం, శుక్రవారం లిబర్టీలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, శనివారం చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం పరిసరాల్లో అల్పాహారాన్ని అందిస్తూ నిర్విరామంగా సేవలను కొనసాగిస్తున్నారు. తరచూ గోశాలలోని పశువులకు ఆహారాన్ని అందిస్తారు. అనేకమార్లు సామాజిక సేవలను కొనియాడుతూ ప్రస్తుత గవర్నర్ బండారు దత్తాత్రేయ లాంటి వారు సైతం కందూరి కృష్ణను సన్మానించారు.

ఎన్నో ఉచిత వైద్య శిబిరాలు..

పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజల ఆరోగ్యానికీ కందూరి కృష్ణ ఇప్పటి వరకూ సుమారు 130కిపైగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. రోగులకు అవసరమైన చికిత్సలు అందించారు. 75 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించారు. వృద్ధులకు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్‌లో సంభవించిన వరదల్లో సర్వస్వం కోల్పోయిన వారికి రూ.4 లక్షలతో దుస్తులను పంపిణీ చేశారు. ఎనిమిది సార్లు ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహించి 635 యూనిట్ల రక్తాన్ని సేకరించి రక్తనిధికి అందించారు. ట్విన్ సిటీస్ జ్యూవెలరీస్ అధ్యక్షుడిగా దశాబ్ద కాలంగా కొనసాగుతున్నారు. కందూరి కృష్ణ ఫౌండేషన్ ద్వారా నిరంతరం సేవలను కొనసాగిస్తున్నారు.



పేద విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటు..

ఉచితంగా అల్పాహారం పంపిణీ చేయడం వల్ల పేద విద్యార్థులకు ఎంతో కొంత ఆర్థికంగా వెసులుబాటు లభిస్తుంది. నాది వరంగల్ జిల్లా నేను ఎంఫార్మసీ పూర్తి చేశాను. ప్రతి రోజూ నాతో పాటు అనేక మంది విద్యార్థులు క్యూలైన్‌లో నిలబడి అల్పాహారం తీసుకుంటారు.
- పల్లవి, ఎంఫార్మసీ




పేదల ఆకలి తీర్చే దేవుడు..

ఈయన పేదల ఆకలి తీర్చే దేవుడు. ప్రతిరోజూ ఉదయం అనేక మంది నాతో పాటు పేదలు వచ్చి అల్పాహారాన్ని తీసుకుంటారు. ఈ ప్రధాన రహదారి నుంచి పోయే చిరువ్యాపారులు సైతం క్యూలో నిలబడి జైశ్రీరామ్ అంటూ అల్పాహారం తీసుకొని సంతోషంగా వెళ్లిపోతుంటారు.
- లక్ష్మి, చిక్కడపల్లి

బంజారా గొంతుకగా..!

- ధావ్లో పుస్తకానికి కేంద్ర సాహిత్య యువ పురస్కారం
- ఆదివాసీల సాహిత్యంపై అన్వేషణ జరగాలి
- పురస్కార గ్రహీత రమేశ్ కార్తీక్ నాయక్ మనోగతం
- భాగ్యనగరంతో ముడిపడిన రమేశ్ సాహిత్య జీవితం





అక్షరమే అతడి ఆయుధం.. ఆ అక్షరంతోనే జీవితంలో మార్పు వస్తుందని నమ్మాడు. మారుమూల తండా నుంచి వచ్చి ఎంఏ ఇంగ్లిష్‌లో పట్టా పుచ్చుకుని.. తెలుగులోనూ పట్టు సాధించాడు. అందరిలా తెలుగులోనే రాస్తే కొత్త ఏముందనుకున్నాడు. అందుకే గిరిజనుల జీవితాలను సమాజానికి కళ్లకు కట్టినట్టు చూపించాలనుకున్నాడు. ముఖ్యంగా బంజారాల జీవన విధానంపై, వారి సంస్కృతిపై సమాజంలో ఉన్న అభిప్రాయాన్ని తొలగించాలని నడుంబిగించాడు. ధావ్లో పేరుతో కథా సంపుటిని వెలువరించాడు.
- సాక్షి, సిటీబ్యూరో

బలమైన సంకల్పంతో ముందడుగు వేస్తే ప్రకృతి కూడా సహకరిస్తుందంటారు. అదే నిజమైంది. చిన్న ప్రాయంలోనే కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అతడిని వరించింది. అతడే నూనావత్ రమేశ్ కార్తీక్ నాయక్. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండాలో పుట్టి పెరిగిన రమేశ్‌కు హైదరాబాద్ నగరంతో విడదీయలేని బంధం ఉంది. ఇక్కడే అతడి రచనలు పురుడు పోసుకున్నాయి. ఎంఏ ఇంగ్లిష్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

ధావ్లో కథలకు గుర్తింపుగా..

కార్తీక్ రాసిన ధావ్లో కథా సంపుటికి కేంద్ర సాహిత్య యువ పురస్కారం దక్కింది. ధావ్లో అంటే విషాదగీతమని అర్థం. బంజారా మహిళలు విషాద సమయాల్లో ఈ పాట పాడుకుంటారు. అయితే విషాదమే కాకుండా.. ఆనంద సమయాల్లోనూ, ఒకరికొకరు ఎదురుపడినప్పుడు కౌగిలించుకొని పాడుకుంటారు. వారి అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఏడుస్తారు. ఈ పాటలు మౌఖికంగా తరతరాలకు చేరుతున్నాయి. ఈ పాటలకు గుర్తుగా పుస్తకానికి తాను ధావ్లో అని పేరు పెట్టానని చెప్పుకొచ్చాడు.

బల్దేర్ బండితో ప్రారంభమై..

ధావ్లోకు ముందు బల్దేర్ బండి అనే పుస్తకాన్ని రమేశ్ రచించాడు. ఎడ్ల బండి అని అర్థం. దీన్ని 2018లో పూర్తి చేశాడు. దాని తర్వాత ధావ్లో రాశాడు. ప్రొఫెసర్ ధనంజయ్‌తో కలిసి కేసుల అనే పుస్తకానికి సంపాదకత్వం వహించాడు. ఆ తర్వాత చక్మా అనే ఇంగ్లిష్ పొయెట్రీ తీసుకొచ్చాడు.

చదువు కొనసాగిస్తూనే..

ప్రస్తుతం ఎంఏ తెలుగు కోర్సు ఉస్మానియా ఓపెన్ యూనివర్సిటీలో కొనసాగిస్తూ పుస్తకాలు రచిస్తున్నాడు. గిరిజనులు, ఆదివాసీల గొంతుకను బలంగా వినిపించాలనే సంకల్పంతో తాను రచనలు చేస్తున్నానని చెప్పుకొచ్చాడు. అయితే అందరిలా కాకుండా నిజజీవితానికి దగ్గరగా ఉండేలా తన రచనలు చేస్తానని, భవిష్యత్తుల్లో కూడా సహజంగా ఉండే రచనలు చేయాలనేది తన కోరిక అని పేర్కొంటున్నాడు.

ఆదివాసీల సాహిత్యం వెలికితీయాలి..

తెలుగులో లేదా ఇతర భాషల్లో సంచార, గిరిజన, ఆదివాసీల సాహిత్యం గురించి మరింత అన్వేషించాల్సిన అవసరం ఉందని కార్తీక్ చెబుతున్నాడు.

'ఆహా గోదారి'కి నెక్సా స్ట్రీమింగ్ అకాడమీ అవార్డు

నెక్సా, సైమా సంయుక్త ఆధ్వర్యంలో 13 అవార్డులను గెలుచుకున్న 'ఆహా'



సాక్షి, సిటీబ్యూరో: ముంబై వేదికగా నిర్వహించిన నెక్సా స్ట్రీమింగ్ అకాడమీ అవార్డ్స్‌లో భాగంగా గేటో నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వరంలో నిర్మించిన 'ఆహా గోదారి' ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రంగా అవార్డు పొందింది. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డులను అందించారు. ఈ వేదికపై ఆహా ఏకంగా 13 అవార్డులను గెలుచుకుని దాని ప్రశస్తిని చాటుకుంది. హిందీతో పాటు ప్రాంతీయ భాషల్లో 48 విభాగాల్లో ఈ అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. 'అన్‌స్టాపబుల్ సీజన్-2'తో ఉత్తమ నాన్-ఫిక్షన్ ఒరిజినల్ స్పెషల్ షోగానే కాకుండా 'ఆహా' ఉత్తమ ప్రాంతీయ వేదికగా టైటిల్‌ను పొందింది. వ్యక్తిగత విభాగంలో 'అన్యాస్ ట్యుటోరియల్' చిత్రానికి గాను విజయ్ కె.చక్రవర్తి ఉత్తమ సినిమాటోగ్రాఫర్ (సిరీస్) అవార్డును, 'ఆహా గోదారి'కి గోపవారుల దివాకర్ ఉత్తమ డాక్యుమెంటరీ ఒరిజినల్‌గా, 'న్యూసెన్స్'లో కిరణ్ మామెడి ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ (సిరీస్)గా, 'భామకలాపం-1'లో ప్రియమణి రాజ్ ఉత్తమ నటిగా, ఇదే చిత్రానికి అభిమన్యు తడిమేటి ఉత్తమ కథా పురస్కారాన్ని, అన్యాస్ ట్యుటోరియల్, భామాకలాపం-1 చిత్రాలకు నివేదిత సతీష్, శరణ్య ప్రదీప్‌లు ఉత్తమ సహాయ నటులుగా తదితర అవార్డులను ఆహా గెలుచుకుంది. బెస్ట్ రీజినల్ ప్లాట్‌ఫామ్‌గానూ ఆహా సీఈఓ రవికాంత్ సబ్నవిస్-2 అవార్డులను పొందారు.

అరాచకాన్ని అడ్డుకుందాం

ప్రజాస్వామ్య పరిరక్షణకు అండగా నిలవండి.. జాతీయ మీడియాతో మాజీ సీఎం వైఎస్ జగన్



జాతీయ మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది
- 30కి పైగా హత్యలు.. 1,000కి పైగా దాడులు
- వందల్లో హత్యాయత్నాలు, ఊరూరా విధ్వంసాలు
- ఎంపీలే బయట తిరగలేని పరిస్థితి
- దమనకాండకు సంబంధించిన ఫొటో, వీడియోలు వీక్షించండి
- ఇలాంటివి ప్రజాస్వామ్య వ్యవస్థలో కొనసాగొచ్చా?

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో క్షీణించిన శాంతి భద్రతలు, కక్షసాధింపు చర్యలు, దాడులు, అరాచకాలపై అందరూ గళం విప్పాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ప్రజాస్వామ్యవాదులందరితో కలసి అరాచకాన్ని అడ్డుకుందామన్నారు. 'ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మీ ఇంట్లోకి చొరబడి దాడి చేస్తే ఎలా ఉంటుంది? దాన్ని మీరెలా ఎదుర్కొంటారు? దానిపై మీరెలా స్పందిస్తారు? దయచేసి ఇక్కడి గ్యాలరీలో ఫొటోలు, వీడియోలు చూడండి. ఆంధ్రప్రదేశ్‌లో దారుణ పరిస్థితి గురించి తెలుసుకోండి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో అండగా నిలవండి' అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విధ్వంసకాండను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా, దాడుల తాలూకు ఫొటో గ్యాలరీని ప్రారంభించిన సందర్భంగా ఆయన జాతీయ మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి, చట్టం ముందు అందరూ సమానులే అన్న స్ఫూర్తికి విఘాతం కలిగిన నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిని యావత్ దేశం దృష్టికి తెచ్చేందుకు ఇక్కడ నిరసన చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అరాచక, ఆటవిక పాలన సాగుతోందని, అంతులేని దారుణాలు జరుగుతున్నాయని చెప్పారు. అరాచకాలు, అమానవీయ ఘటనలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు చూపుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటివి కొనసాగడం సబబేనా అని ఆలోచించాలన్నారు.

యథేచ్ఛగా దాడులు, విధ్వంసాలు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైఎస్ జగన్ తెలిపారు. యథేచ్ఛగా హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, ఆస్తుల విధ్వంసం సాగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీని అణగదొక్కడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రోత్సహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 36 హత్యలు, 300 మందిపై హత్యాయత్నాలు, 560 చోట్లకు పైగా ప్రైవేటు, 490 చోట్లకు పైగా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారన్నారు. 1,000కి పైగా దౌర్జన్యాలు, దాడులు చేశారని చెప్పారు. చీనీ తోటలు కూడా ధ్వంసం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు నారా లోకేశ్ ఒక మంత్రిగా ఉండి.. రెడ్‌బుక్ పేరిట హోర్డింగ్‌లు పెట్టారని, ఎవరెవరి మీద దాడులు చేయాలి.. ఎవరిని ఎలా వేధించాలన్న వివరాలు అందులో రాసినట్లు స్వయంగా ప్రకటించారని తెలిపారు. అధికార పార్టీ శ్రేణులు ఎలాంటి దాడులు, ఆస్తుల విధ్వంసం చేసినా, ఏ చర్యా తీసుకోవద్దని రాష్ట్ర పోలీసులకు స్పష్టంగా నిర్దేశించారని చెప్పారు. ఆ రెడ్‌బుక్‌ను రాష్ట్రంలో అంతటా హోర్డింగ్‌ల ద్వారా ప్రదర్శించడమే కాకుండా, దాన్ని గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లారన్నారు. ఆ విధంగా రాష్ట్రంలో ఇప్పుడు భారత రాజ్యాంగం కాకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగం పని చేస్తోందని తెలిపారు.

మేం దాడులను ప్రోత్సహించలేదు

గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలేవీ జరగలేదని వైఎస్ జగన్ గుర్తు చేశారు. హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసం, ఇళ్లలోకి చొరబడి వేధింపులు, దాడులు ఎక్కడా జరగలేదని.. పౌర హక్కులకు భంగం కలిగించలేదని వివరించారు. కానీ, ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన, విధ్వంసాన్ని ప్రశ్నించకపోతే, వాటన్నింటినీ వెంటనే ఆపలేకపోతే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసం, చీనీ తోటల ధ్వంసం.. వీటన్నింటిపై ఫొటో గ్యాలరీతో పాటు వీడియోలు కూడా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. 'దయచేసి ఒక్కసారి ఈ ఫొటోలు, వీడియోలు చూడండి. రాష్ట్రంలో దారుణ పరిస్థితిని అర్థం చేసుకోండి. మా పార్టీ ప్రజా ప్రతినిధులు.. చివరకు ఒక ఎంపీ కూడా తన నియోజకవర్గంలో తిరగలేని పరిస్థితి. ఎంపీ మిథున్‌రెడ్డిపై పట్టపగలే రాళ్లతో దాడి చేసి వాహనాలు ధ్వంసం చేశారు. ఇన్ని జరుగుతున్నా, పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఆ విధంగా రాజ్యాంగ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేశారు' అని చెప్పారు. రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్న వారి నుంచి బాధితులను కాపాడకపోగా, తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కంటే దారుణం ఎక్కడైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇలాంటి దుస్థితి ప్రజాస్వామ్య వ్యవస్థలో కొనసాగడం సబబేనా? అన్నది ఆలోచించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమానికి అండగా నిలవకపోతే ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేమన్నారు.



అఖిలేశ్ యాదవ్‌ను పలకరిస్తున్న వైఎస్ జగన్



సంజయ్ రౌత్‌కు టీడీపీ దాడుల గురించి వివరిస్తున్న జగన్



శివసేన (యూబీటీ), తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ ఎంపీలు ప్రియాంక చతుర్వేది, నదీముల్ హక్, రాంగోపాల్ యాదవ్‌లకు టీడీపీ దాడుల గురించి వివరిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

నరమేధంపై కన్నెర్ర

ఏపీలో ఆటవిక పాలనపై ఢిల్లీలో కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ



ఢిల్లీ ధర్నాకు హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న నరమేధం, ఆటవిక పాలన, హత్యారాజకీయాలకు నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ కదంతొక్కింది. కూటమి ప్రభుత్వ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో టీడీపీ కొనసాగిస్తున్న మారణహోమంపై కన్నెర్ర జేసింది. ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా సాగుతున్న హత్యలు, విధ్వంసకాండకు వ్యతిరేకంగా జంతర్‌మంతర్ వేదికగా బలంగా గళమెత్తింది. హత్యా రాజకీయాలకు ఫుల్‌స్టాప్ పడేలా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలన్న డిమాండ్‌తో హోరెత్తించింది. టీడీపీ అరాచకంపై పిడికిలి బిగించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఆప్, ఏఐడీఎంకే, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, వీసీకే సహా పలు పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణకు చేస్తున్న పోరాటానికి సంపూర్ణంగా మద్దతు ఇస్తామని ప్రకటించారు.

పిడికిలి బిగించి, గళమెత్తి..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులపై సాగుతున్న హత్యలు, హత్యాచారాలు, దాడులు, ఆస్తుల విధ్వంసాలను యావత్తు దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో జంతర్‌మంతర్ వేదికగా బుధవారం వైఎస్ జగన్ చేపట్టిన ధర్నాకు మంచి స్పందన లభించింది. బుధవారం ఉదయం ధర్నాకు ముందు ఢిల్లీలో భారీ వర్షం కాస్త కలవరపాటుకు గురిచేసినా, ఉదయం 11 గంటలకు ముందే పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ధర్నా స్థలికి చేరుకున్నారు. ధర్నా ప్రాంతానికి వైఎస్ జగన్ వచ్చే సమయానికే ఆ ప్రాంతమంతా ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది నేతలు, కార్యకర్తలతో నిండిపోయింది. వైఎస్ జగన్ ధర్నా వేదికపైకి వచ్చిన వెంటనే ఆయన్ను కలిసేందుకు నేతలు పోటీపడ్డారు. ఫొటో గ్యాలరీని వైఎస్ జగన్ తిలకిస్తున్న సమయంలో 'సేవ్ ఏపీ.. ఫ్రమ్ టీడీపీ', 'నరరూప రాక్షసుడు.. నారా బాబు' అంటూ నేతలు, కార్యకర్తలు బిగ్గరగా నినాదాలు చేశారు. కార్యక్రమం ఆసాంతం నేతలు, కార్యకర్తలు టీడీపీ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. టీడీపీ పాలనపై వైఎస్ జగన్ చేసే పోరాటాలకు వెన్నంటి ఉంటామని పిడికిలి బిగించి మద్దతు పలికారు. సాయంత్రం నాలుగు గంటలకు ధర్నా ముగిసేంత వరకు ఆ ప్రాంగణం నేతలతో కిక్కిరిసిపోయింది.

కదిలివచ్చి మద్దతు పలికిన పార్టీలు

వైఎస్ జగన్ ధర్నాకు మద్దతుగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆ పార్టీ సీనియర్ ఎంపీ రాంగోపాల్ యాదవ్, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే)పార్టీ ఎంపీలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది, అరవింద్ సావంత్, ఏఐఏడీఎంకే సీనియర్ ఎంపీ తంబిదొరై, మరో ఎంపీ నటరాజన్ చంద్రశేఖరన్, తృణముల్ కాంగ్రెస్ ఎంపీ నదీముల్ హక్, వీసీకే పార్టీ అధ్యక్షుడు తిరుమా వలవన్, ఆ పార్టీ ఎంపీ రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాజేంద్రపాల్ గౌతమ్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీలు అబ్దుల్ వాహబ్, హ్యారిస్ బీరన్, జేఎంఎం ఎంపీ విజయ్ హన్సక్ తదితరులు వైఎస్ జగన్ ధర్నాకు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అఖిలేశ్‌యాదవ్ సహా మిగతా నేతలంతా సభా వేదికపై ప్రదర్శించిన వీడియోలను, ఫొటోగ్యాలరీని వీక్షించారు. ఏపీలోని వివిధ జిల్లాల్లో జరిగిన దమన కాండను వైఎస్ జగన్ స్వయంగా నేతలకు వివరించారు.

దమనకాండను కళ్లకు కట్టిన పోస్టర్లు

ధర్నా వేదికకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ రాష్ట్రంలో సాగుతున్న దమనకాండను కళ్లకు కట్టింది. నంద్యాల, పల్నాడు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా నెల్లూరు సహా వివిధ జిల్లాలో టీడీపీ కొనసాగించిన విధ్వంకాండ, హత్యలు, దాడుల ఫొటోలు హత్యా రాజకీయాలను అద్దంలా చూపాయి. ధర్నాకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఫొటోలను వీక్షించి తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. కొందరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు వారి వారి జిల్లాల్లో జరిగిన దాడుల ఫొటోలను ఇతర జిల్లాల నేతలకు చూపిస్తూ, టీడీపీ నేతల అరాచకాన్ని తూర్పారపట్టారు. ధర్నాను కవర్ చేసిన జాతీయ మీడియా సైతం ఫొటో గ్యాలరీని తమ తమ ఛానళ్లలో చూపించేందుకు ప్రాధాన్యమిచ్చింది. సభా వేదికపై ప్రదర్శించిన వీడియోలు సైతం కార్యక్రమానికి వచ్చిన వారిని తీవ్ర ఉద్వేగానికి గురిచేశాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లా వినుకొండలో ఇటీవల హత్యకు గురైన రషీద్ వీడియోను చూసిన వారంతా ఒక్కసారి ఖిన్నులైపోవడం కనిపించింది. ఇంత దారుణాన్ని తమ జీవితంలో చూడలేదని అభిప్రాయపడ్డారు. నరమేధానికి సంబంధించిన ఫొటోలు, ప్లకార్డులను సైతం నేతలు, కార్యకర్తలు చేత పట్టుకొని జంతర్ మంతర్ చుట్టూతా ప్రదర్శన నిర్వహించారు.

ఇలాగైతే ఎక్కువ రోజులు అధికారంలో ఉండరు

టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఎస్పీ అధినేత అఖిలేశ్ ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల్ని భయపెట్టాలనుకుంటున్నారా? పట్టపగలే దాడులు, హత్యలు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం, ప్రతిపక్ష పార్టీ శ్రేణులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం.. వేధించడం, ఎన్నికైన ప్రజా ప్రతినిధులపై ఏకంగా హత్యాయత్నం చేయడం.. ఇలాంటి బుల్డోజర్ సంస్కృతితో ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు?' అని యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాగైతే ఎక్కువ రోజులు అధికారంలో ఉండరని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ తరహా దాడులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. ఏపీలో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీలో బుధవారం వైఎస్ జగన్ చేపట్టిన నిరసన కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఫొటోలు, వీడియోలు చూశాక ఓ విషయం స్పష్టం చేయదల్చుకున్నా. అధికారంలో ఉన్న వారు సంయమనం పాటించాలి. ప్రజల సమస్యలు పట్టించుకోవాలి. ఎదుటి వారు చెప్పేది వినాలి. అంతేకానీ, వారి ప్రాణాలు తీయకూడదు. నిన్నటి వరకు వైఎస్ జగన్ సీఎంగా ఉన్నారు. ఇప్పుడు చంద్రబాబు సీఎంగా ఉన్నారు. రేపు మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బుల్డోజర్ సంస్కృతిని సమాజ్‌వాదీ పార్టీ ఏనాడూ సమర్థించలేదు. దాన్ని తప్పు పడుతున్నాం' అని చెప్పారు. 'వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా మద్దతు ఉంటుంది. అండగా నిలబడతాం. ఇలాంటి పరిస్థితి రేపు మరెవరికైనా రావచ్చు. మేమెప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడతాం' అని స్పష్టం చేశారు.

ఏపీలో ప్రజాస్వామ్యం ఉందా?



ఏపీ ప్రభుత్వానికి ఒక్క రోజు కూడా పాలించే హక్కు లేదు. దేశంలో కేంద్ర హోం మంత్రి, ఆ మంత్రిత్వ శాఖ ఉంటే.. వెంటనే స్పందించాలి. ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపాలి. ఏపీలో జరుగుతున్న దాడులు, అమానుషాలు, విధ్వంసంపై సమగ్ర విచారణ జరిపించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం లేదు. అందుకే మేము వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీకి పూర్తి మద్దతు ఇస్తున్నాం. వారి పోరాటానికి అండగా నిలబడతాం.

– శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్

ఏపీలో పరిస్థితి దిగ్భ్రాంతికరం



'ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. రాష్ట్రంలో ఏ స్థాయిలో దౌర్జన్యాలు జరిగాయో చూస్తే, బాధ అనిపిస్తోంది. ఇళ్లపై దాడులు చేశారు. ఆ ఘటనలన్నింటినీ తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే కేంద్రం సుమోటోగా చర్య తీసుకోవాలి. వెంటనే ఏపీలో పరిస్థితి చక్కదిద్దాలి. మేము జగన్‌కు, రాష్ట్ర ప్రజలకు అండగా, తోడుగా నిలబడతాం.

– టీఎంసీ ఎంపీ నదీముల్ హక్

శాంతి భద్రతలను కాపాడాలి



ఎన్నికలు జరిగిన నెల రోజుల్లోనే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అధికార టీడీపీ అనేక దౌర్జన్యాలు చేసింది. రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతున్నారు. ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరవాలి. ఏపీలో శాంతి భద్రతలు కాపాడాలి. మా పార్టీ తరఫున వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటిస్తున్నాం.

– వీసీకే పార్టీ అధినేత తిరుమావలవన్

ఇది ప్రభుత్వ ఉగ్రవాదం



ఏపీలో ప్రభుత్వమే స్వయంగా ఉగ్రవాదానికి పాల్పడుతోంది. ఏపీలో జరుగుతున్న ఉగ్రవాద తరహా దాడులకు వ్యతిరేకంగా మాజీ సీఎం వైఎస్ జగన్ చేస్తున్న పోరాటానికి మద్దతిస్తున్నాం.

– ఐయూఎంఎల్ ఎంపీ వాహబ్

వారికీ దేశద్రోహులకి తేడా ఏముంది



దేశం ఎటు పోతుంది? దేశంలో ఏం జరుగుతోంది? ఎన్నికల్లో గెలుపొందిన పార్టీ, ఓడిన పార్టీ శ్రేణులపై దాడులు చేసి ప్రాణాలు తీయడం ఏంటి?. వారికి, దేశ ద్రోహులకు తేడా ఏముంది? దేశ ద్రోహుల కంటే వీరు తక్కువేమీ కాదు. కేంద్రం ఏం చేస్తోంది? ఎన్డీఏ కూటమి ఎందుకు స్పందించడం లేదు? ఏపీలో జరుగుతున్న ఘటనలపై కేవలం దాడులు, దౌర్జన్యాల కోణంలోనే కాకుండా, దేశద్రోహ కేసులు నమోదు చేయాలి.

– ఆప్ ఎమ్మెల్యే రాజేంద్రపాల్ గౌతమ్

కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలి



ఏపీలో దౌర్జన్యాలు, అరాచకాలు అరికట్టాలి. ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరవాలి. వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు జరుగుతుంటాయి. గెలిచిన పార్టీ, ఓడిన పార్టీపై దాడులు చేయడం, వేధించడం సరికాదు. ఏపీలో అదే జరుగుతోంది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా ఉంది. ఏపీలో జరుగుతున్న దౌర్జన్యాలు, అరాచకాలను కేంద్రం అరికట్టి శాంతి భద్రతలను కాపాడాలి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, శాంతి భద్రతలు బాగు పడడానికి.. మేము, జగన్‌తో కలిసి పని చేయాలని నిర్ణయించాము. వైఎస్సార్‌సీపీకి ఏఐఏడీఎంకే పూర్తి మద్దతు ఇస్తుంది.

– ఏఐఏడీఎంకే ఎంపీ తంబిదొరై

'చలో చిలుకూరు' ఉద్రిక్తం



గ్రామస్తుల ఆందోళన

మొయినాబాద్: చిలుకూరులో వక్ఫ్‌బోర్డు స్థలంలోని పురాతన నిర్మాణాన్ని కూల్చివేయడంతో చెలరేగిన వివాదం ఆందోళనకు దారితీసింది. సోమవారం రాత్రి ఓ వర్గం వారు ఆందోళన చేపట్టి వక్ఫ్‌బోర్డు స్థలంలో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టగా.. మంగళవారం రాత్రి మరో వర్గం నిర్మాణాలు చేపట్టవద్దంటూ ఆందోళనకు దిగింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని నిర్మాణాలను అడ్డుకుని బుధవారం నుంచి ఈ నెల 30 వరకు సెక్షన్ 144 (కొత్త చట్టం బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163) సెక్షన్ విధించారు. బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చలో చిలుకూరు కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ఉదయం 10 గంటల వరకే బజరంగ్‌దళ్ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ సమీపంలో అన్యమతాలకు సంబంధించిన నిర్మాణాలు చేపట్టవద్దంటూ ఆందోళన చేపట్టారు. నూత న నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద స్థలం వద్దకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

ఆందోళనకారులతో డీసీపీ చర్చలు

బాలాజీ దేవాలయం సమీపంలోని వక్ఫ్ బోర్డు స్థలంలో చేపట్టే నిర్మాణాల విషయంలో చెలరేగిన వివాదాన్ని పరిష్కరించేందుకు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఆలయం అర్చకుడు రంగరాజన్ గ్రామస్తులతో చర్చించారు. వక్ఫ్ బోర్డు అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో బజరంగ్‌దళ్ కార్యకర్తలు, గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఈ ఘటనకు కారణమైన భూయజమాని, సూపర్‌వైజర్, జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆలయానికి వెళ్లే మార్గంలో హిమాయత్‌నగర్, టెంపుల్ చౌరస్తా, చిలుకూరులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల వివరాలు తెలుసుకుని అనుమతించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి రెండు కిలోమీటర్ల పరిధిలో అన్యమత నిర్మాణాలు చేపట్టవద్దని ఉన్న నిబంధనలే చిలుకూరు బాలాజీ ఆలయానికి కూడా వర్తిస్తాయని అర్చకుడు రంగరాజన్ చెప్పారు. సర్వే చేసి వక్ఫ్‌బోర్డు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

'కోకాపేట్'పై బీఆర్‌ఎస్‌కు హైకోర్టు నోటీసులు

వివరాలు తెలుసుకొని చెప్పాలని ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డిజిల్లా గండిపేట్ మండలం కోకాపేట్‌లో 11 ఎకరాల భూకేటాయింపుపై బీఆర్‌ఎస్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. దీనిపై పూర్తి వివరాలు తెలుసుకొని చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే 22వ తేదీకి వాయిదా వేసింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కోసం బీఆర్‌ఎస్‌కు 2023లో ప్రభుత్వం 11 ఎకరాలు కేటాయించింది. దీనికోసం బీఆర్‌ఎస్ ఎకరానికి రూ.3.41 కోట్లు చెల్లించింది. అయితే కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు కేటాయించిన భూమి తమదేనంటూ సికింద్రాబాద్‌కు చెందిన అశోక్‌దత్ జైశ్రీతోపాటు అతని కుటుంబసభ్యులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బీఆర్‌ఎస్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు.

హనుమకొండ భూకేటాయింపుపై తీర్పు రిజర్వు

బీఆర్‌ఎస్ పార్టీకి హనుమకొండలో కేటాయించిన భూమికి సంబంధించి అధికారులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. బీఆర్‌ఎస్‌కు హనుమకొండలో సర్వే నంబరు 1066లో కేటాయించిన స్థలం, భవననిర్మాణ అనుమతి పత్రాలను అందజేయాలని కాజీపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పార్టీ జిల్లాఅధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. బీఆర్‌ఎస్ కేటాయించిన స్థలం, నిర్మాణం జరుగుతున్న స్థలం.. రెండు వేరని ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. గత విచారణ సందర్భంగా తాత్కాలిక షెడ్ ఫొటోలు తమ ముందు ఉంచాలని పిటిషనర్‌ను ఆదేశించడంతో ఆయన తరఫు న్యాయవాది ఫొటోలు కోర్టుకు అందజేశారు. వీటిని పరిశీలించిన న్యాయమూర్తి.. నిర్మాణం తాత్కాలిక షెడ్‌లా లేదని అభిప్రాయపడ్డారు. అనంతరం తీర్పును ఈ నెల 30కి రిజర్వు చేశారు.

రాష్ట్ర బడ్జెట్ రూ. 2.90 లక్షల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

మార్కెట్ విలువల సవరణ జరిగితే రూ.5 వేల కోట్ల వరకు అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేస్తోంది. మరోవైపు ఈ బడ్జెట్‌లో పన్నేతర ఆదాయం కింద భూముల అమ్మకాలను ప్రతిపాదించే అవకాశం కూడా ఉంది. మద్యం రేట్లు పెంచడం, ఎలైట్ షాపుల ఏర్పాటు లాంటి విధాన నిర్ణయాలను తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో రూ.15 వేల కోట్ల వరకు ఆదాయం పెరిగే అవకాశాలున్నాయి. ఈ పెరిగిన ఆదాయానికి తోడు, ఆర్థిక వృద్ధి కూడా కేటాయింపులకు ఊతమిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అన్ని పద్దులూ కీలకమే!

ఈసారి బడ్జెట్‌లో అన్ని శాఖల పద్దులూ భారీగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రుణమాఫీతో కలిపి వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.64 వేల కోట్లు, సాగునీటి శాఖకు రూ.26–28 వేల కోట్లు, విద్యా శాఖకు రూ.21 వేల కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.45 వేల కోట్ల వరకు, సంక్షేమ శాఖలకు రూ.40 వేల కోట్లు, మున్సిపల్ శాఖకు రూ.12 వేల కోట్లు ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈసారి రుణమాఫీకే రూ.31 వేల కోట్లు ఖర్చు కానున్నాయి. అందులో ఇప్పటికే రూ.6 వేల కోట్ల వరకు ఖర్చయింది. ఆగస్టు నెలాఖరు నాటికి మిగిలిన రూ.25 వేల కోట్లు వెచ్చించాల్సి ఉంది. ఇక ఆరు గ్యారంటీలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.53 వేల కోట్లు కేటాయించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, గృహలక్ష్మి, పథకాలు ఇప్పటికే అమల్లో ఉండగా, మరిన్ని పథకాలు అమలు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న విధంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించవచ్చని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.20 వేల కోట్లు అవసరం కాగా, అందులో ఏ మేరకు నిధులు ప్రతిపాదిస్తారన్న దానిపై స్పష్టత రాలేదు. సాగునీటి శాఖకు సంబంధించి రూ.9 వేల కోట్లు ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరం కాగా, అప్పులు, వేతనాలు, ఈ ఏడాది పూర్తి చేయాల్సిన ప్రాధాన్యతా ప్రాజెక్టులకు రూ.28 వేల కోట్లు అవసరమవి ఆ శాఖ కోరింది. శాఖల వారీ కేటాయింపులకు తోడు అప్పుల చెల్లింపు, ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, కొత్త ఉద్యోగాల కల్పన కోసం వేతనాలు, సాధారణ వ్యయం, విద్యుత్ సబ్సిడీలు (గృహజ్యోతి, వ్యవసాయానికి ఉచిత విద్యుత్) తదితర అనివార్య చెల్లింపులు కూడా చేయాల్సి ఉంది.

పింఛన్ల పెంపు కష్టమేనా?

ఎన్నికలకు ముందు ఆసరా పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ప్రస్తుతం అమల్లో ఉన్న పింఛన్ ప్రకారం ఏడాదికి రూ.11 వేల కోట్ల నిధులు అవసరమవుతున్నాయి. కాగా హామీ ఇచ్చిన ప్రకారం పెంచితే నెలకు రూ.1,000 కోట్ల చొప్పున ఏడాదికి మరో రూ.12 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్‌లో పింఛన్ల పెంపు ప్రతిపాదన ఉంటుందా లేదా అన్నది సందేహాస్పదంగా మారింది. అయితే వాస్తవిక కోణంలో బడ్జెట్ రూపకల్పనకు ప్రాధాన్యమిచ్చినందున ఈ ఏడాదికి పింఛన్ల పెంపు ఉండకపోవచ్చనే తెలుస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.45వేల కోట్ల వరకు ప్రతిపాదించే అవకాశముందని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి.

ఆర్థిక వృద్ధి ఆసరాగా..!

పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం ఈసారి 6.5 నుంచి 7 శాతం వరకు ఆర్థిక వృద్ధి ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. జాతీయ స్థాయి వృద్ధి కంటే తెలంగాణ వృద్ధి మరో 2–3 శాతం వరకు ఎక్కువగానే ఉండే అవకాశాలున్నాయి. ఈ వృద్ధికి తోడు రెవెన్యూ రాబడుల్లో చేపడుతున్న సంస్కరణల కారణంగా వచ్చే అదనపు ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఓటాన్ అకౌంట్‌లో పెట్టిన రూ.2.75 లక్షల కోట్ల బడ్జెట్‌ను మరో రూ.10 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల వరకు పెంచుతూ పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- నందినగర్ నివాసంలో కేసీఆర్ దంపతుల ఆశీర్వాదం
- సీఎం రేవంత్‌సహా పలువురు నేతల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. నందినగర్ నివాసంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు, శోభ దంపతులు కేటీఆర్‌ను ఆశీర్వదించారు. కేటీఆర్ భార్య, కుమారుడు, కుమార్తె పాల్గొన్నారు. 'ప్రజాసేవలో నిమగ్నమై, రాష్ట్రంలో ప్రజాపాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు మీకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలి'అని సీఎం రేవంత్‌రెడ్డి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు విపక్ష ఎమ్మెల్యేలు కూడా కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బుడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నేతలు రాజీవ్‌సాగర్, పల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పుట్టిన రోజు సందర్భంగా ఆత్మహత్యలు చేసుకున్న 13 మంది నేత కార్మికుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందజేశారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా స్టేట్ హోంలో వంద మంది విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేశారు. కాగా, కేటీఆర్ జన్మదినం సందర్భంగా తెలంగాణ భవన్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను జీహెచ్‌ఎంసీ తొలగించింది. దీనిపై బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.




కేటీఆర్‌కు స్వీట్ తినిపిస్తున్న కేసీఆర్. చిత్రంలో శైలిమ, శోభ, హిమాన్షు



యంగ్ రైటర్స్... కథలు రాస్తారా?

కొత్త తరం నుంచి కొత్త ఆలోచనలు పుడతాయి. కొత్త సాహిత్యం వస్తుంది. కొత్త కథా వస్తువులు మిలమిలమని మెరుస్తాయి. అందుకే కథలు రాయాలనుకుంటున్న నేటి తరానికి వేదిక పరవాలనుకుంటోంది సాక్షి. 30 ఏళ్ల లోపు యువ రచయితల కోసం 'సాక్షి ఫన్‌డే'లో 'యువ కథ' శీర్షిక ప్రారంభించనుంది. 'సాక్షి ఫన్‌డే' మేగజీన్‌లో ఒకటి లేదా రెండు పేజీల నిడివి వచ్చేలా కథలు రాసి పంపండి. అవసరమైతే మార్పులు చేర్పులు చేసి ప్రచురిస్తాం. ఒక్క కథ జీవితాంతం మీకో మంచి సాంగత్యం కాగలదు. గుర్తింపు మార్గం ఇవ్వగలదు. ప్రయత్నించండి.

మా చిరునామా: యువ కథ, సాక్షి ఫన్ డే, సాక్షి, రోడ్ నం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్ –34.
ఈమెయిల్: funday.kathalu@gmail.com





'మామ్'లా

కమలా హ్యారిస్

● తమిళనాడులోని కమలాహ్యారిస్ పూర్వీకుల గ్రామం తులసేంద్రపురంలో ఏర్పాటుచేసిన కమల పోస్టర్

'లెట్స్ విన్ దిస్' ఇది కమలా హ్యారిస్ నినాదం. గెలిచే శక్తి... గెలవగలిగే శక్తి తాను కాగలనని హ్యారిస్ ఆత్మవిశ్వాసం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష పదవి అభ్యర్థిగా జో బైడెన్ తప్పుకున్నాక ఇప్పుడు అమెరికాయే కాదు, ప్రపంచమంతా కమలా హ్యారిస్ వైపు చూస్తోంది. అధ్యక్ష పదవి అభ్యర్థిగా ఆమె ఎంపికైతే అది ఒక చరిత్రాత్మక సందర్భం... గెలిచి ప్రెసిడెంట్ అయితే చరిత్రే! భారతీయ మూలాల్లో తల్లి శక్తిస్వరూపిణి. స్త్రీ శక్తి స్వరూపిణి. స్త్రీగా... తల్లిగా... రాజకీయవేత్తగా కమలా హ్యారిస్ తన శక్తి ఏమిటో ఇప్పటికే నిరూపించారు. ఆమెలోని భారతీయత శక్తిని ఇస్తూనే ఉంటుంది.

కమలా హ్యారిస్ జీవితంలో ఆగస్టు 22కు ఒక ప్రత్యేకత ఉంది. 2014లో డగ్లస్ ఎంహాఫ్‌తో ఆమె పెళ్లి జరిగిన రోజు అది. సరిగ్గా పదేళ్ల తర్వాత అదే ఆగస్టు 22 మళ్లీ ఇప్పుడు ఆమె కోసం మరొక చిరస్మరణీయమైన సందర్భాన్ని సిద్ధం చేసి ఉంచినట్లే అనిపిస్తోంది! 2024 ఆగస్టు 19 నుంచి 22 వరకు షికాగోలో జరిగే పార్టీ సమావేశంలో చివరి రోజున డెమొక్రాట్‌లు తమ పార్టీ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకుంటారు. ఆ అభ్యర్థి కమలా హ్యారిస్ అయ్యుండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. మరో మూడు నెలలో అధ్యక్ష ఎన్నికలు ఉండగా పోటీ నుంచి విరమించుకున్న జో బైడెన్.. వెళుతూ వెళుతూ ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచి వెళ్లారు. ఆయన మాటపై కమలా హ్యారిస్‌కు మద్దతుగా ఉన్న డెమొక్రాట్‌లతో పాటుగా, పార్టీలోని ఆమె వ్యతిరేకులు కూడా.. ఇప్పుడు 'ట్రంప్‌ను ఓడించగల శక్తి'గా కమలా హ్యారిస్‌ను గుర్తించటం మొదలైంది.

■ ఎంతటి శక్తిమంతురాలు?

కమలా హ్యారిస్‌ను ఆమె పిల్లలు 'మామ్‌లా' (మామ్ + కమల) అని పిలుస్తారు. పిల్లలకు ఆమె సొంత తల్లి కాదు. విడిపోయిన డగ్లస్ ఎంహాఫ్ మొదటి భార్య పిల్లలు. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. కమలా డగ్లస్‌ల పెళ్లయ్యే నాటికి అబ్బాయికి 19 ఏళ్లు. అమ్మాయికి 15. ఆ వయసులోని పిల్లలు ఒక బయటి మనిషి తల్లిలా వచ్చి తమను చేరదీస్తానంటే వెళ్లి ఒడిలో వాలిపోతారా? కానీ అలాగే జరిగింది. వాళ్లను చక్కగా కలుపుకుపోయారు కమల. కొత్తమ్మ అమ్మ అయింది. ఫ్రెండ్ అయింది. అమ్మ, ఫ్రెండ్ కలిసి 'మామ్‌లా' అయింది. తల్లి స్థానంలో తల్లిగా వచ్చి, పిల్లల మనసు గెలుచుకోటానికి శక్తి కావాలి. అంతటి శక్తిమంతురాలు అయిన కమలకు అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా ఎంపికవటం, ఆపైన అధ్యక్షురాలిగా నెగ్గటం ఎంత పని?

"అమెరికాను సకల జాతులకు సహజీవన యోగ్యమైన దేశంగా మార్చటమే నా ధ్యేయం" అని కమల అనడం ట్రంప్ వంటి కరడు గట్టిన జాతీయవాదులకు నచ్చకపోవచ్చు. అయితే ఆ ఒక్క మాటతో ఆమె ఇప్పటికే అధికశాతం అమెరికన్‌లు, అమెరికాలోని ఇతర వలస దేశాల ప్రజల హృదయాలలో గొప్ప స్థానం సంపాదించారు.

> "అమెరికాను సకల జాతులకు సహజీవన యోగ్యమైన దేశంగా మార్చటమే నా ధ్యేయం" అని కమల అనడం ట్రంప్ వంటి కరడు గట్టిన జాతీయవాదులకు నచ్చకపోవచ్చు. అయితే ఆ ఒక్క మాటతో ఆమె ఇప్పటికే అధికశాతం అమెరికన్‌లు, అమెరికాలోని ఇతర వలస దేశాల ప్రజల హృదయాలలో గొప్ప స్థానం సంపాదించారు.

■ వ్యక్తిగా ఎలాంటి మనిషి?

నాలుగేళ్ల క్రితం బైడెన్ రన్నింగ్ మేట్‌గా (వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా) ఎంపికైనది మొదలు, అమెరికా తొలి మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యే వరకు కమలా హ్యారిస్‌ను గురించిన ఏ చిన్న విషయాన్నీ వదలకుండా ప్రపంచం ఆసక్తిగా తెలుసుకుంది. "నా బిడ్డ" అని భారతదేశం గర్వించింది. అంతేకాదు, తన ఉపాధ్యక్ష ప్రమాణ స్వీకారానికి ఆమె భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తలపిస్తూ చీరకట్టులో వేదికపైకి రావాలని ఇండియా కోరుకుంది. అమెరికా ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య పెద్ద పెద్ద డిబేట్‌లు జరిగిన విధంగానే.. "కమల చీర కట్టులో కనిపిస్తారా లేదా?" అని రెండు దేశాల్లోనూ డిబేట్‌లు జరిగాయి. చీర కట్టుకుంటే బావుంటుందన్న ఆకాంక్షలు వెల్లివిరిశాయి. ప్రమాణ స్వీకారానికి ఆమె చీర ధరిస్తే.. సంస్కృతుల సమైక్య భావనకు తనొక సంకేతం ఇచ్చినట్లు అవుతుంది" అని, "కమలా హ్యారిస్ చీర కట్టుకుని ప్రమాణం స్వీకారంలో కనిపిస్తే అమెరికాలోని దక్షిణాసియా సంతతి వారికి ఆమె తమ మనిషి అనే ఒక నమ్మకం ఏర్పడుతుంది.." అని, "కమలా హ్యారిస్ కనుక చీరలో ప్రమాణ స్వీకారం చేస్తే అదొక దౌత్యపరమైన స్నేహానికి చిహ్నంగా నిలుస్తుంది" అని... ఇలా అనేక అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

చివరికేం జరిగింది? అచ్చమైన అమెరికన్ పౌరురాలిగా ప్యాంట్ సూట్, బౌ బ్లవుజ్‌లో వచ్చి ప్రమాణం స్వీకారం చేశారు కమలా హ్యారిస్. ఇది దేనికి సంకేతం? కొత్తగా తను సంస్కృతుల సమైక్య భావనను, దౌత్యపరమైన స్నేహభావనను ప్రదర్శించనవసరం లేదని ఆమె బలంగా నమ్మారని. ఆమె వ్యక్తిత్వం ఎలాంటిదో వెల్లడించే ఒక చిన్న సందర్భం ఇది.

■ "వాళ్లిద్దరు కూడా నాకు అమ్మలే"

తన తల్లి శ్యామలా గోపాలన్ కాకుండా, మరో ఇద్దరు మహిళలు కూడా తనకు తల్లి వంటి వారని.. ఆనాటి ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు కమల! ఆ ఇద్దరిలో ఒకరు: చిన్నప్పుడు తమ పక్కింట్లో ఉండే శ్రీమతి షెల్టన్. ఇంకొకరు : ఒకటో తరగతి టీచర్ శ్రీమతి విల్సన్. "సాయంత్రం అమ్మ డ్యూటీ నుండి రావటం లేటయితే నేను, చెల్లి మాయా నేరుగా షెల్టన్ వాళ్ల ఇంట్లోకి వెళ్లిపోయేవాళ్లం. అక్కడే తిని, అమ్మ వచ్చి మమ్మల్ని పిలుచుకెళ్లే వరకు అక్కడే పడుకునేవాళ్లం. షెల్టన్ మమ్మల్నెంతో ఆదరణగా చూశారు.." అని కమల గుర్తు చేసుకున్నారు. ఇక శ్రీమతి విల్సన్ బర్కిలీలోని థౌజండ్ ఓక్స్ ఎలిమెంటరీ స్కూల్లో ఒకటో తరగతి టీచర్. "బాల్యంలో నాలో ఆశల్ని, ధైర్యాన్ని నింపింది ఆవిడే. నేను పై చదువులకు వెళ్లి, 'లా' డిప్లొమా చేసి, ఆ సర్టిఫికెట్‌ను అందుకునేందుకు స్టేజ్ మీదకు వెళ్లినప్పుడు కూడా విల్సన్ నా కోసం వచ్చి ఆడియెన్స్‌లో కూర్చొని ఉండటం దూరాన్నుంచి కనిపించింది! నన్ను సంతోష పెట్టటం కోసం ఆమె అలా చేయటం నాకెంతో ఆనందాన్నిచ్చింది" అని విల్సన్ గురించి రాశారు కమల.

అమెరికా తొలి ఉపాధ్యక్షురాలు అయ్యాక కూడా ఈ నాలుగేళ్లలో ఎక్కడా దర్పాన్ని ప్రదర్శించని కమల తన జీవితంలోని అమూల్యమైన వ్యక్తులను, ప్రదేశాలను, మరచిపోలేని సందర్భాలను తరచు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటారు. రేపు ఒకవేళ ఆమె అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైతే కనుక ఆమె షేర్ చేసే తొలి పోస్టు ఏదైనా గాని, తప్పకుండా ఆమె కన్నా కూడా అది అగ్రరాజ్యం అమెరికాకే చరిత్రాత్మక సందర్భం అవుతుంది.

అన్నం మహిత... చిన్నప్పుడు పెన్సిల్‌తో బొమ్మలు వేసింది. ఇప్పుడు పెన్సిల్ మీద గ్రంథాలు చెక్కుతోంది. మహనీయుల జీవిత చరిత్రలను పెన్సిల్ మీద రాస్తోంది. ఇప్పటి వరకు ఆమె రాసిన జీవిత చరిత్రలు, మహాగ్రంథాల జాబితా ఆమె వయసుకంటే పెద్దదిగా ఉంది. ఆంధ్రప్రదేశ్, బాపట్ల జిల్లా, కారంచేడు మండలం, స్వర్ణ గ్రామానికి చెందిన మహిత... తాను సాధన చేస్తున్న మైక్రో ఆర్ట్ గురించి 'సాక్షి ఫ్యామిలీ'తో పంచుకున్న వివరాలివి.



మహిత సూక్ష్మ లిఖిత





మహిత

"చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం ఇష్టం. ఇంటర్ పూర్తయి డిగ్రీలో చేరినప్పుడు కోవిడ్ లాక్‌డౌన్ వచ్చింది. ఆ ఖాళీ టైమ్‌లో బియ్యం మీద వినాయకుడు, జాతీయ పతకాలను చెక్కాను. ఆ తర్వాత మినుములు, పెసలు, బొబ్బర్లు మీద బొమ్మలు చెక్కాను. వాటిని చూసి మా నాన్న మహాభారతం ట్రై చెయ్యి, నీ సాధనకు గుర్తింపు వస్తుందన్నారు. సంస్కృత భాషలో మహాభారతంలోని 700 శ్లోకాలను 810 పెన్సిళ్ల మీద చెక్కాను. మొత్తం అక్షరాలు 67, 230, పదాల్లో చెప్పాలంటే 7,238. కళను సాధన చేయడంలో ఉన్న గొప్పతనం ఏమిటంటే... ఒకటి పూర్తయిన తర్వాత మరొకటి చేయాలనిపిస్తుంది. మహాభారతం తర్వాత వాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్ర, పుట్టపర్తి సాయిబాబా చరిత్ర, అనేకమంది ప్రముఖుల జీవితచరిత్రలను పెన్సిల్ ముక్కు మీద రాశాను. జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అమరజీవి పొట్టి శ్రీరాములు, నెల్సన్‌మండేలా, ప్రధాని నరేంద్రమోదీ, స్వర్గీయ ఎన్‌టీఆర్, వైఎస్సార్, అంబేద్కర్, కరుణానిధి, కేసీఆర్, నరేంద్రమోదీ, ఎంఎస్‌రెడ్డితోపాటు ఏఎన్‌ఆర్ ఇంకా అనేక మంది సినీ ప్రముఖుల జీవితచరిత్రలను చెక్కాను. మన జాతీయగీతాన్ని పాస్తా మీద చెక్కాను. కర్ణాటక రాష్ట్ర అవతరణ చరిత్రను కూడా రాశాను. నా కళకు గుర్తింపుగా చీరాల రోటరీ క్లబ్‌తో మొదలు ఉత్తరప్రదేశ్ ఆర్ట్ కాంపిటీషన్ వరకు అనేక పురస్కారాలందుకున్నాను. ఈ కళాసాధనను కొనసాగిస్తాను" అన్నారు అన్నం మహిత. సూక్ష్మ కళ ఆసక్తి కొద్దీ సాధన చేసే వాళ్లతోనే మనుగడ సాగిస్తోంది. ప్రభుత్వం నుంచి శిక్షణ అవకాశం లభిస్తే ఎక్కువ మంది కళాకారులు తయారవుతారని ఈ సందర్భంగా మహిత తన అభిలాషను వ్యక్తం చేశారు.

– వంగూరి సురేశ్‌కుమార్, సాక్షి, బాపట్ల జిల్లా

కృత్రిమ గర్భధారణ...



హార్ట్‌ఫీషియల్‌గా అమ్మానాన్నలుగా...

ఇటీవల మనదేశం వంధ్యత్వ సంక్షోభం (ఇన్‌ఫెర్టిలిటీ) దిశగా వెళుతోంది. ఈ సమస్య తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే... ప్రతి ఆరు వివాహిత జంటల్లో ఒకరు సంతానలేమితో బాధపడుతున్నారు. సంతానలేమి అన్నది కేవలం పిల్లలు కలగకపోవడం మాత్రమే కాదు... ఇది మరిన్ని సంక్షోభాలకు... అంటే ఉదాహరణకు జనాభాలో యువత శాతం తగ్గిపోవడం, వృద్ధుల సంఖ్య పెరగడం వంటి అనర్థాలకు దారి తీయవచ్చు. దీనివల్ల దేశ ఆర్థిక సంపద తగ్గడంతో పాటు అనేక విధాలా నష్టం జరుగుతుంది. ఈ నెల 25న ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) డే సందర్భంగా సంతానలేమి సమస్యను ఎదుర్కొంటున్న దంపతులకు కృత్రిమ గర్భధారణకు సంబంధించిన కొన్ని అంశాలపై అవగాహన కోసం కొన్ని ప్రశ్నలకు ఇన్‌ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ కట్టా శిల్ప సమాధానాలు.



● ఇటీవల మనదేశంలో సంతానలేమి సమస్యతో బాధపడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరగడానికి కారణాలేమిటి?

జ: దీనికి రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది సామాజికం, రెండు ఆరోగ్యపరమైన కారణాలు. సామాజిక అంశాల విషయానికి వస్తే... ఇటీవల యువత పై చదువులు, మంచి ఉద్యోగాలంటూ కెరియర్ కోసం ఎక్కువ కాలం కేటాయించడం, పెద్ద పెద్ద లక్ష్యాలను ఏర్పరచుకోవడం, వాటిని నెరవేర్చుకోవడం కోసం ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, ఉద్యోగాల్లో ఒత్తిడి, ఆహార అలవాట్లు, క్రమంగా లేని పనివేళలు, శారీరక శ్రమ ఎక్కువగా లేకపోవడం, అధిక బరువు, మద్యపానం, పొగతాగడం, డ్రగ్స్ వంటి అనారోగ్యకర అలవాట్లు, వ్యసనాలు వంటివి సంతానలేమికి దారితీస్తున్నాయి. ఇవన్నీ సామాజిక సమస్యలు.

ఇక ఆరోగ్య సమస్యల విషయానికి వస్తే... మహిళల్లో కనిపించే హార్మోన్లలో అసమతౌల్యత, ఇన్ఫెక్షన్లు, మానసిక ఒత్తిడులు వంటివి సంతానలేమికి కారణమవుతున్నాయి. ఉదాహరణకు అండం తయారీలో, ఫలదీకరణలో, పిండం ఇంప్లాంటేషన్‌లో ఇబ్బందుల వంటివి మహిళలకు ప్రత్యేకంగా వచ్చే సమస్యల్లో కొన్ని. ఇక మగవారిలోనైతే... శుక్రకణాల సంఖ్య, కదలిక, నాణ్యత తగ్గడం సంతానం కలగడానికి అవరోధంగా నిలుస్తున్నాయి.

● సాధారణంగా దంపతుల్లో సంతానలేమి ఉంటే ప్రధానంగా మహిళనే నిందిస్తారు. ఇదెంతవరకు సమంజసం?

జ: ఇది మళ్లీ మరో సామాజిక సమస్య. వాస్తవానికి గర్భం రాకపోతే అందులో తప్పెవరిదీ ఉండదు. కానీ మన సమాజంలో మహిళ గర్భం దాల్చకపోతే, ఆమెనే తప్పుబడుతుంటారు. నిజానికి గర్భధారణ జరగకపోవడానికి లోపాలు 40% మహిళల్లో ఉంటే, మరో 40% శాతం పురుషుల్లోనూ ఉండవచ్చు. ఇద్దరిలోనూ లోపాలున్న కేసులు మరో 10% మందిలో ఉంటాయి. అయితే ఎంతకూ కారణాలు తెలియని కేసులు మరో 10% ఉంటాయి. అందుకే ఒక జంటకు సంతానం కలగకపోతే... ఎవరినెవరూ నిందించుకోకుండా, శాస్త్రీయపద్ధతుల్లో అవసరమైన పరీక్షలన్నీ క్రమంగా చేయించుకోవాలి.

● ఫలానా దంపతులకు సంతానలేమి అనే నిర్ధారణ ఎలా?

జవాబు: ఆరోగ్యంగా ఉన్న భార్యాభర్తలు వివాహం అయ్యాక ఎలాంటి కుటుంబనియంత్రణ పద్ధతులను పాటించకుండా, కలిసి ఉంటూ ఏడాది పాటు గర్భధారణ కోసం ప్రయత్నించినా గర్భం రాకపోతే అప్పుడు ఆ దంపతులకు సంతానలేమి సమస్య ఉండే అవకాశాలున్నాయని చెప్పవచ్చు. ఈ సమస్యను ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు.

రెండో రకమైన సంతానలేమి ఏమిటంటే... మొదటిసారి గర్భధారణ తర్వాత, రెండోసారి గర్భధారణ కోసం కోరుకున్నప్పుడు ఏడాది పాటు ప్రయత్నించినా గర్భం దాల్చకపోతే దాన్ని సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు.

● ఇప్పుడున్న సాంకేతిక పురోగతితో కృత్రిమ గర్భధారణ ఎలా?

జ: స్త్రీ, పురుషుల లోపాలు, వాటిని అధిగమించాల్సిన పద్ధతులన్నీ ప్రయత్నించాక కూడా గర్భం రాకపోతే అప్పుడు కొన్ని అత్యాధునిక పద్ధతుల్లో సంతాన సాఫల్యాన్ని సాధించవచ్చు. అవి...

ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ): అండం విడుదలలో లోపాలు,ఎండోమెట్రియాసిస్, పురుషుల వీర్యకణాల సంఖ్య, కదలికల్లో లోపాలు ఉన్నప్పుడు ఐయూఐ అనే పద్ధతి ద్వారా డాక్టర్లు వీర్యకణాలను నేరుగా యోని నుంచి సర్విక్స్ ద్వారా గర్భాశయంలోకి పంపుతారు.

ఐవీఎఫ్: స్త్రీ, పురుషులిద్దరిలోనూ ఫలదీకరణ సమస్యలు ఉన్నప్పుడు డాక్టర్లు ఐవీఎఫ్ అనే మార్గాన్ని సూచిస్తారు. ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ అనే మాటకు సంక్షిప్త రూపమే ఐవీఎఫ్. దీనికే 'టెస్ట్‌ట్యూబ్ బేబీ' అనే పేరు. ఇందులో తొలుత మహిళలో అండాలు బాగా పెరిగేందుకు మందులిస్తారు. వాటిల్లోంచి ఆరోగ్యకరమైన కొన్ని అండాలను సేకరించి, పురుషుడి శుక్రకణాలతో ప్రయోగశాలలోని 'టెస్ట్‌ట్యూబ్'లో ఫలదీకరణం చేస్తారు. ఈ ప్రక్రియలో ఒకటి కంటే ఎక్కువ పిండాలు వృద్ధి చెందుతాయి. (అందుకే టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రక్రియను అనుసరించిన చాలామందిలో ట్విన్స్ పుట్టడం సాధారణం.) ఇందులోని ఆరోగ్యకరమైన పిండాలను మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. రెండు వారాలకు నిర్ధారణ పరీక్షలూ, నాలుగు వారాల తర్వాత అల్ట్రాసౌండ్ పరీక్ష చేసి గర్భం నిలిచిందా లేదా నిర్ధారణ చేసుకుంటారు. ఒకవేళ గర్భం నిలవకపోతే కారణాలను విశ్లేషించి, మళ్లీ ప్లాన్ చేస్తారు.



డాక్టర్ కట్టా శిల్ప
కన్సల్టెంట్
ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్

ఐసీఎస్‌ఐ: ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఐసీఎస్‌ఐ) అనే ఈ ప్రక్రియ పురుషుల్లో సమస్య ఉన్నప్పుడు అనుసరిస్తారు. ఇది కూడా ఐవీఎఫ్ లాంటిదే. ఇందులో ఎంపిక చేసుకున్న శుక్రకణాన్ని నేరుగా అండంలోకి ప్రవేశపెడతారు. ఇందులోనూ మహిళల అండాల్లో లోపాలు ఉంటే మహిళా దాత నుంచి అండాన్ని సేకరించడం (ఐవీఎఫ్ విత్ డోనార్ ఎగ్), పురుషుని వీర్యకణాల్లో లోపాలుంటే దాత నుంచి సేకరించిన శుక్రకణంతో ఫలదీకరణ చేయడం (ఐవీఎఫ్ విత్ డోనార్ స్పెర్మ్), దంపతుల్లోని స్త్రీ, పురుషులిద్దరిలోనూ లోపాలు ఉంటే మరో మహిళ, మరో పురుషుడి నుంచి అండం, శుక్రకణాలు సేకరించి ఫలదీకరించి దంపతుల్లోని మహిళ గర్భంలోకి ప్రవేశపెట్టడం (ఐవీఎఫ్ విత్ డోనార్ ఎంబ్రియో) అనే పద్ధతుల్లో సంతాన సాఫల్యం కలిగించడానికి డాక్టర్లు ప్రయత్నిస్తారు.

– యాసీన్

హెల్దీ డైట్ | ఓట్స్-పొటాటో చీజ్ బాల్స్



కావలసినవి: ఉడికించి చిదిమిన బంగాళాదుంప – 2 కప్పులు; ఓట్స్ – కప్పు; చీజ్ తురుము – కప్పు; ఉల్లిపాయ తరుగు – పావు కప్పు; కొత్తిమీర – పావు కప్పు (తరగాలి); మిరప్పొడి– అర టీ స్పూన్; చాట్ మసాలా– అర టీ స్పూన్; ఉప్పు – రుచికి తగినంత; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● ఓట్స్‌ను బాణలిలో నూనె లేకుండా మీడియం మంట మీద ఒక మోస్తరుగా వేయించి, పొడి చేసి పక్కన పెట్టాలి ● ఒక పాత్రలో చిదిమిన బంగాళాదుంప, ఓట్స్ పొడి, చీజ్, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, చాట్ మసాలా, మిరప్పొడి, ఉప్పు వేసి కలపాలి. మొత్తం చపాతీ పిండిలా ముద్దగా తయారవుతుంది. ఈ ఈ మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత సైజులో బాల్స్ చేసుకోవాలి. ఒక్కో బాల్‌ని అరచేతిలో వేసి కొద్దిగా ఫొటోలో కనిపిస్తున్న ఆకారంలో వత్తాలి ● ఆపం పెనం లేదా కొంచెం గుంటగా ఉన్న పెనాన్ని వేడి చేసి కొద్దిగా నూనె రాసి ఒక్కో బాల్‌ని పెనం మీద అమర్చి మంటను మీడియంలో పెట్టాలి. ఒకవైపు దోరగా కాలిన తర్వాత మెల్లగా తిరగేసి రెండో వైపు కూడా కాలనివ్వాలి ● ఈ చీజ్ బాల్స్‌ని వేడిగా ఉన్నప్పుడే కెచప్ లేదా సాస్‌లతో వడ్డించాలి.

గమనిక: పిండిలో కలిపిన చీజ్ కరిగి బయటకు వస్తుంది. కాబట్టి నూనె ఎక్కువ వేయాల్సిన అవసరం ఉండదు. పెనం మాడుతున్నట్లనిపిస్తే చీజ్ బాల్స్ కాలుతున్నప్పుడు పై నుంచి కొద్ది చుక్కలు నూనె వేయవచ్చు.

పోషకాలు: పై కొలతలతో చేసిన చీజ్ బాల్స్‌లో 150 కేలరీలుంటాయి. కార్బొహైడ్రేట్‌లు 25 గ్రాములు, ప్రొటీన్‌లు– 6 గ్రాములు, ఫ్యాట్– 7 గ్రాములు, ఫైబర్ –3 గ్రాములు, క్యాల్షియం– 100 మిల్లీ గ్రాములు, ఐరన్– 1.5 మిల్లీ గ్రాములు



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్
వెల్‌నెస్ కోచ్

పెర్‌ఫ్యూమ్

మట్టి పరిమళం

వేడి, పొడి వాతావరణంలో ఒక్కసారిగా కురిసే చినుకులతో భూమి నుండి వెలువడే ఆహ్లాదకరమైన సువాసన మనసును సేదతీరుస్తుంది. ఇది మట్టి వెదజల్లే సహజ పరిమళం కావడంతో మన మనసుల్ని సంతోష సాగరంలో విహరింపజేస్తుంది. తొలకరి చినుకులు నేలను తాకినప్పుడు వచ్చే ఈ మట్టి సువాసనను ఆస్వాదించడంలో ఆడ–మగ అనే భేదమేమీ లేదు. అందుకే, ఈ సువాసనలు ఇప్పుడు అత్తరు రూపంలో అందరినీ అల్లుకు పోతున్నాయి.

ప్రకృతి నుండి ప్రేరణ పొంది, సురక్షితమైన పదార్థాలతో తయారైన మట్టి అత్తరు పరిమళాలకు వందల సంవత్సరాల నైపుణ్యం గల వారసత్వ కంపెనీలు కూడా ఉన్నాయి. చెమట వాసనను దూరం చేస్తూ విభిన్న శ్రేణి వ్యక్తులను ఆకర్షిస్తుంది. 'ది సెంట్ ఆఫ్ రైన్' లేదా 'పెట్రిచోర్ ఎసెన్షియల్ ఆయిల్'గా ప్రసిద్ధి చెందినవీ ఉన్నాయి. అన్ని దేశాలలోనూ ఈ తరహా సువాసనలను ప్రజలు ఇష్టపడుతున్నారు. ఆఫ్‌లైన్–ఆన్‌లైన్ మార్కెట్లో వందల రూపాయల నుంచి వేల రూపాయల వరకు ఈ ఎర్త్ సెంటెడ్ పెర్‌ఫ్యూమ్స్ అందుబాటులో ఉన్నాయి.

చెక్.. తప్పనిసరి: ● మనసును కదిలించే ఈ సువాసన గల అత్తరులో ఆల్కహాల్ వాడకం లేనివి ఎంచుకోవాలి ● అత్తరు లేదా పెర్‌ఫ్యూమ్ మన చర్మ తత్వానికి సరిపడుతుందా లేదా అని చెక్ చేసుకోవాలంటే ముందుగా దూది ఉండతో మణికట్టు, చెవి వెనక భాగాన కొద్దిగా అద్ది/స్ప్రే చేసి, 30 నిమిషాలు ఉండాలి. సరిపడితే రోజూ ఉపయోగించుకోవచ్చు.

ప్రయోజనాలు ఏంటంటే: ● మట్టి పరిమళం గల సహజ అత్తరు/పెర్‌ఫ్యూమ్‌ను వాడి మానసిక ఒత్తిడి నుంచి రిలాక్స్ కావచ్చు ● ఏకాగ్రతను మెరుగుపరుచుకోవాలనుకునేవారికి ఉత్తమమైన సాధానాలలో మట్టి పరిమళం ఒకటి ● లగ్జరీ హోటళ్లు, యోగా అండ్ ఆయుర్వేద రిసార్ట్‌లలో, అరోమా థెరపీ రిట్రీట్‌లలో సుగంధ లేపనాల తయారీలోనూ ఈ మట్టి అత్తరును ఉపయోగిస్తుంటారు ● మట్టి పరిమళం స్ప్రే చేసుకొని వెళితే మీ చుట్టూ ఉన్నవారు బయట వర్షం పడుతుందేమో అన్న అనుభూతికి లోనుకాకుండా ఉండలేరు.





పోరాడి ఓడిన సుమిత్ నగాల్

జెనరాలి ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం ముగిసింది. ఆస్ట్రియాలో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 80వ ర్యాంకర్ సుమిత్ 5–7, 5–7తో ప్రపంచ 45వ ర్యాంకర్ పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. సుమిత్‌కు 10,165 యూరోల (రూ. 9 లక్షల 24 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 25 పాయింట్లు లభించాయి.



క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ

క్రొయేషియా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఉమగ్ నగరంలో బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 6–2తో కొవాలిక్ (స్లొవేకియా)–కారాబెల్లి (అర్జెంటీనా) జంటపై గెలిచింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్–అర్జున్ ఖడే (భారత్) జోడీ 2–6, 2–6తో గిడో ఆండ్రెజి (అర్జెంటీనా)–వరేలా (మెక్సికో) ద్వయం చేతిలో ఓడిపోయింది.

విజయోస్తు!

గత మూడేళ్లుగా భారత క్రీడాకారులు ఏ లక్ష్యంతోనైతే సాధన చేస్తున్నారో... ఆ ప్రయత్నాలను పతకాల రూపంలో మార్చేందుకు సమయం ఆసన్నమైంది. విశ్వ క్రీడా సంరంభం పారిస్ ఒలింపిక్స్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం జరిగే ప్రారంభోత్సవం తర్వాత పారిస్ ఒలింపిక్స్ క్రీడలు అధికారికంగా మొదలవుతాయి. అయితే ఫుట్‌బాల్, రగ్బీ సెవెన్స్ పోటీలు మాత్రం బుధవారమే ఆరంభమయ్యాయి. భారత్ విషయానికొస్తే నేడు ఆర్చరీలో పురుషుల, మహిళల వ్యక్తిగత రికర్వ్ ర్యాంకింగ్ రౌండ్‌తో మనోళ్ల సమరానికి తెర లేస్తుంది. ర్యాంకింగ్ రౌండ్‌లో ఆయా ఆర్చర్లు సాధించిన పాయింట్లు, ర్యాంక్ ఆధారంగానే ఆర్చరీ ప్రధాన పోటీల 'డ్రా'ను ఖరారు చేస్తారు. కరోనా మహమ్మారి కారణంగా 2020 టోక్యో ఒలింపిక్స్ ఒక ఏడాది వాయిదా పడి 2021లో జరగ్గా... భారత్ నుంచి 18 క్రీడాంశాల్లో 127 మంది బరిలోకి దిగారు. 1 స్వర్ణం, 2 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 7 పతకాలు నెగ్గి తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత్ పతకాల పట్టికలో 48వ ర్యాంక్‌లో నిలిచింది. మూడేళ్లు ముగిశాయి. మళ్లీ పారిస్ వేదికగా ఒలింపిక్స్ వచ్చాయి. ఈసారి భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో మొత్తం 117 మంది పోటీపడుతున్నారు. అథ్లెటిక్స్‌లో అత్యధికంగా 29 మంది అర్హత సాధించగా... షూటింగ్‌లో 21 మంది తమ గురికి పదును పెట్టనున్నారు. ఒలింపిక్స్ సన్నాహాల కోసం కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులపై ఏకంగా రూ. 470 కోట్లు ఖర్చు చేసింది. ఈసారి భారత క్రీడాకారులు 'టోక్యో' ప్రదర్శను అధిగమించి 'పారిస్'ను చిరస్మరణీయంగా చేసుకోవాలని, పతకాల పంట పండించి స్వదేశానికి తిరిగి రావాలని ఆశిస్తూ... ఆల్ ద బెస్ట్!

PARIS 2024
రేపటి నుంచి

- పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ బలగం సిద్ధం
- 16 క్రీడాంశాల్లో 117 మంది క్రీడాకారులు పోటీ
- కనీసం 10 పతకాలు లక్ష్యంగా బరిలోకి
- నేడు ఆర్చరీలో ర్యాంకింగ్ రౌండ్‌తో మొదలు


పారిస్ ఒలింపిక్స్ క్రీడా గ్రామంలో భారత బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్ ప్లేయర్లు

అథ్లెటిక్స్ (29)


నీరజ్

పురుషుల విభాగం (18): నీరజ్ చోప్రా (జావెలిన్ త్రో), అవినాశ్ సాబ్లే (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్), కిశోర్ జేనా (జావెలిన్ త్రో), అక్షదీప్ సింగ్ (20 కిలోమీటర్ల రేస్ వాక్), పరమ్‌జీత్ సింగ్ బిష్త్ (20 కిలోమీటర్ల రేస్ వాక్), తజిందర్ పాల్ (షాట్‌పుట్), అబ్దుల్లా అబూబాకర్ (ట్రిపుల్ జంప్), ప్రవీణ్ చిత్రావెల్ (ట్రిపుల్ జంప్), అజ్మల్ (4x400 మీటర్ల రిలే), అనస్ (4x400 మీటర్ల రిలే), అమోజ్ జేకబ్ (4x400 మీటర్ల రిలే), సంతోష్ తమిళరాసన్ (4x400 మీటర్ల రిలే), రాజేశ్ రమేశ్ (4x400 మీటర్ల రిలే), మిజో చాకో కురియన్ (4x400 మీటర్ల రిలే), జెస్విన్ ఆల్డ్రిన్ (లాంగ్‌జంప్), సర్వేశ్ కుషారే (హైజంప్), సూరజ్ పన్వర్ (మారథాన్ మిక్స్‌డ్ రేస్ వాక్), వికాశ్ సింగ్ (20 కిలోమీటర్ల రేస్ వాక్).

మహిళల విభాగం (11): జ్యోతి యర్రాజీ (100 మీటర్ల హర్డిల్స్; ఆంధ్రప్రదేశ్), పారుల్ చౌధరీ (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్, 5000 మీటర్లు), అన్నురాణి (జావెలిన్ త్రో), విత్యా రాంరాజ్ (4x400 మీటర్ల రిలే), పూవమ్మ రాజు (4x400 మీటర్ల రిలే), దండి జ్యోతిక శ్రీ (4x400 మీటర్ల రిలే; ఆంధ్రప్రదేశ్), శుభా వెంకటేశన్ (4x400 మీటర్ల రిలే), కిరణ్ పహల్ (400 మీటర్లు, 4x400 మీటర్ల రిలే), ప్రాచి (4x400 మీటర్ల రిలే), అంకిత ధ్యాని (5000 మీటర్లు), ప్రియాంక గోస్వామి (20 కిలోమీటర్ల రేస్ వాక్, మిక్స్‌డ్ మారథాన్).

షెడ్యూల్: ఆగస్టు 1 నుంచి 11 వరకు

షూటింగ్ (21)


మనూ భాకర్

పురుషుల విభాగం (10): సరబ్‌జోత్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్), అర్జున్ సింగ్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్), అర్జున్ బబూటా (10 మీటర్ల ఎయిర్ రైఫిల్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్), సందీప్ సింగ్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్), ఐశ్వర్య ప్రతాప్ తోమర్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), స్వప్నిల్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), విజయ్‌వీర్ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్), అనంత్ జీత్ (స్కీట్, స్కీట్ మిక్స్‌డ్ టీమ్), పృథ్వీరాజ్ (ట్రాప్). మహిళల విభాగం (11): మనూ భాకర్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్), ఇలవేనిల్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్), సిఫ్ట్ కౌర్ సమ్రా (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), అంజుమ్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), రిథమ్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్), ఇషా సింగ్ (25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్; తెలంగాణ), రమిత (10 మీటర్ల ఎయిర్ రైఫిల్, మిక్స్‌డ్ టీమ్), శ్రేయసి సింగ్ (ట్రాప్), రైజా ధిల్లాన్ (స్కీట్), రాజేశ్వరి (ట్రాప్), మహేశ్వరి (స్కీట్, స్కీట్ మిక్స్‌డ్ టీమ్).

షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 5 వరకు

హాకీ (16)

పురుషుల విభాగం (16): శ్రీజేశ్, హర్మన్‌ప్రీత్, మన్‌ప్రీత్, హార్దిక్, జర్మన్‌ప్రీత్, పంపేర్, మన్‌దీప్, గుర్జంత్, సుఖ్‌జీత్, కృష్ణ బహదూర్, జుగ్‌రాజ్, అమిత్ రోహిదాస్, సుమిత్, వివేక్ ప్రసాద్, అభిషేక్, లలిత్, రాజ్‌కుమార్, సంజయ్, నీలకంఠ శర్మ.

షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 9 వరకు

టేబుల్ టెన్నిస్ (8)

మహిళల విభాగం (4): ఆకుల శ్రీజ (సింగిల్స్, టీమ్; తెలంగాణ), మనిక బత్రా (సింగిల్స్, టీమ్), అర్చన (టీమ్), ఐహిక (టీమ్). పురుషుల విభాగం (4): శరత్ కమల్ (సింగిల్స్, టీమ్), హర్మీత్ (సింగిల్స్, టీమ్), మానవ్ (టీమ్), సత్యన్ (టీమ్).

షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 10 వరకు

బ్యాడ్మింటన్ (7)

పురుషుల విభాగం (4): సాత్విక్ సాయిరాజ్ (డబుల్స్; ఆంధ్రప్రదేశ్), చిరాగ్ శెట్టి (డబుల్స్), ప్రణయ్ (సింగిల్స్), లక్ష్య సేన్ (సింగిల్స్). మహిళల విభాగం (3): పీవీ సింధు (సింగిల్స్), అశ్విని పొన్నప్ప (డబుల్స్), తనీషా (డబుల్స్).

షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 5 వరకు

ఆర్చరీ (6)

పురుషుల విభాగం (3): బొమ్మదేవర ధీరజ్ (సింగిల్స్, టీమ్, మిక్స్‌డ్ టీమ్; ఆంధ్రప్రదేశ్), తరుణ్‌దీప్ (టీమ్), ప్రవీణ్ (టీమ్). మహిళల విభాగం (3): దీపిక (టీమ్), అంకిత (టీమ్), భజన్ (సింగిల్స్, టీమ్, మిక్స్‌డ్ టీమ్).

షెడ్యూల్: జూలై 28 నుంచి ఆగస్టు 4 వరకు

బాక్సింగ్ (6)

పురుషుల విభాగం (2): నిశాంత్ దేవ్ (71 కేజీలు), అమిత్ (51 కేజీలు). మహిళల విభాగం (4): నిఖత్ జరీన్ (50 కేజీలు; తెలంగాణ), లవ్లీనా (75 కేజీలు), ప్రీతి (54 కేజీలు), జైస్మిన్ (57 కేజీలు).

షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 10 వరకు

రెజ్లింగ్ (6)

పురుషుల విభాగం (1): అమన్ (57 కేజీలు). మహిళల విభాగం (5): వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అంతిమ్ (53 కేజీలు), అన్షు (57 కేజీలు), నిషా (68 కేజీలు), రీతిక హుడా (76 కేజీలు).

షెడ్యూల్: ఆగస్టు 5 నుంచి 11 వరకు

స్విమ్మింగ్ (2)

పురుషుల విభాగం (1): శ్రీహరి నటరాజ్ (100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్). మహిళల విభాగం (1): ధీనిధి (200 మీటర్ల ఫ్రీస్టయిల్)

షెడ్యూల్: జూలై 28 నుంచి 30 వరకు

సెయిలింగ్ (2)

పురుషుల విభాగం (1): విష్ణు శరవణన్ (ఐఎల్‌సీఏ-7). మహిళల విభాగం (1): నేత్రా కుమనన్ (ఐఎల్‌సీఏ-6).

షెడ్యూల్: జూలై 28 నుంచి ఆగస్టు 8 వరకు

వెయిట్‌లిఫ్టింగ్ (1)

మహిళల విభాగం (1): మీరాబాయి చాను (49 కేజీలు). షెడ్యూల్: ఆగస్టు 7

ఈక్వెస్ట్రియన్ (1)

పురుషుల విభాగం (1): అనూశ్ అగర్వల్లా (డ్రెసాజ్). షెడ్యూల్: ఆగస్టు 4

జూడో (1)

మహిళల విభాగం (1): తులికా మాన్ (ప్లస్ 78 కేజీలు). షెడ్యూల్: ఆగస్టు 2

రోయింగ్ (1)

పురుషుల విభాగం (1): బల్‌రాజ్ (సింగిల్ స్కల్స్). షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు

టెన్నిస్ (3)

పురుషుల విభాగం (3): రోహన్ బోపన్న (డబుల్స్), శ్రీరామ్ బాలాజీ (డబుల్స్), సుమిత్ నగాల్ (సింగిల్స్)

షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 4 వరకు

గోల్ఫ్ (4)

పురుషుల విభాగం (2): శుభాంకర్, గగన్‌జీత్. మహిళల విభాగం (2): అదితి, దీక్షా.

షెడ్యూల్: ఆగస్టు 1 నుంచి 10 వరకు



ఐఓసీ సభ్యురాలిగా నీతా అంబానీ

పారిస్: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యురాలిగా రిలయెన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ మళ్లీ ఎన్నికయ్యారు. బుధవారం పారిస్‌లో జరిగిన ఐఓసీ 142వ సెషన్‌లో నీతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2016 రియో ఒలింపిక్స్ సందర్భంగా తొలిసారి నీతాకు ఐఓసీలో సభ్యత్వం లభించింది.




అర్జెంటీనాకు షాక్

సెయింట్ ఎటిన్ (ఫ్రాన్స్): పారిస్ ఒలింపిక్స్ అధికారికంగా శుక్రవారం మొదలు కావాల్సినా... ఫుట్‌బాల్, రగ్బీ సెవెన్స్ క్రీడాంశాల్లో బుధవారం పోటీలు ప్రారంభమయ్యాయి. పురుషుల ఫుట్‌బాల్ ఈవెంట్ సంచలనంతో ఆరంభమైంది. రెండుసార్లు స్వర్ణ పతక విజేత అర్జెంటీనా తొలి లీగ్ మ్యాచ్‌లో 1–2తో మొరాకో చేతిలో ఓడిపోయింది. ఇంజ్యూరీ టైమ్‌లో అర్జెంటీనా చేసిన గోల్‌ను ముందుగా రిఫరీ అనుమతించడంతో స్కోరు 2–2తో సమమైంది. అయితే రిఫరీ నిర్ణయంతో ఆగ్రహించిన అభిమానులు మైదానంలోకి దూసుకొచ్చారు. వాటర్ బాటిళ్లను మైదానంలోకి విసిరేశారు. దాంతో రెండు గంటలపాటు ఆటకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితి అదుపులోకి వచ్చాక ఆటను కొనసాగించారు. అర్జెంటీనా రెండో గోల్‌ను టీవీ రీప్లేలో పరిశీలించి ఆఫ్ సైడ్‌గా పరిగణించి గోల్ ఇవ్వలేదు. దాంతో మొరాకో 2–1తో గెలిచింది.

సెమీఫైనల్లో బంగ్లాదేశ్, శ్రీలంక

దంబుల్లా: ఆసియా కప్ మహిళల టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో గ్రూప్ 'బి' నుంచి బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. బుధవారం జరిగిన చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్ 114 పరుగుల తేడాతో మలేసియా జట్టును ఓడించగా... ఆతిథ్య శ్రీలంక జట్టు 10 వికెట్ల తేడాతో థాయ్‌లాండ్ జట్టుపై గెలిచింది. మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 2 వికెట్లకు 191 పరుగులు చేసింది. ముర్షిదా ఖాతూన్ (59 బంతుల్లో 80; 10 ఫోర్లు, 1 సిక్స్), నిగర్ సుల్తానా (37 బంతుల్లో 62 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. అనంతరం మలేసియా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 77 పరుగులు సాధించింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌తో భారత్; పాకిస్తాన్‌తో శ్రీలంక తలపడతాయి.

సినిమా


● చిరంజీవి

ఇంద్ర మళ్లీ వస్తున్నాడు

చిరంజీవి కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'ఇంద్ర' (2002). ఈ చిత్రంలో ఆర్తీ అగర్వాల్, సోనాలీ బింద్రే హీరోయిన్లుగా నటించారు. బి. గోపాల్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ యాక్షన్ డ్రామా విశేష ప్రేక్షకాదరణ దక్కించుకుంది. ఈ చిత్రంలో ఇంద్ర సేనారెడ్డి అలియాస్ శంకర్ నారాయణ పాత్రలో చిరంజీవి నటించారు. ఈ సినిమా రీ–రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. వైజయంతీ మూవీస్ 50 గోల్డెన్ ఇయర్స్‌ని సెలబ్రేట్ చేస్తూ, చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న 'ఇంద్ర' చిత్రాన్ని మళ్లీ విడుదల చేస్తోంది.


● తమన్నా

ఆజ్ కీ రాత్...

అమేజింగ్ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌తో స్పెషల్ సాంగ్‌ను ఇంకా స్పెషల్‌గా చేయాలంటే కొందరు హీరోయిన్స్‌కే సాధ్యమవుతుందంటారు ఆడియన్స్. ఈ జాబితాలో తమన్నా తప్పక ఉంటారు. ఇప్పటికే ఈ బ్యూటీ దాదాపు పది స్పెషల్ సాంగ్స్‌లో డ్యాన్స్‌లో అదరగొట్టారు. ఇప్పుడు ఈ ప్రస్తావన ఎందుకంటే... హిందీ చిత్రం 'స్త్రీ 2'లో తమన్నా చేసిన స్పెషల్ సాంగ్ 'ఆజ్ కీ రాత్' విడుదలైంది. ఈ పాటలో తమన్నా అదిరిపోయే స్టెప్పులు వేశారు. శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు, పంకజ్ త్రిపాఠి, అభిషేక్ బెనర్జీ, అపర్‌శక్తి ఖురానా లీడ్ రోల్స్‌లో అమర్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్త్రీ 2'. ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'స్త్రీ 2'లోని 'ఆజ్ కీ రాత్' సాంగ్ వీడియోను రిలీజ్ చేశారు. హిట్ ఫిల్మ్ 'స్త్రీ'కి సీక్వెల్‌గా 'స్త్రీ 2' రూపొందింది.


● సంజయ్ దత్

డబ్బింగ్ డన్

బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తొలిసారి తెలుగులో పూర్తి స్థాయి పాత్ర పోషించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ చిత్రంలో తన పాత్రకు సంబంధించిన హిందీ వెర్షన్ డబ్బింగ్‌ని పూర్తి చేశారు సంజయ్ దత్. హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019)కి సీక్వెల్‌గా ఇదే కాంబినేషన్‌లో 'డబుల్ ఇస్మార్ట్' రూపొందింది. ఈ చిత్రంలో సంజయ్ దత్ విలన్‌గా చేశారు. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 15న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని ఐదు భాషల్లో విడుదల చేస్తున్నారు.

ఇమ్రాన్ శాస్త్రి పేరులా పాటలు వైవిధ్యంగా ఉన్నాయి

– చంద్రబోస్

వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు రెండో వారంలో విడుదల కానుంది. ఈ సినిమా ఆడియో రిలీజ్ ఈవెంట్‌లో పాటల రచయితలు చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, సుద్దాల అశోక్ తేజ, అనంత శ్రీరామ్, కాసర్ల శ్యామ్ అతిథులుగా పాల్గొన్నారు. హరినాథ్ పులి మాట్లాడుతూ– ''మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబించేలా 'రేవు' తీశాను'' అన్నారు. ''రేవు' చిత్రానికి పాటలు రాసిన ఇమ్రాన్ శాస్త్రి పేరు ఎంత వైవిధ్యంగా ఉందో అతను రాసిన పాటలు అంతే వైవిధ్యంగా ఉన్నాయి'' అన్నారు చంద్రబోస్. ''తెలుగు సంగీత దర్శకులకు అవకాశాలు ఇవ్వాలి. అప్పుడే మనవారి ప్రతిభ తెలుస్తుంది'' అన్నారు రామజోగయ్య శాస్త్రి. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ– ''ఈ ఆడియో ఫంక్షన్‌కు గీత రచయితలను అతిథులుగా పిలవడం గొప్ప సంప్రదాయం. ఈ క్యాసెట్‌ను నేను దాచుకుంటాను. అప్పట్లో దాసరి నారాయణరావు, రాఘవేంద్రరావుగార్ల సినిమాలకు పని చేసి, ఆ క్యాసెట్ అందుకున్నప్పుడు కలిగిన సంతోషం ఇప్పుడు కలుగుతోంది'' అన్నారు. ''నాలాగే తొలి సినిమాకే అన్ని పాటలు రాసే అవకాశాన్ని ఇమ్రాన్ అందుకోవడం సంతోషం'' అన్నారు అనంత శ్రీరామ్. ''ఈ సినిమా రచయిత ఇమ్రాన్ శాస్త్రి, మ్యూజిక్ చేసిన జాన్‌లలో అన్ని మతాలు ఉన్నాయి. అందుకే అన్ని వర్గాల వారికీ నచ్చేలా పాటలు రూపొందించారు'' అన్నారు కాసర్ల శ్యామ్. ''ప్రేక్షకుల ఆశీస్సులు మా సినిమాకు ఉండాలని కోరుకుంటున్నా'' అన్నారు ఇమ్రాన్ శాస్త్రి. ''రేవు' మత్స్యకారుల జీవితాలను తెరపై చూపిస్తుంది'' అన్నారు చిత్ర నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు పాల్గొన్నారు.


● శ్యామ్, అనంత శ్రీరామ్, సుద్దాల, చంద్రబోస్, రామజోగయ్య

ఈ మ్యూజిక్ కాన్సెప్ట్ నచ్చింది

– మారుతి

''జామ్ జంక్షన్' మ్యూజిక్ కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. ఎందరో ప్రతిభావంతుల్ని ఒకే వేదికపై చూడబోతున్నాం. దీన్ని తర్వాతి స్థాయికి తీసుకెళ్లబోతున్నాం'' అన్నారు దర్శకుడు మారుతి. హైదరాబాద్‌లోని హైటెక్స్ గ్రౌండ్స్‌లో సెప్టెంబర్ 6న 'జామ్ జంక్షన్' పేరుతో మ్యూజికల్ ఈవెంట్ షో జరగనుంది. మారుతి సమర్పణలో జరగనున్న ఈ ఈవెంట్ కర్టెన్‌రైజర్ ప్రెస్‌మీట్ హైదరాబాద్‌లో జరిగింది. మారుతి మాట్లాడుతూ– ''జామ్ జంక్షన్'లో బాగా మెప్పించిన వారికి క్యాష్ ప్రైజ్‌తో పాటు మా సినిమాల్లో ఓ చిన్న సినిమాకి మ్యూజిక్ చేసే చాన్స్ ఇప్పిస్తాం'' అన్నారు. సంగీతదర్శకుడు తమన్ మాట్లాడుతూ– ''నేను బ్యాండ్ నుంచే వచ్చాను. ఆ బ్యాండ్ ఎమోషన్ నాకు తెలుసు. ఇప్పటికీ రెగ్యులర్‌గా బ్యాండ్ మ్యూజిక్‌కి వెళ్తాను. హైదరాబాద్ ఇప్పుడు మంచి మ్యూజికల్ సిటీ. చక్కని బ్యాండ్స్, మ్యుజిషియన్స్ వస్తున్నారు. 'జామ్ జంక్షన్'లో భాగమవడం హ్యాపీగా ఉంది'' అన్నారు. శ్రీ ఈవెంట్స్ కంపెనీ ఫౌండర్, సీఈఓ శ్రీ, నిర్మాత ఎస్‌కేఎన్, బ్యాండ్ మెంబర్స్ పాల్గొన్నారు.


● తమన్, మారుతి

శ్రీమంతుడు కథతో పోల్చవద్దు

– రామ్ భీమన

రాజ్ తరుణ్, హాసినీ సుధీర్ జంటగా రామ్ భీమన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పురుషోత్తముడు'. డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్ భీమన మాట్లాడుతూ– ''మా సినిమాను 'శ్రీ మంతుడు' సినిమా కథతో పోల్చవద్దు. కోటీశ్వరుడైన యువకుడు ఇంటి నుంచి బయటకు రావడం అనే పాయింట్‌తో చాలా కథలు వచ్చాయి. కానీ కథను ఏం విధంగా చెప్పాం? ఎలా చెప్పాం అనేది ముఖ్యం'' అన్నారు. ''14 ఏళ్ల వయసులోనే ఆంధ్రా నుంచి ముంబై వెళ్లి, ఇప్పుడు బిజినెస్‌లో రాణిస్తున్నాను. తెలుగు సినిమా నిర్మించాలన్న నా ఆశ ఈ సినిమాతో నెరవేరింది. ఎక్కడా వల్గారిటీ ఉండదు. ఈ సినిమా కోసం చిత్రీకరించిన స్పెషల్ సాంగ్‌ను కూడా తీసేశాం. కుటుంబం అంతా కలిసి మా సినిమాను చూడొచ్చు'' అన్నారు చిత్రనిర్మాత రమేశ్.


● రామ్ భీమన, రమేశ్

ఒక్కరిలో మార్పు వచ్చినా చాలు

– అనసూయ



''పర్యావరణాన్ని మనం ఎలా కలుషితం చేస్తున్నామో... దానివల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో చూస్తున్నాం. ఈ నేపథ్యంతో మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రం 'సింబా'. ఈ సినిమా చూశాక కనీసం ఒక్కరిలో మార్పు వచ్చినా సంతోషమే'' అని అనసూయ అన్నారు. జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. డైరెక్టర్ సంపత్ నంది అందించిన 'సింబా' కథకు మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 9న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మురళీ మనోహర్ మాట్లాడుతూ– ''సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'సింబా'. ఇంతవరకు ఇండియన్ స్క్రీన్ పై ఇలాంటి కాన్సెప్ట్ మూవీ రాలేదు'' అన్నారు. ''ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ముందు తరాల గురించి ఆలోచించండి'' అన్నారు దాసరి రాజేందర్ రెడ్డి.

హీరోగా ఉంటూ ఆర్టిస్టుగా కొనసాగాలనుకుంటున్నాను

– సందీప్ కిషన్

''కెప్టెన్ మిల్లర్, రాయన్' సినిమాల్లో లీడ్ రోల్స్ చేశాను. అంత మాత్రాన నేను క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఉండాలనుకోవడం లేదు. హీరోగా ఉంటూ ఆర్టిస్టుగా కొనసాగాలనుకుంటున్నా. 'రాయన్' కథ విని షాక్ అయ్యాను. పైగా ధనుష్‌గారి 50వ సినిమా కాబట్టి గౌరవంతో కూడా 'రాయన్' అంగీకరించాను. అలాగే నెగటివ్ రోల్స్ కూడా చేయాలనుకోవడం లేదు. 'ప్రస్థానం' సినిమాలో కథలో భాగంగా అక్కను, బావను చంపాలని ఆ రోజంతా డిప్రెషన్‌లోనే ఉండిపోయాను. అలాంటి మనస్తత్వం నాది'' అన్నారు సందీప్ కిషన్. ధనుష్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'రాయన్'. ఇందులో సందీప్ కిషన్ ఓ లీడ్ రోల్ చేశారు. రేపు ఈ చిత్రం విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పి 'రాయన్' తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో సందీప్ కిషన్ చెప్పిన విశేషాలు.



- నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ 'రాయన్'. ఈ చిత్రంలో పెద్దన్న కార్తవ రాయన్‌గా ధనుష్ గారు, రెండోవాడు ముత్తువేల్ రాయన్‌గా నేను, మూడోవాడు మాణిక్య వీర రాయన్‌గా కాళిదాసు, వీరి చెల్లి దుర్గా రాయన్‌గా దుషార కనిపిస్తాం. ఈ 'రాయన్' ఫ్యామిలీలో ఏం జరిగింది? అనేది కథ. నిజానికి ధనుష్ గారు 'రాయన్' కథను వేరే దర్శకుడికి ఇచ్చి, ఇందులో నేను చేసిన పాత్రను ఆయన చేయాలనుకున్నారు. కానీ ఈ సినిమాకు ఆయనే దర్శకత్వం వహించాల్సి రావడం, ఆయన యాభయ్యవ చిత్రం కావడంతో ఆ రోల్ చేసే చాన్స్ నాకు వచ్చింది. 'రాయన్'లో నా కోసం రాసుకున్న పాత్రకు మిమ్మల్ని అడుగుతున్నానని ధనుష్‌గారు అన్న వెంటనే ఓకే చెప్పాను. నాది విలన్ పాత్ర అని చెప్పలేను కానీ ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు.
- నా కంటే పెద్దవారిని నేనెప్పుడూ గౌరవిస్తాను. అందుకే 'రాయన్' ఈవెంట్‌లో ధనుష్‌గారి కాళ్లను టచ్ చేశాను. తన కోసం రాసుకున్న పాత్రను ధనుష్‌గారు నాకు ఇచ్చారు. ఇప్పటివరకు నేను అందుకున్న అత్యధిక పారితోషికం 'రాయన్' నుంచే వచ్చింది.
- నేను తమిళ సినిమాలు చేస్తున్నది అక్కడ మార్కెట్ క్రియేట్ చేసుకోవాలని కాదు. ఇక్కడ దుల్కర్ సల్మాన్, ధనుష్‌గార్ల లాంటి హీరోలకు ఎలాంటి ఆదరణ దక్కుతుందో అలాంటి ప్రేమ నాకు తమిళంలో దక్కాలని. పద్నాలుగేళ్ల నా కెరీర్‌లో 29 సినిమాలు చేశాను. వీటిలో చాలా సినిమాలను ఫ్లాప్స్ అన్నారు. కానీ ఆ సినిమాల థియేట్రికల్ కలెక్షన్స్ బాగున్నాయని నాకు తెలుసు. ఒకవేళ అవి ఫ్లాప్స్ అనుకున్నప్పటికీ నాకు అవకాశాలు వస్తున్నాయంటే ఆడియన్స్ నన్ను ప్రేమించి, సపోర్ట్ చేస్తున్నట్లే కదా.
- నక్కిన త్రినాథరావుతో 'మజాకా' (వర్కింగ్ టైటిల్) సినిమా చేస్తున్నాను. స్వరూప్ డైరెక్షన్‌లో 'వైబ్' షూటింగ్ జరుగుతోంది. 'ఫ్యామిలీ మేన్ 3' వెబ్ సిరీస్‌లో నటిస్తున్నా. సైన్స్ ఫిక్షన్ సూపర్ హీరో ఫిల్మ్ 'మాయవన్ 2' ఉంది. 'ఊరు పేరు భైరవకోన' సీక్వెల్ ఆలోచన ఉంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	280	66
	80,149	24,413

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,510	▽ 488
డోజోన్స్	40,055	▽ 303
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,154	▽ 14
డాక్స్	18,387	▽ 170
షాంఘై	2,902	▽ 13
నికాయ్	39,155	▽ 440

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో


ముంబై		
బంగారం (24 క్యారెట్)	69,151	▽ 451
బంగారం (22 క్యారెట్)	68,874	▽ 449
వెండి (కిలో)	84,862	▽ 57

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.29	84.31
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	106.73	109.32
€	యూరో	ఒకటి	89.70	92.06
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.43	54.62
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.29	56.22
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.10	64.78
SAR	సౌదీ రియాల్	ఖామసంకేత	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	ఖామసంకేత	21.91	23.69
¥	చైనా యువాన్	ఖామసంకేత	10.65	12.48

తక్షణం తగ్గినా.. భవిత 'బంగారమే'!

పసిడి ధరలు మున్ముందు పైపైకే • అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, రూపాయి క్షీణత ఎఫెక్ట్



పుత్తడిపై కస్టమ్స్ సుంకాలు 15% నుంచి 6%కి తగ్గిస్తున్నట్లు వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన వెంటనే ఇటు స్పాట్‌లో అటు ఫ్యూచర్స్ మార్కెట్లలో రూ.4,000 వరకూ పడిపోయిన పసిడి ధరలు.. ఇదే రీతిలో ముందు ముందు ఆభరణ ప్రియులకు అంతే సంతోషాన్ని కలిగించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. అంతర్జాతీయ అంశాలతో పాటు దేశీయంగా రూపాయి విలువ పతనం ఇందుకు కారణం.

- భౌగోళిక ఉద్రిక్తతలను మొదట ప్రధాన కారణంగా చెప్పవచ్చు. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు, దీనికి పశ్చిమ దేశాల మద్దతు అలాగే చైనాతో అమెరికాకు ఉన్న రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితికి దారితీసే అంశాలు. ఎలాంటి ఉద్రిక్తతలు నెలకొన్నా.. పెట్టుబడి సాధనంగా ఇన్వెస్టర్ బంగారం వైపే చూస్తాడనడంలో సందేహం లేదు.
- ఇక రెండో అంశానికి వస్తే.. అమెరికాతో సహా పలు దేశాలు సరళతర వడ్డీరేట్ల విధానంలోకి మారినప్పటికీ ఆ విధానాన్ని ఎంతవరకూ కొనసాగిస్తాయో తెలియని పరిస్థితి. సరళతర వడ్డీరేట్ల విధానంతో బంగారంలో కొనుగోళ్లు పెరుగుతాయి. అయితే ఈ విధానం కొనసాగింపునకు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం సమస్యలు, సవాళ్లు ఉన్నాయి.
- కీలక మూడవ అంశం.. రూపాయి విలువ. డాలరుతో రూపాయి మారకం విలువ సరికొత్త కనిష్ట స్థాయి రికార్డులను కొనసాగిస్తోంది. బుధవారం ఆల్‌టైమ్ కనిష్టం 83.71 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 83.72 కనిష్టాన్ని తాకింది.

దేశీయంగా రెండోరోజూ భారీ తగ్గుదల

బడ్జెట్‌లో నిర్ణయంతో దేశీయంగా రెండవరోజూ బుధవారమూ దేశీయంగా ధరలు భారీగా తగ్గాయి. దేశ రాజధానిలో 99.9 స్వచ్ఛత ధర 10 గ్రాములకు రూ.650 తగ్గి, రూ. 71,650కి చేరింది. 99.5 స్వచ్ఛత ధర కూడా ఇంతే స్థాయిలో దిగివచ్చి రూ. 71,300కు దిగివచ్చింది. ఇక మంగళవారం రూ.4 వేల వరకూ తగ్గిన వెండి ధర బుధవారం అక్కడక్కడే 87,500 వద్ద ముగిసింది. దేశ రాజధాని ముంబైలో 99.9, 99.5 స్వచ్ఛత ధరలు వరుసగా రూ. 451, రూ.449 తగ్గి రూ.69,151, రూ.68,874కు దిగివచ్చాయి. వెండి ధర రూ.57 తగ్గి రూ.84,862 వద్ద ముగిసింది.

- భౌగోళిక ఆర్థిక అనిశ్చితి అంశాల నేపథ్యంలో... అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఈ నెల 16వ తేదీన ఔన్స్‌కు (31.1గ్రా) ఆల్‌టైమ్ హై 2,489 డాలర్లను తాకిన పసిడి ఆగస్టు కాంట్రాక్ట్ ధర అటు పై కొంత తగ్గినప్పటికీ... పటిష్ట స్థాయిలోనే కొనసాగుతోంది. అంతర్జాతీయ ఫ్యూచర్స్‌లో 18 డాలర్లు అధికంగా 2,425 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. భారత్‌లో రూపాయి క్షీణిస్తూ... అంతర్జాతీయంగా ధర పెరుగుదల ధోరణే కొనసాగిస్తే దేశీయంగా సైతం బంగారం మున్ముందుకే సాగుతుందనడంలో సందేహం లేదు.

పెట్టుబడులకు ప్లస్సే...

దేశీయంగా శుభకార్యాల్లో భారతీయులు పసిడి కొనుగోళ్లకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో అందరికీ తెలిసిన అంశమే. ఇది ఎలాగూ తప్పని అంశం. ఇక పసిడి పెట్టుబడులకు ఇది తగిన అవకాశమనడంలో సందేహం లేదు. వినియోగదారులకు ధరల తగ్గుదల ఇప్పుడు ప్రయోజనకరంగా ఎలానూ ఉంటుంది. తక్కువ ఖర్చులు అలాగే 2.5% వార్షిక వడ్డీని అందించే సావరిన్ గోల్డ్ బాండ్స్ వంటి డిజిటల్ ఆప్షన్‌లలో పెట్టుబడి పెట్టడానికి ఇది సరైన సమయం అనడంలో సందేహం లేదు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

నిస్సాన్ ఎక్స్-ట్రయల్ వచ్చేస్తోంది..


బుకింగ్స్ 26 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం నిస్సాన్ తమ ప్రీమియం ఎస్‌యూవీ ఫోర్త్ జనరేషన్ ఎక్స్-ట్రయల్‌ను ఆవిష్కరించింది. దీన్ని భారత మార్కెట్లో సీబీయూ (కంప్లీట్లీ బిల్టప్) మోడల్‌గా విక్రయించనుంది. ఇది టయోటా ఫార్చూనర్, స్కోడా కోడియాక్, జీప్ మెరీడియన్, ఎంజీ గ్లోస్టర్ తదితర వాహనాలకు పోటీనివ్వనుంది. భారత్‌లో ఇది మూడు వరుసల సీటింగ్‌తో 7 సీటర్‌గా ఉంటుంది. దీని బుకింగ్స్ జూలై 26న ప్రారంభం కానుండగా, డెలివరీలు ఆగస్టులో ప్రారంభమవుతాయని కంపెనీ తెలిపింది. బుకింగ్ అమౌంటు రూ. 1,00,000గా ఉంటుంది. సన్‌రూఫ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, 7 ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీ కెమెరా తదితర ఫీచర్లు ఇందులో ఉంటాయి. నిస్సాన్ ప్రస్తుతం భారత్‌లో కాంపాక్ట్ ఎస్‌యూవీ మాగ్నైట్‌ను మాత్రమే విక్రయిస్తోంది. వచ్చే 30 నెలల్లో అయిదు మోడల్స్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఎక్స్-ట్రయల్ ఆవిష్కరణ సందర్భంగా నిస్సాన్ ఇండియా ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోరెస్ తెలిపారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ @14.9 లక్షలు

బీఎండబ్ల్యూ నుంచి సీఈ 04



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీ జర్మనీ దిగ్గజం బీఎండబ్ల్యూ భారత మార్కెట్లో సీఈ 04 ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.14.9 లక్షల నుంచి ప్రారంభం. భారత్‌లో తొలి ప్రీమియం ఎలక్ట్రిక్ టూ వీలర్ ఇదేనని కంపెనీ ప్రకటించింది. ఒకసారి చార్జింగ్‌తో 130 కిలోమీటర్లు పరుగెడుతుంది. గరిష్ట వేగం గంటకు 120 కిలోమీటర్లు. గంటకు 50 కిలోమీటర్ల వేగాన్ని 2.6 సెకన్లలో అందుకుంటుంది. 42 హెచ్‌పీ పవర్‌తో లిక్విడ్ కూల్డ్ పర్మనెంట్ మాగ్నెట్ ఎలక్ట్రిక్ మోటార్ పొందుపరిచారు. 8.5 కిలోవాట్ అవర్ లిథియం అయాన్ బ్యాటరీ ఏర్పాటు చేశారు. కీలెస్ రైడ్, బ్లూటూత్ కనెక్టివిటీతో 10.25 అంగుళాల టీఎఫ్‌టీ కలర్ స్ప్లిట్ స్క్రీన్, డబుల్ డిస్క్ బ్రేక్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఆటోమేటిక్ స్టెబిలిటీ కంట్రోల్ ఇతర హంగులు. కాగా, రూ.72.9 లక్షల ప్రారంభ ధరతో సరికొత్త 5 సిరీస్ లాంగ్ వీల్‌బేస్ కారుతోపాటు రూ.44.9–54.9 లక్షల ధరల శ్రేణిలో కొత్త మినీ కూపర్ ఎస్, కొత్త ఆల్ ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ మోడళ్లు సైతం విడుదల అయ్యాయి.

యాక్సిస్ బ్యాంక్ లాభం ప్లస్

క్యూ1లో రూ. 6,436 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 6,436 కోట్లను తాకింది. స్టాండెలోన్ లాభం సైతం 4 శాతం వృద్ధితో రూ. 6,035 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 12 శాతం ఎగసి రూ. 13,448 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4.05 శాతం వద్ద నిలకడను ప్రదర్శించాయి. ఇతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,783 కోట్లకు చేరింది. అయితే స్థూల స్లిప్పేజీలు రూ. 3,471 కోట్ల నుంచి రూ. 4,793 కోట్లకు పెరిగాయి. రుణ నష్టాల ప్రొవిజన్లు రూ. 1,146 కోట్ల నుంచి రూ. 2,551 కోట్లకు భారీగా పెరిగాయి. ఈ కాలంలో 10 లక్షల క్రెడిట్ కార్డులను జారీ చేసినట్లు బ్యాంక్ సీఎఫ్‌వో పునీత్ శర్మ పేర్కొన్నారు. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 0.42% మెరుగుపడి 1.54%కి చేరాయి. అనుబంధ సంస్థలలో యాక్సిస్ ఫైనాన్స్ నికర లాభం 26% జంప్‌చేసి రూ. 154 కోట్లయ్యింది.

ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ షేరు బీఎస్‌ఈలో 1.8 శాతం తగ్గి రూ. 1,240 వద్ద ముగిసింది.

బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ

సెన్సెక్స్‌కు 280 పాయింట్ల నష్టం



ముంబై: ఎఫ్అండ్‌ఓ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను పెంపుతో పాటు మూలధన లాభాలపై పన్ను పెంచాలనే బడ్జెట్ ప్రతిపాదనల ప్రభావం స్టాక్ మార్కెట్‌పై బుధవారమూ కొనసాగింది. ఇన్వెస్టర్లు బ్యాంకులు, ఫైనాన్స్, ఆటో మొబైల్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సెన్సెక్స్ 280 పాయింట్లు నష్టపోయి 80,149 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 66 పాయింట్లు క్షీణించి 24,413 వద్ద నిలిచింది. కాగా, సూచీలకిది వరుసగా నాలుగోరోజూ నష్టాల ముగింపు. ఒక దశలో సెన్సెక్స్ 679 పాయింట్లు క్షీణించి 79,751 స్థాయికి, నిఫ్టీ 172 పాయింట్లు పతనమై 24,307 స్థాయికి దిగివచ్చాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

కొత్త పన్ను విధానంలోనే 66% రిటర్నులు

తగ్గిన బీఎస్‌ఎన్‌ఎల్ నష్టాలు

ఎల్‌అండ్‌టీ లాభం అప్

క్యూ1లో రూ. 2,786 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్‌అండ్‌టీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 12 శాతం పుంజుకుని రూ. 2,786 కోట్లను తాకింది. ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతం ఎగసి రూ. 55,120 కోట్లను తాకింది. వీటిలో అంతర్జాతీయ వాటా 48 శాతం జంప్ చేసి రూ. 26,248 కోట్లకు చేరింది. ఈ కాలంలో 8 శాతం అధికంగా రూ. 70,936 కోట్ల ఆర్డర్లను అందుకుంది. ప్రధానంగా మధ్యప్రాచ్యం నుంచి లభించిన కాంట్రాక్టులు ఇందుకు సహకరించాయి. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, భౌగోళిక అనిశ్చితులలోనూ తాజా త్రైమాసికంలో ఆర్థికంగా అన్ని అంశాలలోనూ నిలకడైన వృద్ధిని సాధించినట్లు కంపెనీ సీఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ పేర్కొన్నారు. ఇటీవలే సెమీకండక్టర్ విభాగంలో చిప్ డిజైన్ కంపెనీ సిలికాంచ్ సిస్టమ్స్‌తో ఎల్‌అండ్‌టీ వాటా కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం నీరసించి రూ. 3,519 వద్ద ముగిసింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ డియోఘర్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

డియోఘర్(జార్ఖండ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 66.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-25, అడిషనల్ ప్రొఫెసర్-14, అసోసియేట్ ప్రొఫెసర్-09, అసిస్టెంట్ ప్రొఫెసర్-18.
» **విభాగాలు:** అనెస్థీషియాలజీ, బయో కెమిస్ట్రీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, రేడియో-డయాగ్నోసిస్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900 నుంచి రూ.2,20,400, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,42,200 నుంచి రూ.2,11,400, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,38,300 నుంచి రూ.2,11,400, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500 నుంచి రూ.1,67,400.
» **వయసు:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు 58 ఏళ్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్,ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎయిమ్స్ డియోఘర్, అకడమిక్ బ్లాక్, నాలుగో ఫ్లోర్, రిక్రూట్‌మెంట్ సెల్,దేవిపూర్,డియోఘర్ జిల్లా, జార్ఖండ్-814152 చిరునామకు పంపించాలి.
» **ఈమెయిల్:** recruitment2022@aiimsdeoghar.edu.in.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 16.07.2024.
» **ఈమెయిల్ ద్వారా దరఖాస్తులకు చివరితేది:** 10.08.2024.
» **ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులకు చివరితేది:** 17.08.2024.
» **వెబ్‌సైట్:** www.aiimsdeoghar.edu.in

ఐహెచ్‌బీఏఎస్, ఢిల్లీలో 42 పోస్టులు

ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్ (ఐహెచ్‌బీఏఎస్).. రెగ్యులర్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 42
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-04, అడిషనల్ ప్రొఫెసర్-07, అసోసియేట్ ప్రొఫెసర్-12, అసిస్టెంట్ ప్రొఫెసర్-19.
» **విభాగాలు:** న్యూరో రేడియాలజీ, న్యూరో సర్జరీ, న్యూరో అనెస్థీషియా, న్యూరాలజీ, క్లినికల్ సైకాలజీ,సైకియాట్రీ, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, సైకియాట్రిక్ నర్సింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధనానుభవం ఉండాలి.
» **వయసు:** 41 నుంచి 50 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ డైరెక్టర్, ఐహెచ్‌బీఏఎస్, దిల్షాద్ గార్డెన్, ఢిల్లీ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.08.2024.
» **వెబ్‌సైట్:** https://ihbas.delhi.gov.in

జిప్‌మర్, పుదుచ్చేరిలో 209 గ్రూప్ బి, సి పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్) గ్రూప్ బి, సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 209.
» **పోస్టుల వివరాలు:** గ్రూప్ బి పోస్టులు-169, గ్రూప్ సి పోస్టులు-40.
» **గ్రూప్ బి పోస్టులు:** జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్-01, జూనియర్ ఆక్యుపేషనల్ థెరపిస్ట్-01, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్-04, నర్సింగ్ ఆఫీసర్-154, ట్యూటర్ ఇన్ స్పీచ్ పాథాలజీ అండ్ ఆడియాలజీ-01, ఎక్స్‌రే టెక్నీషియన్(రేడియోథెరపీ)-01, ఎక్స్‌రే టెక్నీషియన్(రేడియో డయాగ్నోసిస్)-05, టెక్నికల్ అసిస్టెంట్ ఎలక్ట్రానిక్స్(ఫిజియాలజీ)-01, టెక్నికల్ అసిస్టెంట్(న్యూక్లియర్ మెడిసిన్)-01.
» **గ్రూప్ సి పోస్టులు:** అనెస్థీషియా టెక్నీషియన్-1, ఆడియాలజీ టెక్నీషియన్-1, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-24, ఫార్మాసిస్ట్-6, రెస్పిరేటరీ ల్యాబొరేటరీ టెక్నీషియన్-2,స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2-1, కార్డియోగ్రాఫీ టెక్నీషియన్-5.
» **అర్హత:** పన్నెండో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 27 నుంచి 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పదేళ్లు గరిష్ట వయో పరిమితి ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.08.2024
» **పరీక్ష తేది:** 14.09.2024.
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

» క్లాట్-2025 నోటిఫికేషన్ విడుదల
» క్లాట్ స్కోర్‌తో 24 నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశం
» యూజీ, పీజీ ప్రోగ్రామ్‌లకు వేర్వేరుగా క్లాట్ ఎంట్రన్స్

న్యాయం చేసే లా

నేషనల్ లా యూనివర్సిటీస్.. దేశంలో న్యాయ విద్య బోధనలో పేరెన్నిక గల విద్యాసంస్థలు! వీటిలో బ్యాచిలర్, పీజీ స్థాయిలో..'లా' కోర్సులను పూర్తి చేసుకుంటే.. న్యాయవాద వృత్తిలో రాణించే నైపుణ్యాలతోపాటు కార్పొరేట్ కెరీర్స్ సైతం స్వాగతం పలుకుతాయి. ఇలాంటి నేషనల్ లా యూనివర్సిటీల్లో న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి మార్గం.. క్లాట్! 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి క్లాట్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. క్లాట్-2025 అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



న్యాయ విద్య కోర్సులు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎంలపై యువతలో ఆసక్తి పెరుగుతోంది. దీనికి కారణం.. సంప్రదాయ న్యాయవాద వృత్తితోపాటు కార్పొరేట్ రంగంలోనూ కొలువులు లభిస్తుండడమే. క్లాట్ స్కోర్ ఆధారంగా ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ-ఎల్ఎల్‌బీ, అదే విధంగా పీజీ స్థాయిలో ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇందుకోసం ప్రతిఏటా కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో క్లాట్‌ను నిర్వహిస్తారు.

క్లాట్ యూజీ, పీజీ

బ్యాచిలర్ స్థాయిలో బీఏ-ఎల్ఎల్‌బీ, పీజీ స్థాయిలో ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు క్లాట్-యూజీ, క్లాట్-పీజీ నిర్వహిస్తారు. బీఏ-ఎల్ఎల్‌బీ ప్రవేశం కోసం క్లాట్-యూజీ, ఎల్ఎల్ఎంలో అడ్మిషన్ కోసం క్లాట్-పీజీలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

అర్హతలు

- **క్లాట్-యూజీ:** కనీసం 45శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **క్లాట్-పీజీ:** కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు లభిస్తుంది. ఆయా కోర్సులు చివరి సంవత్సరం అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

120 మార్కులకు పరీక్ష

- క్లాట్-యూజీ పరీక్షను అయిదు విభాగాల్లో నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 22-26 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్, జీకే 28-32 ప్రశ్నలు, లీగల్ రీజనింగ్ 28-32 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 22-26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ 10-14 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తంగా అన్ని విభాగాలు కలిపి 120 ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు కేటాయించిన మార్కులు 120. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్, కరెంట్ అఫైర్స్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్‌లలో పూర్తిగా ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలే అడుగుతారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగంలోనూ గ్రాఫ్స్, టేబుల్స్, డయాగ్రమ్స్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి.
- మొత్తం ప్రశ్నల్లో.. ఇంగ్లిష్ లాంగ్వేజ్, లాజికల్ రీజనింగ్‌ల నుంచి 20 శాతం చొప్పున; కరెంట్ అఫైర్స్ అండ్ జీకే, లాజికల్ రీజనింగ్‌ల నుంచి 25 శాతం చొప్పున; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌ను నుంచి 10 శాతం చొప్పున ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

క్లాట్-పీజీ ఇలా

- బీఏ-ఎల్ఎల్‌బీ, లేదా ఎల్ఎల్‌బీ అర్హతగా నేషనల్ లా యూనివర్సిటీల్లోని ఎల్ఎల్ఎం స్పెషలైజేషన్లలోని సీట్ల భర్తీకి క్లాట్-పీజీ పరీక్షను 120 ప్రశ్నలు-120 మార్కులకు నిర్వహిస్తారు.
- ప్యాసేజ్ ఆధారితంగా ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు అడుగుతారు.
- పరీక్షలో కాన్‌స్టిట్యూషనల్ లా సంబంధిత ప్రశ్నలు, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 15.07.2024
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 15.10.2024
- **క్లాట్ పరీక్ష తేదీ:** 2024, డిసెంబర్ 1
- **వెబ్‌సైట్:** https://consortiumofnlus.ac.in/clat-2025

రాత పరీక్షలో రాణించేలా

క్లాట్ ఎంట్రన్స్‌లలో విజయం సాధించాలంటే.. విద్యార్థులు నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేయాలి. క్లాట్ యూజీకి పోటీ అధికంగా ఉంటుంది. కాబట్టి సిలబస్‌ను, గత ప్రశ్న పత్రాలను పరిశీలించి.. సెక్షన్ల వారీగా పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. అయిదు సెక్షన్లలోనూ మెరుగైన ప్రతిభ చూపే ప్రయత్నం చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యాన్ని పరిశీలించే ఈ సబ్జెక్ట్‌లో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగంలో రాణించడానికి కాంప్రహెన్షన్, ప్యాసేజ్ రీడింగ్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. సునిశిత పరిశీలన నైపుణ్యం, ఇచ్చిన ప్యాసేజ్ సారాంశాన్ని గ్రహించడం, ప్యాసేజ్ ప్రధాన ఉద్దేశం తెలుసుకోవడం వంటి నైపుణ్యాలు పెంచుకోవాలి. ఇందుకోసం జనరల్ ఎస్సేలు, న్యూస్ పేపర్ ఎడిటోరియల్స్, ఇతర ముఖ్య ప్రచురణలు చదవాలి.

కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్

సమకాలీన అంశాలు, కళలు, సంస్కృతి, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాధాన్యత కలిగిన చారిత్రక అంశాలకు సంబంధించిన ప్యాసేజ్‌లు ఇచ్చి వీటి నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకూ.. అన్నీ తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సుల గురించి పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి.

లీగల్ రీజనింగ్

న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. సంబంధిత ప్యాసేజ్‌ల నుంచి నిబంధనలు, సిద్ధాంతాలు, వాస్తవాలు, వాటిద్వారా చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. నిర్దిష్టంగా ఒక సంఘటన, వివాదాన్ని పరిష్కరించేందుకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవడం కూడా ఈ విభాగంలో మంచి మార్కులకు దోహదం చేస్తుంది.

లాజికల్ రీజనింగ్

తార్కిక విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉండే విభాగం ఇది. ఇందులోనూ ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ విభాగంలో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు; అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం సిలాజిజమ్, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పొందాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.

క్వాంటిటేటివ్ టెక్నిక్స్


ఈ విభాగంలో రాణించేందుకు పదో తరగతి స్థాయిలోని గణిత అంశాలపై పట్టు సాధించాలి. గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే.. అర్థమెటిక్‌కు కొంత ఎక్కువ వెయిటేజీ కనిపిస్తోంది. కాబట్టి పర్సంటేజెస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ స్పీడ్, యావరేజెస్, రేషియోస్ తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, చార్ట్‌లను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

క్లాట్ పీజీకి ఇలా

తాజాగా ముఖ్యమైన తీర్పులు, రాజ్యాంగ, శాసన పరమైన అంశాలు, చారిత్రాత్మక తీర్పులు, వాటి ప్రభావం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. తాము ఎంపిక చేసుకోనున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి అకడమిక్‌గా బ్యాచిలర్ స్థాయిలోని అంశాలపై పట్టు సాధించడం మేలు చేస్తుంది.

కెరీర్ అవకాశాలు

క్లాట్‌లో విజయంతో నేషనల్ లా యూనివర్సిటీల్లో అడుగు పెట్టి కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉజ్వల కెరీర్ అవకాశాలు ఖాయమని చెప్పొచ్చు. న్యాయవాద వృత్తి మాత్రమే కాకుండా.. కార్పొరేట్ కొలువులు సైతం సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం అంతర్జాతీయ వాణిజ్య విధానాలు, పలు దేశాల కంపెనీల మధ్య ఒప్పందాలతో కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎదురయ్యే న్యాయ సమస్యల పరిష్కారానికి సంస్థలు న్యాయ నిపుణులను నియమించుకుంటున్నాయి. నేషనల్ లా యూనివర్సిటీల్లో కార్పొరేట్ సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ సైతం నిర్వహిస్తున్నాయి. క్యాంపస్ డ్రైవ్స్‌లో సగటున రూ.8 లక్షల వార్షిక వేతనంతో కొలువులు ఖరారవుతున్నాయి.



నిఫా.. ఇలా సఫా..



ఫ్రూట్ బ్యాట్స్ ద్వారా వ్యాపించే 'నిఫా' వైరస్

అవి కొరికిన పండ్ల ద్వారా మనుషుల్లోకి ప్రవేశం

కొన్ని సందర్భాల్లో పందుల ద్వారా కూడా సోకే అవకాశం

దాదాపు పాతికేళ్లుగా దీని ఉనికి.. ప్రత్యేక చికిత్స ఏదీ లేదు

తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందంటున్న వైద్య నిపుణులు

ఈ వైరస్ వ్యాప్తి తీరు, లక్షణాలు, జాగ్రత్తలపై నిపుణుల సూచనలివి..

హెల్త్ డెస్క్: ఇటీవల కేరళలో నిఫా వైరస్‌తో పద్నాలుగేళ్ల చిన్నారి మృతిచెందడం కలవరం రేపింది. ఆ వైరస్ వ్యాపిస్తోందంటూ మీడియాలో, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో జనంలో ఆందోళన మొదలైంది. కానీ 'నిఫా' విషయంలో అంత భయమేమీ అవసరం లేదని.. ప్రస్తుతం కేరళలో తప్ప మరే రాష్ట్రంలోనూ దాని ఆనవాళ్లు లేవని వైద్య నిపుణులు చెప్తున్నారు. కాస్త జాగ్రత్తగా ఉంటే 'నిఫా' మన దరికి చేరే ప్రమాదం ఉండదని స్పష్టం చేస్తున్నారు.

ఎప్పట్నుంచో ఉన్న వైరసే ఇది..

ఆరేళ్ల కింద మన దేశంలో తొలిసారిగా 'నిఫా' వైరస్ కేసులు నమోదయ్యాయి. కానీ ఇది ప్రపంచానికి కొత్తదేమీ కాదు. 1998లోనే మలేషియాలోని 'కాంపంగ్ షుంగై నిఫా' అనే ప్రాంతంలో తొలిసారిగా మనుషులకు సంక్రమించింది. ఆ ప్రదేశం పేరిటే దీన్ని 'నిఫా'గా పిలుస్తున్నారు. తర్వాత 2004లో బంగ్లాదేశ్‌ను బెంబేలెత్తించింది. కాస్త అరుదుగానైనా అప్పుడప్పుడూ (స్పొరాడిక్‌గా) భారత్, బంగ్లాదేశ్‌లలో ఈ వైరస్ కేసులు నమోదవుతున్నాయి.

వ్యాపించేది ఇలా..

- 'నిఫా' ప్రధానంగా జంతువుల నుంచి వ్యాపించే (జూనోటిక్) వ్యాధి.
- తాటి, ఈత, ఖర్జూర జాతికి చెందిన చెట్ల పండ్లను తినే ఫ్రూట్ బ్యాట్స్ రకం గబ్బిలాల ద్వారా ఎక్కువగా వ్యాపిస్తుంది. వీటితోపాటు జామ వంటి ఇతర పండ్లనూ అవి తింటుంటాయి. ఆ పండ్లలో 'నిఫా' వైరస్ ఉండే ప్రమాదం ఎక్కువ.
- చిలక కొట్టిన పండు అంటూ సగం కొరికి ఉన్న ఏ పండ్లనూ తినకపోవడం మంచిది.
- కొన్నిచోట్ల పందుల ద్వారా కూడా ఈ వైరస్ వ్యాపించే ప్రమాదముంది. అప్పటికే వైరస్ సోకిన వారి నుంచి ఇతరులకూ సంక్రమిస్తుంది.



ప్రత్యేకమైన చికిత్స ఏదీ లేదు..

నిఫా వైరస్‌కు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి కచ్చితమైన చికిత్సా విధానం, మందులు లేవు. లక్షణాల తీవ్రతను బట్టి ఉపశమనం కోసం మందులు ఇస్తుంటారు. కొన్నిరకాల యాంటీ వైరల్ ఔషధాలతో చికిత్స చేస్తారు. వ్యాక్సిన్‌ను రూపొందించినా అది అంత ప్రభావవంతంగా పనిచేయడం లేదని తేలింది. 'నిఫా' సోకిన వారిని ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తారు.

– డాక్టర్ కె.శివరాజు, సీనియర్ ఫిజీషియన్, కిమ్స్

నిర్ధారణ చేసేదిలా..

'నిఫా' లక్షణాలున్న బాధితుల నుంచి శాంపిళ్లను సేకరించి పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపుతారు. ప్రస్తుతం దేశంలో 'నిఫా' వైరస్‌ను కచ్చితంగా గుర్తించే సదుపాయాలు అక్కడే ఉన్నాయి. వైరాలజీ ల్యాబ్‌లో ఎలిసా టెస్ట్, క్వాంటిటేటివ్ పీసీఆర్ (పాలిమరేజ్ చైన్ రియాక్షన్), సెల్ కల్చర్ (వైరస్ ఐసోలేషన్) తదితర టెస్టుల ద్వారా వైరస్‌ను గుర్తిస్తారు.

నిఫా నుంచి రక్షణ ఇలా..

- ఫ్రూట్ బ్యాట్స్ నుంచి దూరంగా ఉండటం. అవి కొరికి తిన్న పండ్లను ఎట్టిపరిస్థితుల్లో ముట్టుకోకపోవడం.
- గబ్బిలాలు తిరిగే చోట డేట్‌పామ్ జాతికి చెందిన తాటి, ఈత, ఖర్జూర పండ్లకు దూరంగా ఉండటం. (ప్రాసెస్ చేసిన ఖర్జూర పండ్లను తినవచ్చు)
- ఏదైనా కొరికినట్టు కనిపించిన ఏ పండునూ కూడా తినకపోవడం.
- పందుల ఫామ్స్‌కూ, పందుల పెంపకందార్లకు కొద్దిరోజులు దూరంగా ఉండటం.
- ఏదైనా వైరల్ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి నుంచి దూరంగా ఉండటం.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం. శానిటైజర్లను వాడటం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం.



- దూర ప్రయాణాల్లో లేదా గుంపుగా జనం ఉన్న ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు 'ఎన్ 95' మాస్క్‌ను ధరించడం.
- పరిసరాల పరిశుభ్రత పాటించడం.

స్వామివారి అన్నప్రసాదం ఆరగిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్



శ్రీవారి సేవలో తెలంగాణ గవర్నర్

తిరుమల శ్రీవారిని బుధవారం తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు. - తిరుమల

గో'దారి' సముద్రానికే..

- ఇప్పటికే 393 టీఎంసీలు సముద్రంపాలు

సాక్షి, హైదరాబాద్: గలగలా గోదారి సముద్రం వైపు కదిలిపోతోంది. ఈ నీటి సంవత్సరంలో ఇప్పటికే 393 టీఎంసీలు సముద్రంపాలయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడటంతో మరమ్మతులు పూర్తయ్యే వరకు వాటిలో నీళ్లను నిల్వ చేసే పరిస్థితి లేకుండా పోయింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కీలకమైన మూడు బరాజ్‌లు నిరుపయోగంగా మారడంతో వాటి పంప్‌హౌజ్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసే ప్రక్రియను చేపట్టడం లేదు. మరోవైపు ఎగువ గోదావరిపై ఉన్న ఎల్లంపల్లితోపాటు మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ తదితర ప్రాజెక్టులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. మరోవైపు పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతుండటంతో ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, శబరి వంటి ఉపనదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాణహిత కలిసే కాళేశ్వరం (తెలంగాణ) నుంచి సముద్రంలో కలిసే అంతర్వేది (ఏపీ) వరకూ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరికి ప్రాణహిత వరద తోడుకావడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కి 7,87,400 క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చింది వచ్చినట్టే కిందికి విడుదల చేస్తున్నారు. దిగువన తుపాకుల గూడెం (సమ్మక్క) బరాజ్ నుంచి 9,75,910 క్యూసెక్కులు, దుమ్ముగూడెం (సీతమ్మ సాగర్) బరాజ్ నుంచి 10,11,364 క్యూసెక్కుల వరదను వచ్చింది వచ్చినట్టు దిగువన వదిలేస్తున్నారు. మరోవైపు భద్రాచలం వద్ద నీటిమట్టం మరింతగా తగ్గింది. మంగళవారం రాత్రి భద్రాచలం వద్ద నీటిమట్టం 50.40 అడుగులు ఉండగా, బుధవారం సాయంత్రం 5 గంటలకు 45.30 అడుగులకు తగ్గింది. దీంతో అక్కడ రెండో ప్రమాద హెచ్చరికను ఎత్తివేసి ఒకటో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

పడకల్లేక పాట్లు

- ఇల్లెందు ఆస్పత్రికి ఒక్కరోజే 97 మంది జ్వరపీడితులు




రోగులు, వారి సహాయకులతో కిక్కిరిసిన జనరల్ వార్డు

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి జ్వర పీడితులతో పోటెత్తింది. బుధవారం ఒకే రోజు 97 మంది రావడంతో ఒక్కొక్క పడకపై ఇద్దరు, ముగ్గురు బాధితులను పడుకోబెట్టి చికిత్స చేయాల్సి వచ్చింది. ఇది 100 పడకల ఆస్పత్రి అయినప్పటికీ ప్రస్తుతం 46 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రిలో సమస్యల పరిశీలనకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వచ్చిన సమయంలోనే.. ఒక్కో పడకపై ఇద్దరు, ముగ్గురు రోగులుండటాన్ని చూసి అవాక్కయ్యారు. ఆస్పత్రిలో తగిన సదుపాయాలు కల్పిస్తామని, వైద్యులు, సిబ్బంది కూడా బాధ్యతగా పనిచేయాలని ఆయన సూచించారు. మందులు సరిపడా ఉన్నాయా? అని ఆరా తీశారు.

బిరబిరా కృష్ణమ్మ

- ఎగువ కృష్ణా పాయలో పెరిగిన వరద ఉధృతి
- శ్రీశైలం ప్రాజెక్టులోకి పెరుగుతున్న ప్రవాహం



జూరాల ప్రాజెక్టు వద్ద 41 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

సాక్షి, హైదరాబాద్/ధరూరు: బిరబిరా కృష్ణమ్మ వరదెత్తింది. శ్రీశైలం ప్రాజెక్టులో వరద భారీగా పెరిగింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టుకు 1,51,481 క్యూసెక్కుల ప్రవాహం రాగా, బుధవారం సరిగ్గా అదే సమయానికి 1,75,448 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 842.42 నుంచి 848.75 అడుగులకు.. నిల్వ 63.81 టీఎంసీల నుంచి 79.63 టీఎంసీలకు పెరిగింది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఎగువన కృష్ణా ప్రధాన పాయతోపాటు ఉపనదుల్లో వరద ఉధృతి పెరిగింది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లు ఇప్పటికే నిండుకుండలాగా మారగా, ఎగువ నుంచి వరద ఉధృతి పెరగడంతో వచ్చిన వరదను వచ్చినట్టు కిందికి వదిలేస్తున్నారు. ఆల్మట్టి డ్యామ్ నుంచి 2 లక్షల క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 2,02,625 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో గురువారం ఉదయం 6 గంటల నాటికి జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు 1,94,222 క్యూసెక్కుల వరద రానుందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 1,80,000 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 1,57,122 క్యూసెక్కులను విద్యుదుత్పత్తి చేస్తూ.. గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, 6.22 టీఎంసీల నిల్వను మాత్రమే కొనసాగిస్తున్నారు. పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో మళ్లీ వరద ఉధృతి పెరిగింది. దీంతో తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తి 18,746 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. ఇటు జూరాల నుంచి కృష్ణా.. అటు సుంకేశుల నుంచి తుంగభద్ర జలాలు వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి మరింతగా పెరగనుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.